www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మత్తు అడ్డాలుగా విద్యాలయాలు

పదకొండేళ్లకే పిల్లల్లో డ్రగ్స్ వినియోగం

- గంజాయి తీసుకుంటున్న మగపిల్లలు
- నల్లమందుకు ఆడపిల్లల బానిసలు
- అటుగా ఆకర్షిస్తున్న వయసు ప్రభావం
- తేలిగ్గా దొరుకుతుండటమూ కారణమే
- పది నగరాలు.. 5,920 మందిపై అధ్యయనం
- గోప్యంగా సర్వే జరిపిన మెడికల్ బృందాలు
- ప్రతి ఏడు స్కూళ్లలో ఒకచోట డ్రగ్స్ భూతం



2

గురువారం | 11-12-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 275 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి మ.1:57 తదుపరి అష్టమి, నక్షత్రం: పుబ్బ తె.3:56 తదుపరి ఉత్తర, వర్జ్యం: ఉ.11:08-12:48, దుర్ముహూర్తం: ఉ.10:18-11:02, మ.2:42-3:26, అమృతఘడియలు: రా.9:12-10:53, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:38, సూర్యాస్తమయం: 5:37 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

డ్రోన్ సిటీలో పెట్టుబడులు పెట్టండి



గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో లోకేశ్ కరచాలనం

- అసెంబ్లింగ్, టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు చేయండి
- గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌కు లోకేశ్ విజ్ఞప్తి
- విశాఖలో గూగుల్ డేటా సెంటర్ పనులపై చర్చ
- అమెరికాలో ఐటీ దిగ్గజ సంస్థల ప్రతినిధులతో భేటీ
- ఏపీలో ఏటీఎంపీ యూనిట్ ఏర్పాటు చేయండి
- ఇంటెల్ ఐటీ సీటీవో శేష కృష్ణపురతో భేటీలో లోకేశ్
- లోకేశ్ ప్రతిపాదనలకు టెక్ దిగ్గజాల సానుకూలత
- మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియా కౌన్సిల్ భేటీలో లోకేశ్

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి భారీ పెట్టుబడులు సాధించేందుకు, టెక్నాలజీ పరంగా ఏపీని ప్రగతి పథంలో నడిపేందుకు మంత్రి లోకేశ్ ప్రపంచ దిగ్గజ టెక్ కంపెనీల ముఖ్య ప్రతినిధులతో భేటీ అయ్యారు. అమెరికా, కెనడా పర్యటనలో ఉన్న ఆయన బుధవారం.. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో పాటు ఇంటెల్, ఎన్‌విడియా, అడోబ్, జూమ్ తదితర సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో సుందర్ పిచాయ్‌తో సుమారు 2 గంటలపాటు భేటీ జరిగింది. విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు ముందుకు వచ్చినందుకు

మిగతా 13వ పేజీలో...

పరుగు తీయాలి

మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీలకు సీఎం ఆదేశం

- ఆయా శాఖల పని తీరుపై సుదీర్ఘ సమీక్ష
- ప్రోగ్రెస్ రిపోర్ట్, 'సంతృప్తి' శాతాలతో ప్రజెంటేషన్
- నిర్దిష్ట లక్ష్యాలు విధిస్తూ ఆదేశాలు
- సంక్షేమం, అభివృద్ధి.. రెండూ జరగాల్సిందే
- తగిన విధంగా ఆర్థిక వనరుల సమీకరణ
- 3 నెలల్లో ప్రజల్లో సంతృప్తి 80 శాతం కావాలి
- 15 రోజుల్లో ఫైలు క్లియర్ చేయాల్సిందే
- మంత్రులు, కార్యదర్శులు ప్రజల్లోకి వెళ్లాలి
- జనవరి 15 నుంచి ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే



మంత్రులు, శాఖాధిపతులు, కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కేంద్ర నిధుల్ని ఖర్చు చేయలేరా?

- మురిగిపోయే పరిస్థితి రానీయొద్దు
- డెడ్‌లైన్ పూర్తవ్వగానే శాఖలకు ఫోన్ చేస్తా
- అప్పటికీ వాడకపోతే మీ జీతాల నుంచి కట్‌చేస్తా
- కార్యదర్శులను హెచ్చరించిన చంద్రబాబు

14

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వృద్ధి రేటు నుంచి ప్రజల్లో సంతృప్తి దాకా... ఆన్‌లైన్‌లోనే సేవల నుంచి పెండింగ్ ఫైల్స్ దాకా... కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల నుంచి ఆయా శాఖల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం దాకా... అనేక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. బుధవారం సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులు, విభాగాల అధిపతులతో మూడుగంటలకుపైగా సమావేశమయ్యారు. 'మినీ కలెక్టర్ల సదస్సు' తరహాలో జరిగిన ఈ భేటీలో ఆయా శాఖలపై

మిగతా 6వ పేజీలో...

ఫైళ్ల 'పరుగు' ఇలా!

- డోలా, నిమ్మల, ఫరూక్ టాప్
- సీఎం, లోకేశ్‌కు 3 రోజులు
- దుర్గేశ్, సత్యకుమార్ కూడా
- పవన్, కొండపల్లికి 4 రోజులు
- 15 రోజులు తీసుకుంటున్న కొల్లు, రాంప్రసాదరెడ్డి

6

పల్లెల్లో.. పట్టణ స్థాయి సేవలు



పీఆర్ ఉద్యోగులతో 'మాటామంతి'లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

సంస్కరణలకు అత్యంత ప్రాధాన్యం

- ప్రధాని, సీఎం నేతృత్వంలో మార్పు.. ప్రజల సంతోషమే ముఖ్యం
- ఉద్యోగులకు పదోన్నతులిచ్చాం.. ఆ మేరకు ఫలితాలూ రావాలి
- వైసీపీ హయాంలో పదోన్నతులు, బదిలీలకూ బేరం పెట్టారు
- ఆర్థికం గాడినపడితే అన్నీ చేస్తాం.. ఉద్యోగినులను వేధించొద్దు
- పంచాయతీరాజ్ 'మాటామంతి'లో డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, నగరాల్లో అందుతున్న స్థాయిలో అన్ని సేవలూ గ్రామీణ ప్రజలకు చేరువ కావాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. బుధవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్ ఉద్యోగులతో నిర్వహించిన 'మాటామంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ శాఖలో సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. ముఖ్యంగా ఎప్పటి నుంచో పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు అత్యంత పారదర్శకంగా పదోన్నతులు కల్పించామన్నారు. "పదోన్నతులతో మీరు ఎంత సంబరపడ్డారో.. మీరు అందించే సేవల ద్వారా ప్రజలు కూడా అంతే ఆనందపడాలి. ప్రజా సేవలో నిష్పక్షపాతంగా, నిబద్ధతతో పని చేయాలి." అని ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ఇంజనీరింగ్ విభాగంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్

మిగతా 14వ పేజీలో...

దీపావళికి యునెస్కో గుర్తింపు

ప్రధాని మోదీ, షా హర్షం

2

హెచ్1బీ వీసా ఇంటర్వ్యూలు రద్దు



వివేకా హత్య కేసులో మరింత దర్యాప్తునకు ఓకే!

- పాక్షిక విచారణకు అనుమతించిన నాంపల్లి సీబీఐ కోర్టు
- సునీల్ యాదవ్, కిరణ్ యాదవ్‌తో వైఎస్ ప్రకాశ్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి ఫోన్ సంభాషణలపైనే దర్యాప్తు
- నెల రోజుల్లో పూర్తిచేయాలని సీబీఐకి నిర్దేశం

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు చేసేందుకు సీబీఐ కోర్టు పాక్షికంగా అనుమతించింది. ఈ కేసులోని అసలు సూత్రధారులు తప్పించుకోకుండా ఉండాలంటే మరోసారి సమగ్ర దర్యాప్తు చేయాలని గత నెల 21వ తేదీన నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో వివేకా కుమార్తె సునీతారెడ్డి పిటిషన్ వేయడం తెలిసిందే. దీనిపై విచారించిన న్యాయాధికారి టి.రఘురాం కొన్ని షరతులతో దర్యాప్తు చేసేందుకు అనుమతి ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న సునీల్ యాదవ్, అతడి సోదరుడు కిరణ్ యాదవ్‌తో వైఎస్ ప్రకాశ్‌రెడ్డి, వైసీపీ యువజన విభాగంలో కీలకంగా పని చేసిన ప్రకాశ్‌రెడ్డి మనవడు అర్జున్‌రెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, మెసేజ్‌ల

మిగతా 2వ పేజీలో...



షా X రాహుల్

- ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటులో వాడీ వేడి చర్చ
- ఎస్ఐఆర్‌పై అబద్ధాలు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షం
- నెహ్రూ నుంచి మన్మోహన్ దాకా ఎస్ఐఆర్ కొనసాగింది
- అప్పుడు ఏ రాజకీయ పార్టీ వ్యతిరేకించలేదు: అమిత్ షా
- నా మీడియా సమావేశాలపై చర్చకు షా సిద్ధమా?: రాహుల్
- తానేం మాట్లాడాలో ప్రతిపక్ష నేత నిర్దేశించలేరన్న షా

2

పట్టు కాదు.. పాలిస్టర్

టీటీడీలో వెలుగు చూసిన మరో స్కామ్



- శ్రీవారిని దర్శించే ప్రముఖులు, భక్తులకు కప్పే పట్టు వస్త్రాల కొనుగోళ్లలో కక్కుర్తి
- ధర్మవరం, మైసూరు ల్యాబ్‌ల్లో నిర్ధారణ
- రూ.350 విలువైనది 1,389కు కొనుగోలు
- నగరి వీఆర్ఎస్ ఎక్స్‌పోర్టు నుంచే వేలాదిగా
- ఏసీబీ విచారణకు టీటీడీ లేఖ

తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో శ్రీవారి ప్రసాదానికి వినియోగించిన నెయ్యి కల్తీ.. పరకామణిలో చోరీ కేసు రాజీ.. చివరికి శ్రీవారిని దర్శించే ప్రముఖులు, భక్తులకు కప్పే పట్టువస్త్రాల కొనుగోలులోనూ దగా.. పట్టు పేరిట పాలిస్టర్ వస్త్రాలు కొనుగోలు చేసి మోసం చేశారు. గత పాలక మండళ్ల హయాంలో

మిగతా 2వ పేజీలో...



కల్తీ నెయ్యిపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదేం?

- టీటీడీ చైర్మన్‌కు ఇచ్చిన సమాచారం ఈవోకు ఎందుకు ఇవ్వలేదు?
- తెలిసీ ఎందుకు అనుమతించారు?
- మైసూరు సీఎఫ్‌టీఆర్ఐ రిపోర్టును ఎందుకు తొక్కిపెట్టారు?
- డెయిరీలకు సహకరించకపోతే 3.50 లక్షలు ఎందుకు తీసుకున్నారు?
- సుబ్రహ్మణ్యంపై సిట్ ప్రశ్నల వర్షం

6

ఆ 12 మందిపై ప్రాసిక్యూషన్!

టీటీడీ ఈవో అనుమతి కోరుతూ సిట్ లేఖ

ప్రాయోజిత సంక్షోభం?

ఇండిగో విమానాల రద్దు ఉద్దేశపూర్వకమే కావొచ్చు

- పరిష్కారం కోసం అన్ని కోణాలనూ పరిశీలిస్తున్నాం
- అవసరమైతే ఇండిగో సీఈవోను తొలగిస్తాం
- జరిమానాలు, అత్యంత కఠిన చర్యలు ఉంటాయి
- వారం రోజులుగా సరిగా నిద్రకూడా పోలేదు
- పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు
- బుధవారం 250కుపైగా ఇండిగో సర్వీసులు రద్దు



న్యూఢిల్లీ, డిసెంబరు 10: ఇండిగో సంక్షోభం, భారీగా విమానాల రద్దు ఉద్దేశపూర్వకమే అయి ఉండొచ్చని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. సంక్షోభం ముందు వరకు ఉన్న పరిస్థితి, విమాన సర్వీసుల నిర్వహణ తీరును చూస్తే.. అసలు ఇలా

మిగతా 2వ పేజీలో...



కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయం నడుస్తున్న భవనం

విశాఖకు ఐటీ జోష్

- రేపు కాగ్నిజెంట్ కార్యకలాపాలు ప్రారంభం
- కాగ్నిజెంట్ శాశ్వత కార్యాలయం, టెక్ తమ్మిన, సత్వ, ఇమ్మాజినోటివ్, ఫ్లూయెంట్ గ్రిడ్ ఐటీ కంపెనీలకు భూమి పూజ కూడా..
- హాజరుకానున్న చంద్రబాబు, లోకేశ్

13

అంతా కలిసే చేశారు!

13

- తక్కువ ఖర్చుతో ఎక్కువ సంపాదించాలనే ములకల చెరువులో నకిలీ మద్యం తయారీ
- జనార్దన్‌రావు పథకానికి జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి ఓకే
- తంబళ్లపల్లె నియోజకవర్గంలోని 6 మండలాలకు నకిలీ మద్యం
- అన్నీ తెలిసినా మౌనంగా ఉన్నా
- జయచంద్రారెడ్డి సూచన మేరకే నా ఫోన్లు ధ్వంసం
- పీఏ రాజేశ్ వాంగ్మూలం

పరకామణిలో చోరీపై చట్టపరంగా చర్యలు

- సీఐడీ, ఏసీబీకి హైకోర్టు ఆదేశం
- డీజీలు ప్రస్తుత దర్యాప్తులను కొనసాగించాలి
- ఆ వివరాలను పరస్పరం పంచుకోవాలి
- ఐటీ, ఈడీలకూ సమాచారమివ్వాలి
- సతీశ్‌కుమార్ పోస్టుమార్టం సర్టిఫికెట్‌ను 3 రోజుల్లో సీల్డ్ కవర్‌లో అందించండి
- సీఐడీకి న్యాయమూర్తి నిర్దేశం

13



స్క్రబ్ టైఫస్‌కు డ్రగ్ రెసిస్టెన్స్ గండం!

- చికిత్సల్లో బలహీనంగా మారుతున్న డాక్సీసైక్లిన్
- అందుకే మరణాలు సంభవిస్తున్నాయనే ఆందోళన
- జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షలపైనే ఆశలు.. రక్త నమూనాలు ఎయిమ్స్, పుణె, వెల్లూరుకు



రోగుల శరీరంపై కనిపించే ఎస్కార్ (నల్ల మచ్చ)

- మరో ముగ్గురికి స్క్రబ్ టైఫస్
- బాధితుల్లో నాలుగేళ్ల చిన్నారి
- వ్యాధి లక్షణాలతో వృద్ధుడి మృతి

గుంటూరు మెడికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భయపడినట్లే జరుగుతోంది..! రాష్ట్రంలో కలకలం రేపుతున్న 'స్క్రబ్ టైఫస్' కేసుల విషయంలో ఔషధ నిరోధకత ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో నమోదవుతున్న స్క్రబ్ టైఫస్ మరణాలకు ఔషధ నిరోధకత (యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్/ఏఎంఆర్) కారణమని వైద్య వర్గాలు అనుమానిస్తున్నాయి. స్క్రబ్ టైఫస్ చికిత్సకు వినియోగించే ప్రధాన యాంటీ బయోటిక్ మందు డాక్సీ సైక్లిన్. అయితే ప్రస్తుతం ఈ ఔషధం స్క్రబ్ టైఫస్‌పై ఏమాత్రం ప్రభావం చూపలేకపోతోంది. గతేడాది వేల సంఖ్యలో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదైనా మరణాలు అత్యల్పంగానే ఉన్నాయి. ఈ ఏడాది కేసుల సంఖ్య తక్కువగా ఉన్నా మరణాల సంఖ్య పెరిగింది. దీనికి


మిగతా 2వ పేజీలో...

నోరు జాగ్రత్త!

- కర్ణాటక శాసన సభలో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లు
- కులం, ధార్మిక అంశాలపై ఇతరులకు బాధ కలిగించేలా మాట్లాడితే జైలే
- సంజ్ఞలు, రాతలు కూడా ద్వేషపూరిత వ్యాఖ్యలుగా పరిగణన

2

పిల్లనిస్తామని ఇంటికి పిలిచి.. చంపేశారు



శ్రవణ్‌సాయి

- యువతి ప్రేమికుడి పట్ల ఆమె తల్లిదండ్రుల ఘాతుకం
- తలపై బ్యాట్‌తో కొట్టి హత్య
- హైదరాబాద్‌లో ఘోరం

14

బ్యాంకర్లనే బురిడీ కొట్టిద్దామని..

నకిలీ బంగారంతో ఎస్‌బీఐకి వచ్చిన కర్ణాటక ముఠా

14

- స్థానిక రైతులకు కమీషన్ ఆశ చూపి.. పాసుపుస్తకాలపై రుణానికి యత్నం
- అనుమానంతో ఆరా తీసిన బ్యాంకర్లు
- వెంటనే పోలీసులకు సమాచారం
- సత్యసాయి జిల్లాలో ఏడుగురు అరెస్టు!

భర్తను హత్య చేసిన భార్య

ఫోన్ మాట్లాడొద్దంటే.. గొడ్డలితో కొట్టింది

- ఫోన్ మాయలో పడి ఇంటిపనులు చేయట్లేదని భర్త తిట్టడంతో దాడి
- అల్లూరి జిల్లా చింతపల్లిలో ఘటన

13

సీఐసీ నియామకాలపై రాహుల్ అసమ్మతి నోట్

- నియామకాలపై ఎటూ తేల్చని కమిటీ భేటీ!
- కేంద్రం ప్రతిపాదించిన పేర్లపై రాహుల్‌గాంధీ అసంతృప్తి
- భేటీలో పాల్గొన్న ప్రధాని, హోంమంత్రి
- ముఖ్య సమాచార కమిషనర్‌తోపాటు 8 మంది కమిషనర్ల.. పోస్టులు ఖాళీ
- పెండింగ్‌లో 30,000కు పైగా కేసులు!

2

దీపావళికి యునెస్కో గుర్తింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 10: వయస్సుతో సంబంధం లేకుండా కోట్లాది మంది ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొనే పండుగ దీపావళి. యునెస్కో గుర్తింపుతో ఆ పండుగకు అంతర్జాతీయ ఖ్యాతి దక్కింది. ఢిల్లీ ఎర్రకోట వేదికగా యునెస్కో కీలక సమావేశం జరుగుతోంది. ఇన్‌టాంజబుల్ కల్చరల్ హెరిటేజ్ (ఐసీహెచ్)ని సంరక్షించడమే ధ్యేయంగా అంతర్ ప్రభుత్వ కమిటీ ఎప్పటికప్పుడు సమావేశమవుతూ ఉంటుంది. భారతదేశం తొలిసారిగా ఈ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చింది. ఈ నెల 8న ప్రారంభమై.. 13వ తేదీ వరకు జరిగే ఈ సమావేశాల్లో 80 దేశాల నుంచి వచ్చిన 67 ప్రతిపాదనలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. దీపావళికి యునెస్కో గుర్తింపు ఇస్తూ బుధవారం ప్రకటన వెలువడగానే దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమయింది.

ఎఫ్-35 కావాలంటే ఎస్-400 వదులుకోండి

» టర్కీకి తేల్చి చెప్పిన అమెరికా

వాషింగ్టన్, డిసెంబరు 10: ఎఫ్-35 యుద్ధ విమానాలు కొనాలనుకుంటే రష్యాతో చేసుకున్న ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ కొనుగోలు ఒప్పందం రద్దు చేసుకోవాలని టర్కీకి అమెరికా తేల్చి చెప్పింది. దీనికి సంబంధించి అధ్యక్షుడు ట్రంప్‌తో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగెన్ కొన్ని నెలలుగా చర్చలు జరుపుతున్నారని అమెరికా రాయబారి బరాక్ వెల్లడించారు. అమెరికా చట్టాల ప్రకారం టర్కీ తాము చెప్పినట్లు వింటేనే ఎఫ్-35 కొనుగోళ్లకు అనుమతిస్తామని ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. వాస్తవానికి అమెరికా నుంచి వంద ఎఫ్-35 యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలని టర్కీ యోచిస్తోంది.

పట్టు కాదు.. పాలిస్టర్

(మొదటి పేజీ తరువాయి)

వెంకన్నను, భక్తులను అందరినీ మోసం చేశారు. అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సిల్క్ పేరుతో పాలిస్టర్ వస్త్రాలను సరఫరా చేసి భారీగా అవినీతికి పాల్పడినట్టు తాజాగా తేలింది. వ్యక్తిగత వినియోగం కోసం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఇటీవల కొన్ని పట్టువస్త్రాలను కొనుగోలు చేయగా కేవలం రూ.350 ధరకే లభించాయి. అయితే టీటీడీ కొనుగోలు చేస్తున్న పట్టు వస్త్రాలు మాత్రం రూ.వెయ్యికి పైనే ధర ఉన్నాయి. దీంతో 30 రోజుల్లో విచారణ చేపట్టి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సెప్టెంబరు 16వ తేదీన జరిగిన బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా శ్రీవారిని దర్శించుకునే ప్రముఖులకు రంగనాయక మండపంలో పట్టువస్త్రాలు కప్పి ఆశీర్వచనం చేస్తారు. అలాగే వేదాశీర్వచనం టికెట్ కొనే భక్తులకూ ఈ వస్త్రాలు కప్పడం ఆనవాయితీ. టెండర్ల నిబంధనల ప్రకారం.. ఈ వస్త్రాలు స్వచ్ఛమైన మల్బరీ సిల్క్‌తోనే నేయాలి. అలాగే డెనియర్ పత్తిదారంతో కనీసం 31.5 డెనియర్ కౌంట్ రావాలి. ఇక ప్రతి వస్త్రంపై ఓ వైపు 'ఓం నమో వేంకటేశాయా' అని సంస్కృతంలో, మరోవైపు తెలుగులో ఉండాలి. అలాగే శంఖు, చక్ర నామాలను ఉంచాలి. ఓ మీటరు వెడల్పు, 2.3 మీటర్ల పొడవుతో తప్పనిసరిగా సిల్క్ మార్క్ హోలోగ్రామ్ ట్యాగ్ ఉండాలి. బోర్డు ఆదేశాల మేరకు.. విజిలెన్స్ విభాగం ఇటీవల తిరుపతిలో మార్కెటింగ్ విభాగంలో నూతన స్టాక్ నుంచి, తిరుమలలోని వైభోత్సవ మండపం నుంచి రెండేసి చొప్పున శాంపిల్స్‌ను సేకరించింది. ఇందులో ఒక్కొక్కటి చొప్పున రెండేసి ధర్మవరంలోని సెంట్రల్ సిల్క్ బోర్డుకు, బెంగళూరులోని సెంట్రల్ సిల్క్ బోర్డుకు పంపారు. రెండు ల్యాబ్‌ల నుంచి వచ్చిన రిపోర్టుల్లో పాలిస్టర్ వర్సెస్ పాలిస్టర్‌గా ఉండటంతో అధికారులు షాకయ్యారు. టీటీడీ నిబంధనల ప్రకారం సిల్క్ వర్సెస్ సిల్క్‌లో ఈ వస్త్రాలు ఉండాలి. అలాగే వస్త్రాలపై సిల్క్‌మార్క్ హోలోగ్రామ్ కూడా లేనట్టు తేలింది.

ఒకే సంస్థ నుంచి వేలాది వస్త్రాలు

తిరుపతి, తిరుమలలో విజిలెన్స్ విభాగం సేకరించిన వస్త్రాలన్నీ నగరికి చెందిన వీఆర్ఎస్ ఎక్స్‌పోర్టు అనే సంస్థ సరఫరా చేసినట్టు గుర్తించారు. ఈ సంస్థకు అనుబంధంగా ఉన్న తిరుమల ఫ్యాబ్రిక్స్, నాన్న కాటేజెస్, వీఎం రాజ పవర్‌లూమ్ వంటి అనేక సంస్థలు కూడా ఉండటం గమనార్హం. 2015-25 మధ్య వీటి నుంచి మొత్తం రూ.54.95 కోట్ల విలువైన వస్త్రాలు కొనుగోలు చేసినట్టు ఉన్న రికార్డులను కూడా స్వాధీనం చేసుకున్నారు. అయితే గతంలో తిరుపతి మార్కెటింగ్ విభాగం పంపిన నమూనాలకు కాంచీపురం సీఎస్‌బీలో ఆమోదం లభించడంపై పలు రకాల అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అదే స్టాక్ నుంచి విజిలెన్స్ సేకరించిన నమూనాలు మాత్రం ధర్మవరం, బెంగళూరు ల్యాబ్‌ల్లో పాలిస్టర్‌గా రిపోర్టులు రావడం, కాంచీపురంలో ఆమోదం రావడంతో అక్రమాలు జరిగినట్టు టీటీడీ భావిస్తోంది. నమూనాలను మార్చడం లేదా ల్యాబ్‌లో మేనేజ్ చేసి ఉండవచ్చనే అనుమానాలను విజిలెన్స్ విభాగం కూడా వ్యక్తం చేసింది. తాజాగా మరో 15 వేల వస్త్రాల కోసం రూ.1,389 చొప్పున సరఫరా చేసేందుకు ఇదే సంస్థ కాంట్రాక్ట్ తీసుకుంది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఆ సంస్థకు కేటాయించిన కాంట్రాక్ట్‌ను టీటీడీ రద్దు చేసింది.

ఏసీబీ విచారణకు ఈవో లేఖ.. విజిలెన్స్ నివేదిక ఆధారంగా అవకతవకలు జరిగినట్టు నిర్ధారించుకున్న టీటీడీ అక్టోబరు 28వ తేదీన జరిగిన బోర్డు సమావేశంలో సుదీర్ఘంగా చర్చించింది. 2015 నుంచి 2025 వరకు జరిగిన వస్త్రాల కొనుగోలు అంశంపై ఏసీబీ ద్వారా సమగ్ర విచారణ చేయించాలని బోర్డు తీర్మానం చేసింది. బోర్డు తీర్మానం ప్రకారం టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఇటీవల సమగ్ర విచారణ కోసం ఏసీబీకి లేఖ రాశారు. ఇదే అంశంపై ఛైర్మన్ బీఆర్ నాయుడు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. 'నాకు రూ.350కి వస్త్రాన్ని విక్రయించిన సంస్థే టీటీడీకి రూ.1,389కి విక్రయిస్తోంది. అక్కడే అనుమానం కలిగి విచారణ చేయించాం. స్వామి సొమ్మును ఇష్టమొచ్చినట్లు తిన్నారు. దేవుడు క్షమించడు. వాళ్లకు రోజులు దగ్గరపడ్డాయి. టీటీడీలో పూర్తిస్థాయిలో అవినీతి అక్రమాలను అడ్డుకోవడంతో పాటు గతంలో జరిగి అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చి దొంగలకు శిక్ష వేయిస్తాం' అని అన్నారు.

వివేకా హత్య కేసులో మరింత దర్యాప్తునకు ఓకే!

(మొదటి పేజీ తరువాయి)

డేటా ఆధారంగా నెల రోజుల లోపు విచారణ చేయాలని ఆదేశించింది. తన తండ్రి హత్య కేసులో లోతైన దర్యాప్తు చేయాలని సునీతా రెడ్డి వేసిన పిటిషన్‌కు మద్దతుగా సునీల్ యాదవ్ కౌంటర్ దాఖలు చేయడం తెలిసిందే. పలు అంశాలపై సీబీఐ దర్యాప్తు అసమగ్రంగా ఉందని నిందితుల్లోనే కొందరు ప్రస్తావించడం, కోర్టు ఆదేశిస్తే దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీబీఐ సంసిద్ధత వ్యక్తం చేయడం, చట్టపరంగా దర్యాప్తు కొనసాగించడానికి అడ్డంకులు లేకపోవడంతో.. పాక్షిక విచారణకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. కాల్ రికార్డ్స్, డేటా ఆధారంగా దర్యాప్తు జరపాలని ఆదేశించింది.

ప్రాయోజిత సంక్షోభం?

(మొదటి పేజీ తరువాయి)





జరిగి ఉండాల్సిందే కాదని చెప్పారు. అవసరమైతే ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌ను తొలగించేందుకు, భారీగా జరిమానాలు విధించేందుకు కూడా సిద్ధమని తెలిపారు. ఇండిగోపై కఠిన చర్యలు చేపడతామని, భవిష్యత్తులో విమానయాన శాఖను ఎవరూ తేలికగా తీసుకోలేని స్థాయిలో ఈ చర్యలు ఉంటాయని చెప్పారు. బుధవారం టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రామ్మోహన్‌నాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇండిగో సంక్షోభం వెనుక ఏదో ఉద్దేశపూర్వక అంశం ఉన్నట్టు కనిపిస్తోంది. వారి నిర్వహణ తీరు, సర్వీసులపై వారికి ఉన్న పట్టును బట్టి చూస్తే.. ఈ సంక్షోభం ఏర్పడి ఉండకూడదు. అంతేకాదు ప్రత్యేకంగా ఆ సమయంలోనే సమస్య ఎందుకు మొదలైంది. అది ఎలా సంక్షోభానికి దారితీసిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి" అని కేంద్ర మంత్రి చెప్పారు. ఈ అంశాలన్నింటిపైనా లోతుగా విచారణ సాగుతోందని వెల్లడించారు. ఇక ఇండిగో సీఈవోను తొలగించవచ్చనే ప్రచారం జరుగుతున్న విషయాన్ని ప్రస్తావించగా.. "ఒకవేళ అవసరమైతే కచ్చితంగా తొలగిస్తాం. అంతేకాదు విధించేందుకు అవకాశమున్న అన్ని జరిమానాలు వేస్తాం. ఇండిగో సంక్షోభానికి సంబంధించి అన్ని కోణాలనూ పరిశీలిస్తున్నాను. గత ఏడు రోజులుగా నేను సరిగా నిద్ర కూడా పోలేదు. చాలా సేపు ఆఫీసులోనే ఉండి పరిస్థితులను సమీక్షిస్తూనే ఉన్నాను.." అని రామ్మోహన్ నాయుడు చెప్పారు. విమానయాన సంస్థలు, ఇతర భాగస్వామ్య పక్షాలతో విస్తృతంగా చర్చించిన తర్వాతే 'విమాన విధుల సమయ పరిమితి (ఎఫ్‌డీటీఎల్)' నిబంధనలను అమల్లోకి తెచ్చామని స్పష్టం చేశారు. విమానయాన శాఖ మంత్రిగా ఈ రంగాన్ని వేగంగా అభివృద్ధిలోకి తీసుకెళ్లడం తన బాధ్యత అని, ఈ క్రమంలో ఏర్పడే ఇండిగో సంక్షోభం వంటివి ఆ బాధ్యతను మరింత పెంచుతాయని చెప్పారు. సంక్షోభం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులకు క్షమాపణలు తెలిపారు.

సీఈవో, ఉన్నతాధికారులకు డీజీసీఏ పిలుపు

విమానయాన సంక్షోభం నేపథ్యంలో ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్, వివిధ విభాగాల ఉన్నతాధికారులను తమ ముందు హాజరుకావాల్సిందిగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశించింది. విమానాల రద్దు, సర్వీసుల పునరుద్ధరణ, పైలట్లు, ఇతర సిబ్బంది సంఖ్య, కొత్తగా నియామకాల కోసం చేస్తున్న ఏర్పాట్లు సహా అన్ని వివరాలతో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రావాలని స్పష్టం చేసింది. ఇక ఇండిగో సంస్థ రోజువారీ వ్యవహారాలను పరిశీలించడానికి డీజీసీఏ 8 మందితో పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసింది. అందులో ఇద్దరు అధికారులు ఇండిగో కార్పొరేట్ కార్యాలయంలో రోజువారీ వ్యవహారాలను, విమాన సర్వీసుల నిర్వహణ, రద్దు, రీఫండ్లు, ఇతర అంశాలను పరిశీలిస్తారని తెలిపింది.

సంక్షోభ పరిష్కారం సరే.. ముందేం చేశారు?: హైకోర్టు

పెద్ద సంఖ్యలో ఇండిగో విమానాల రద్దు సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం మంచి చర్యలే చేపట్టిందని.. కానీ అసలు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది, అప్పటివరకు ప్రభుత్వం ఏం చేస్తోందని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. ఒకవైపు సంక్షోభం కొనసాగుతుంటే.. మరోవైపు ఇతర విమానయాన సంస్థలు భారీగా చార్జీలు పెంచేయడాన్ని ఎలా అనుమతించారని నిలదీసింది. ఇండిగో సంక్షోభం నేపథ్యంలో ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేలా, టికెట్ చార్జీలు పూర్తిగా రీఫండ్ చేయించేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్‌రావుల ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. అనూహ్యమైన పరిస్థితులతోపాటు మరికొన్ని అంశాలు విమానాల రద్దుకు కారణమయ్యాయని.. అయితే ప్రయాణికుల ఇబ్బందులను తొలగించడానికి పౌర విమానయాన శాఖ, డీజీసీఏ పకడ్బందీ చర్యలు చేపట్టాయని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. కానీ దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. "సంక్షోభం నెలకొన్న సమయంలో ఇతర విమానయాన సంస్థలు భారీగా ధరలు పెంచుకునేందుకు ఎలా అనుమతించారు? సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని కేంద్రాన్ని ఆదేశించింది. విచారణను జనవరి 22వ తేదీకి వాయిదా వేసింది.

11 విమానాశ్రయాల్లో డీజీసీఏ తనిఖీలు

ఇండిగో సంక్షోభం 9వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా 11 ప్రధాన విమానాశ్రయాల్లో తనిఖీలు నిర్వహించాలని డీజీసీఏ నిర్ణయించింది. విమానాల రద్దు, ఆలస్యం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, ప్రయాణికుల రద్దీ, వారికి అవసరమైన సౌకర్యాలు, విమానయాన సంస్థలు, విమానాశ్రయ నిర్వహణ సంస్థల సిబ్బంది సరిపడా ఉన్నారా? అనేది పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ప్రయాణికులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకోవాలని సూచించింది. గురువారం సాయంత్రానికల్లా నివేదికలు ఇవ్వాలని పేర్కొంది. కాగా, బుధవారం దేశవ్యాప్తంగా 250కి పైగా ఇండిగో సర్వీసులు రద్దయ్యాయి. అందులో ఢిల్లీ, బెంగళూరుల నుంచే సగం సర్వీసులు ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

షా ✗ రాహుల్

» ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటులో వాడీ వేడి చర్చ





న్యూఢిల్లీ, డిసెంబరు 10: పార్లమెంటులో బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మధ్య మాటల తూటాలు పేలాయి. ఎన్నికల సంస్కరణలపై చర్చలో భాగంగా పరస్పర సవాళ్లు చోటుచేసుకున్నాయి. ఎన్నికల కమిషన్ సహకారంతో బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతోందంటూ రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలపై అమిత్‌షా తీవ్రంగా స్పందించారు. ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షం అబద్ధాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా ఎవరుండాలన్నది చొరబాటుదారులు నిర్ణయిస్తే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుందా? అని ప్రశ్నించారు. గత చరిత్రను ప్రస్తావిస్తే ప్రతిపక్షానికి కోపం వస్తుందని, కానీ.. ఏ దేశమైనా, సమాజమైనా చరిత్రను విస్మరించి ముందుకు ఎలా సాగుతుందని అన్నారు. "నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో 1952, 1957, 1961లో ఎస్ఐఆర్ చేపట్టారు. ఆపై లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల హయాంలోనూ ఎస్ఐఆర్ చేపట్టారు. అనంతరం వాజపేయి, మన్మోహన్ సింగ్‌ల హయాంలోనూ జరిగింది. ఆయా సందర్భాల్లో ఏ రాజకీయ పార్టీ కూడా దీనిని వ్యతిరేకించలేదు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా ఉండాలని కోరుకోవడమే ఇందుకు కారణం" అని అమిత్ షా అన్నారు. గత నాలుగు నెలలుగా ప్రజలను ఎస్ఐఆర్‌పై తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆక్షేపించారు. దీనిపై రాహుల్ స్పందిస్తూ.. గత మూడు మీడియా సమావేశాల్లో తాను మాట్లాడిన అంశాలపై చర్చించేందుకు సిద్ధమా? అంటూ అమిత్‌షాకు సవాల్ విసిరారు. తాను ప్రస్తావించిన అంశంపై హోంమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే తాను ఏం మాట్లాడాలన్నది ప్రతిపక్ష నేత నిర్దేశించలేరంటూ అమిత్‌షా ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా ఎస్ఐఆర్ అనేది దొడ్డిదారిలో ఎన్ఆర్‌సీని అమలు చేయడమేనని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. మత ప్రాతిపదికన ఎంపిక చేసుకున్న ప్రజల ఓటుహక్కును తొలగించేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరితమైన ప్రక్రియ అని అన్నారు.

సీఐసీ నియామకాలపై రాహుల్ అసమ్మతి నోట్

న్యూఢిల్లీ, డిసెంబరు 10 : కేంద్ర సమాచార కమిషనర్ల నియామకంపై బుధవారం ఏర్పాటైన కేంద్ర కమిటీ సమావేశం ఏ నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. కేంద్ర సమాచార కమిషన్లో ఖాళీగా ఉన్న ముఖ్య సమాచార కమిషనర్(సీఐసీ) పోస్టుతోపాటు మరో 8 మంది కమిషనర్లు, ఒక విజిలెన్స్ కమిషన్ సభ్యుడిని ఈ కమిటీ నియమించాల్సి ఉంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సభ్యులుగా ఉన్న ఈ కమిటీ బుధవారం పార్లమెంటులోని ప్రధాని చాంబర్‌లో భేటీ అయ్యింది. దాదాపు గంటన్నర సాగిన వారి సమావేశం సమాచార కమిషనర్ల నియామకంపై ఎటూ తేల్చకుండానే ముగిసింది. నియామకాలపై రాహుల్ గాంధీ తన అసమ్మతి నోట్‌ని ఇచ్చినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. కాగా ప్రధాని నేతృత్వంలోని సమాచార కమిషనర్ల నియామక కమిటీ ఈ నెల 10న సమావేశమై నియామకాలపై నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ప్రభుత్వం ఈ నెల 1నే సుప్రీంకోర్టుకు తెలియజేసింది. కాగా కాంగ్రెస్ గతంలోనూ(2020) సీఐసీ నియామక ప్రక్రియను తప్పుబట్టింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఈ ప్రక్రియ చేపడుతున్నారని ఆరోపించింది. కేంద్ర సమాచార కమిషన్ వద్ద ప్రస్తుతం 30,838 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా, సీఐసీ నియామకంపై ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ 88 నిమిషాలపాటు భేటీ కావడంపై పార్లమెంటు కారిడార్‌లలో ఎంపీల మధ్య పెద్ద ఎత్తున చర్చ సాగింది. రాహుల్‌గాంధీ బయటకు వచ్చాకగానీ.. వారికి ఈ సమావేశం కేవలం సీఐసీ నియామకంపైనే కాదని, మరో 8 మంది సమాచార కమిషనర్లతోపాటు ఒక విజిలెన్స్ కమిషనర్ నియామకంపై జరిగిందన్న విషయం తెలియలేదు. ఆనియామకాలపై రాహుల్ అభ్యంతరం తెలిపారు.

మత్తు అడ్డాలుగా విద్యాలయాలు


» పదకొండేళ్లకే పిల్లల్లో డ్రగ్స్ వినియోగం

» గోప్యంగా సర్వే జరిపిన మెడికల్ బృందాలు

» ప్రతి ఏడు స్కూళ్లలో ఒకచోట డ్రగ్స్ భూతం

న్యూఢిల్లీ, డిసెంబరు 10: జ్ఞాన వనాలుగా ఉండాల్సిన విద్యాలయాలు గంజాయి వనాలుగా మారుతున్నాయని ఓ అధ్యయనంలో తేలింది. స్కూలుకు వెళ్లే పిల్లలు 12.9 ఏళ్లకే మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, కొందరైతే పదకొండేళ్లు వచ్చేటప్పటికే మత్తుకు బానిసలు అవుతున్నారంటూ ఈ అధ్యయనం మన విద్యావ్యవస్థపై ప్రమాద ఘంటికలు మోగించింది. హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, ముంబై, లఖ్‌నవూ, చండీగఢ్, ఇంఫాల్, జమ్మూ, డిబ్రూగఢ్, రాంచీ నగరాల పరిధిలో సగటున 14.7 ఏళ్ల వయసు కలిగిన 5,920 మంది విద్యార్థులపై గోప్య పద్ధతిలో ఈ అధ్యయనం సాగింది. దానిని నివేదిక రూపంలో నేషనల్ మెడికల్ జర్నల్ ఆఫ్ ఇండియాలో ప్రచురించారు. 'మీరు డ్రగ్స్ తీసుకుంటారా' అని బహిరంగంగా మమ్మల్ని అడిగితే లేదనే మేం సమాధానం చెబుతాం' అని తాము కలిసిన విద్యార్థుల్లో ఎక్కువమంది తెలిపారని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ఢిల్లీ, ఎయిమ్స్‌లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ అధిపతి డాక్టర్ అంజూ ధావన్ తెలిపారు. చండీగఢ్, డిబ్రూగఢ్, లఖ్‌నవూ, బెంగళూరు, శ్రీనగర్, ఇంఫాల్, ముంబై, హైదరాబాద్, రాంచీలకు చెందిన వైద్య కళాశాలలకు చెందిక బృందాలు ఈ అధ్యయనంలో పాలుపంచుకున్నాయి. అధ్యయనం జరిపిన ప్రతి ఏడు స్కూళ్లలో కనీసం ఒకచోట విద్యార్థులు కనీసం ఒక్కసారైనా తాము డ్రగ్స్ తీసుకున్నట్టు తెలిపారు. మగపిల్లలు పొగాకు ఉత్పత్తులు, గంజాయి అధికంగా తీసుకుంటే, ఆడపిల్లలు నల్లమందు గోలీలు, ఇతర మాదక ద్రవ్యాలు ఎక్కువగా వాడుతున్నారు.

లోకం తీరు



నోరు జాగ్రత్త!

» కర్ణాటక శాసన సభలో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లు

» కులం, ధార్మిక అంశాలపై ఇతరులకు బాధ కలిగించేలా మాట్లాడితే జైలే

బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఇకపై నలుగురిలో మాట్లాడేటప్పుడు నోరు అదుపులో ఉంచుకోవాల్సిందే. ద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తే జైలుకు వెళ్లాల్సి రావచ్చు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. శాసనసభ శీతాకాల సమావేశాల్లో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లును బుధవారం ప్రవేశపెట్టింది. కులం, సమాజం, లింగ, లైంగిక, జన్మస్థలం, ధార్మిక అంశాలను ప్రస్తావిస్తూ.. ఇతరులకు బాధ కలిగించేలా వ్యాఖ్యలు చేస్తే జరిమానా, జైలు శిక్ష విధించాలన్నది ఈ బిల్లు ఉద్దేశం. ఈ బిల్లును ఈ నెల 4న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన ఈ బిల్లును హోం శాఖ మంత్రి పరమేశ్వర సభలో ప్రవేశపెట్టారు. ఈ సమయంలో స్పీకర్ యూటీ ఖాదర్ మూజువాణి ఓటింగ్‌కు అనుమతించగా, ప్రతిపక్ష బీజేపీ సభ్యులు వ్యతిరేకిస్తూ డివిజన్‌కు పట్టుబట్టారు. అయితే స్పీకర్ బిల్లులను సభలో ప్రవేశపెట్టేందుకు అనుమతించారు. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే.. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి లేదా సమూహం లేదా మరణించిన వారిపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు, సంజ్ఞలు, రాతలు, దృశ్య, ఎలక్ట్రానిక్ సమాచార వ్యవస్థల ద్వారా చేసే దుష్ప్రచారం చేసే ప్రతి చర్యను ద్వేషపూరిత వ్యాఖ్యలుగా పరిగణిస్తారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసినవారికి తొలిసారి ఏడాది నుంచి ఏడేళ్లపాటు జైలు శిక్షతో పాటు రూ.50 వేలు జరిమానా విధిస్తారు. పునరావృతమైతే రెండేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలుశిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తారు. ఈ నేరాలను నాన్‌బెయిలబుల్ కేసులుగా పరిగణిస్తారు. ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుల్లోనే శిక్షలు విధించేలా బిల్లును రూపొందించి, శాసనసభలో ప్రవేశపెట్టారు. పరిషత్ ముందుకు ఈ బిల్లు గురువారం వచ్చే అవకాశం ఉంది. కాగా.. బిల్లు సభలో ప్రవేశపెట్టడంపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అజెండాలో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లు భాగమని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్వేష పూరిత వ్యాఖ్యలను అంగీకరించబోమని స్పష్టంచేశారు.

హెచ్1బీ వీసా ఇంటర్వ్యూలు రద్దు

వాషింగ్టన్, డిసెంబరు 10: హెచ్1బీ వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాల పరిశీలన తప్పనిసరి చేయడంతో పెద్ద సంఖ్యలో వీసా ఇంటర్వ్యూలు రద్దయ్యాయి. ఇది అనేకమంది ప్రయాణ ప్రణాళికలను దెబ్బకొట్టింది. ఈనెల 15 నుంచి ఈ కొత్త నిబంధన అమల్లోకి రానున్న నేపథ్యంలో హెచ్1బీ వర్కర్లు, వారి కుటుంబసభ్యుల్లో అనిశ్చితి నెలకొంది. ట్రంప్ సర్కారు తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధన వల్ల పెద్ద సంఖ్యలో వీసా ఇంటర్వ్యూలు రీషెడ్యూల్ అవుతున్నాయి. దీంతో అనేకమంది దరఖాస్తుదారుల ప్రయాణాలు హఠాత్తుగా రద్దవుతున్నాయి. ఈనెల మధ్య నుంచి నెలాఖరు వరకు నిర్వహించాల్సిన ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను హైదరాబాద్, చెన్నై సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాన్సులేట్లు రద్దు చేశాయని ఇమ్మిగ్రేషన్ లాయర్లు తెలిపారు. వీటిలో అనేక స్లాట్లను వచ్చే ఏడాది మార్చికి వాయిదా వేయడంతో వారి ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవాల్సి వస్తోంది. అయితే, తాజా నిబంధన నేపథ్యంలో రోజువారీ ఇంటర్వ్యూల సంఖ్యను కాన్సులేట్లు తగ్గిస్తున్నాయి. దీనివల్ల అనేకమంది ఇంటర్వ్యూలు రద్దవుతున్నాయి. వీసా రద్దయినవారిలో 8 వేలమందికిపైగా విద్యార్థులు ఉన్నారని అమెరికా విదేశాంగశాఖ సీనియర్ అధికారి తెలిపారు. రద్దైన వీసాల్లో దాదాపు సగం.. మద్యం మత్తులో వాహనం నడపడం, చోరీ, దాడి తదితర కారణాలతోనే రద్దయ్యాయన్నారు. ఉగ్రవాదాన్ని సమర్థించడం వంటి తీవ్రమైన కారణాలు, గడువు ముగియడం వంటి పరిపాలనాపరమైన కారణాల వల్ల కూడా వీసాలు రద్దు చేశామని అంతకుముందు మీడియాకు విదేశాంగశాఖ వెల్లడించింది.

స్క్రబ్ టైఫస్‌కు డ్రగ్ రెసిస్టెన్స్ గండం!



స్క్రబ్ టైఫస్‌పై సమీక్ష నిర్వహిస్తున్న గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కారణం వ్యాధి కారక క్రిములు ఔషధాల ప్రభావాన్ని తట్టుకునే శక్తిని సంతరించుకోవడంతో పాటు బ్యాక్టీరియా ఉత్పరివర్తనాలే కారణమని వైద్య వర్గాలు అనుమానిస్తున్నాయి. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో స్క్రబ్ టైఫస్ రోగులకు ఐవీ ఫ్లూయిడ్స్‌తో పాటు డాక్సీసైక్లిన్ మందు ఇస్తున్నా జ్వరం తగ్గడం లేదు. పరీక్షల్లో పాజిటివ్‌గానే చూపుతోంది. దీంతో ఎజిత్రోమైసిన్, ఎరిత్రోమైసిన్ వంటి యాంటీ బయోటిక్ మందులు కూడా చికిత్సల్లో వాడుతున్నారు. అయినప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదు.

మరణాలు అధికమే... కొందరు రోగులు థ్రాంబోసైటోపీనియా (ప్లేట్‌లెట్లు తగ్గడం) లక్షణాలతో మృతి చెందుతున్నారు. రోగుల మెదడులో రక్తస్రావం జరగడంతో పాటు ఎన్‌కెఫలోపతి సమస్య ఏర్పడి మరణించినట్లు వైద్య రికార్డులు చెబుతున్నాయి. వీరికి ముందు జాగ్రత్తగా యాంటీ వైరల్ ఔషధం.. ఎసైక్లోవీర్ ఇచ్చినా కూడా ప్రయోజనం లేకుండా పోతోంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 11 స్క్రబ్ టైఫస్ మరణాలు నమోదైతే, గుంటూరు జీజీహెచ్‌లోనే ఐదు మరణాలు వెలుగు చూశాయి. మృతులు ఐదుగురూ మహిళలు కావడం గమనార్హం. గుంటూరు జీజీహెచ్‌లో గతేడాది 1,316 మంది జ్వర బాధితులకు స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షలు చేయగా.. 121 పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఒక్క మరణం కూడా సంభవించ లేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు 569 నమూనాలను పరీక్షించగా, 107 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఐదుగురు మృతి చెందారు. బుధవారం జీజీహెచ్‌లో 12 మంది ఈ వ్యాధికి చికిత్స పొందుతుండగా, వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూకు తరలించారు.

జీనోమ్ సీక్వెన్సింగ్‌కు రక్త నమూనాలు

డ్రగ్ రెసిస్టెన్స్, వ్యాధి కారక క్రిముల ఉత్పరివర్తనం నేపథ్యంలో రోగుల రక్త నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపాలని అధికారులు నిర్ణయించారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగుల నుంచి నమూనాలు సేకరించి వాటిని పరీక్షల కోసం మంగళగిరిలోని ఎయిమ్స్, వె ల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ, పుణెలోని నేషనల్ వైరాలజీ ల్యాబ్‌కు పంపుతున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి బుధవారం తెలిపారు. స్క్రబ్ టైఫస్ జ్వరాల చికిత్సపై ఆయన తన చాంబర్‌లో పలు వైద్య విభాగాల అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసుల నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షకు పంపితే అసలు కారణాలు తెలుస్తాయన్నారు. డ్రగ్ ఆఫ్ చాయిస్ కూడా తెలుస్తుందని, దీనివల్ల రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించవచ్చని ఆయన వెల్లడించారు. గతంలో 90 శాతం మంది రోగుల శరీరంపై వ్యాధి కారక.. నల్ల మచ్చ (ఎష్కార్) కనిపించేదన్నారు. ప్రస్తుత రోగుల్లో 60 శాతం మందిలోనే ఎష్కార్ కనిపించిందని డాక్టర్ రమణ తెలిపారు.

మరో ముగ్గురికి స్క్రబ్ టైఫస్

» బాధితుల్లో నాలుగేళ్ల చిన్నారి

» వ్యాధి లక్షణాలతో వృద్ధుడి మృతి

బొండపల్లి, అనంతపురం వైద్యం, దేవరాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో మూడు స్క్రబ్ టైఫస్ కేసులు వెలుగు చూశాయి. వ్యాధి లక్షణాలతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం మరువాడ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా తేలింది. సోమవారం బాలికకు తీవ్ర జ్వరం రావడంతో తొలుత దేవుపల్లి పీహెచ్‌సీకి, అనంతరం గజపతినగరం సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షలు నిర్వహించగా బుధవారం స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అయితే బాలికకు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇద్దరికి స్క్రబ్ టైఫస్ సోకిందని అనంత ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యాధికారులు బుధవారం తెలిపారు. రాయదుర్గం, ధర్మవరం ప్రాంతాలకు చెందిన 16, 12 ఏళ్ల బాలికలకు పాజిటివ్ వచ్చిందని తెలిపారు. వీరికి ప్రత్యేక వార్డులో చికిత్స అందిస్తున్నామన్నారు. కాగా, స్క్రబ్ టైఫస్ లక్షణాలతో అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం అల్లుపురంలో 80 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను కుటుంబీకులు సోమవారం కేజీహెచ్‌లో చేర్పించారు. స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ రాగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

న్యాయం కోసం...

కేరళలో ఎనిమిదేళ్ళక్రితం ఒక మలయాళ నటి కిడ్నాప్, లైంగిక దాడికి సంబంధించిన కేసు ఊహించని మలుపు తిరిగింది. నిందితుల్లో ఒకరైన నటుడు దిలీప్‌ను సోమవారం ఎర్నాకుళం కోర్టు నిర్దోషిగా ప్రకటించింది, మరో ముగ్గురికి ఉపశమనం కల్పించింది. మిగతా ఆరుగురికీ న్యాయస్థానం 12వ తేదీన శిక్షలు ఖరారుచేయబోతోంది. తమిళం, మలయాళం, తెలుగు, కన్నడ చిత్రాల్లో నటించిన ఆ నటిని 2017 ఫిబ్రవరి 17 రాత్రి కొందరు దుండగులు అపహరించి, కారులో రెండుగంటలపాటు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ దారుణ ఘటనలో పోలీసులు దిలీప్ సహా పదిమంది మీద కిడ్నాప్, గ్యాంగ్ రేప్ వంటి తీవ్ర అభియోగాలు నమోదుచేశారు. అదే ఏడాది జూలైలో అరెస్టయిన దిలీప్ నాలుగు నెలలు జైలులో ఉండి బెయిల్ మీద బయటకు వచ్చారు. నటిపై దాడిఘటనలో తన ప్రమేయం లేదని, పోలీసులే తనమీద కక్షకట్టారని ఆరోపించిన దిలీప్, ఒక దశలో ఈ కేసును సీబీఐ విచారించాలంటూ అభ్యర్థించాడు కూడా. దిలీప్‌ను దిగువ కోర్టు వదిలివేసినా, తాము వదిలేది లేదని, తీర్పును హైకోర్టులో సవాలు చేస్తామని పినరాయ్ విజయన్ ప్రభుత్వం ప్రకటించింది.

మలయాళ సినీరంగాన్ని తీవ్రంగా కుదిపేసి, నిలువునా చీల్చేసి, కేరళ సమాజాన్ని అతలాకుతలం చేసిన కేసు ఇది. దర్యాప్తు, విచారణ కొనసాగిన ఈ ఏడేళ్ళ కాలంలో మీడియా తోచింది వార్చింది. దిలీప్ పక్షాన ఉన్నందుకు కొందరు, నటిని వెనకేసుకు వచ్చినందుకు మరికొందరు ప్రముఖులు తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అర్థరాత్రి నీకేమి పని అంటూ నటిని తప్పుబట్టి, మెప్పుపొందినవారూ లేకపోలేదు. ఈ తీర్పు నేపథ్యంలో ఎవరీ హనీ వర్గీస్ అంటూ ఏడేళ్ళుగా ఈ కేసును పర్యవేక్షిస్తున్న న్యాయమూర్తి మీద మీడియా ప్రత్యేక కథనాలను అందిస్తోంది. తన కేసులో స్పెషల్ జడ్జి కోసం బాధితురాలు చేసిన విజ్ఞప్తి మేరకు వర్గీస్‌కు హైకోర్టు ఈ కేసు అప్పగించడం, ఆ తరువాత బాధితురాలు, రాష్ట్ర ప్రభుత్వం కూడా జడ్జిని మార్చవలసిందిగా హైకోర్టుకు పోవడం విచిత్రమైన పరిణామాలు. జడ్జినీ, ఆమె భర్తనూ ప్రభావితం చేసేందుకు దిలీప్ ప్రయత్నించినట్టుగా ఆయన ఫోన్‌లో ఒక ఆడియోక్లిప్ దొరకడం దీనికి కారణం. దిలీప్‌తో జడ్జి మెత్తగా వ్యవహరిస్తున్నారని, తనను మాత్రం కన్నీళ్ళుపెట్టిస్తున్నారని కూడా బాధితురాలు ఆరోపించారు. ఇలా కనీసం మూడుసార్లు బాధితురాలు హైకోర్టును ఆశ్రయించినా జడ్జిని మార్చలేదు. కేసు విచారణ త్వరితగతిన పూర్తి చేయాలన్న సుప్రీంకోర్టు కూడా విధిలేక గడువు ఎనిమిదిసార్లు పొడిగించాల్సి వచ్చింది. ఫోన్‌లో సమాచారాన్ని చెరిపివేసినందుకు ప్రయత్నించి దిలీప్ లాయర్లు కూడా అరెస్టయ్యారు. పలుమార్లు ప్రభుత్వ న్యాయవాదులు, దర్యాప్తు అధికారులు మారిపోయారు. నలభైమంది సాక్షులు ఎదురు తిరిగి కేసు బలహీనపడింది. నటితో పాటు దిలీప్ సెలబ్రిటీ స్టేటస్ వల్ల సమాజం, మీడియా ఈ కేసు మీద ఎక్కువ దృష్టిపెట్టడం, ముందస్తు తీర్పులు ఇచ్చేయడం సహజం. ఆ ఒత్తిడికి అతీతంగా నిలవడం కోర్టులకు పెద్దపరీక్ష. దాడికి గురైన నటి ఐదేళ్ళ తరువాత మౌనం వీడి, ఆ ఘోరం గురించీ, తాను అనుభవించిన మానసిక క్షోభ, లైంగికదాడి ప్రభావం నుంచి బయటపడటానికి చేసిన ప్రయత్నాల గురించీ మాట్లాడారు. సమాజంలోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ దూషణలు, వ్యక్తిత్వహననాలు ఎదుర్కొన్నారామె. ఈ దాడి ఘటన అనంతరం ఏర్పాటైన హేమా కమిటీ మలయాళ పరిశ్రమలో మహిళలు వేతనాల నుంచి వేధింపుల వరకూ ఎంతటి వివక్షాపూరిత, దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారో బయటపెట్టింది. ఈ రిపోర్టు మొత్తంగా భారతీయ సినీపరిశ్రమను సైతం ప్రభావితం చేసి, సినీరంగంలో మహిళల పక్షాన సమూలమార్పులకు దోహదం చేస్తుందన్న ఆశ ఆశించిన స్థాయిలో నెరవేరలేదు.

నటిని అపహరించి, లైంగికదాడిచేసి, ఆ నేరాన్ని చిత్రీకరించడానికి దిలీప్ ఈ గూండాలను కొన్నాడన్న పోలీసుల మాట కోర్టు నమ్మకుండా, ప్రధాననేరగాడు పల్సర్ సునీల్‌కూ దిలీప్‌కూ పరిచయమే లేదన్న వాదనను విశ్వసించినందున ఈ చోటా నేరగాళ్ళకే రేపటి రోజున కఠిన శిక్షలు పడవచ్చు. ప్రభుత్వమూ, ప్రధానంగా బాధితురాలు అత్యున్నత న్యాయస్థానంవరకూ పోయి పోరాడాలని సంకల్పించినందున ఈ వ్యథ కథ ఇంకా ముగియనట్టే. ఎప్పుడో బయటకు వచ్చేసిన దిలీప్ ఇప్పటికే పాతహోదాలు, గౌరవాలు తిరిగి సంపాదించుకున్నాడు, ఇప్పుడు ఏకంగా ఘనస్వాగతాలు, జేజేలూ అందుకుంటున్నాడు. ఇప్పటికే తన జీవితాన్ని, కెరీర్‌ను కోల్పోయిన ఆమె మాత్రం న్యాయంకోసం ఇంకా పోరాడుతూనే ఉండాలి.

తిరోగమిస్తున్న భారత ప్రజాస్వామ్యం!



■ యోగేంద్ర యాదవ్

నీవు 'దేశ్, కాల్, పత్ర' గురించి మాట్లాడుతున్నావు కదూ అని నా మిత్రుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ విజయ్ మహాజన్ వ్యాఖ్యానించారు. అవును, దేశ్ (నియోజక వర్గ సరిహద్దులు), కాల్ (ఎన్నికల సమయం), పత్ర (ఓటర్ల జాబితా) మార్చడం గురించి నేను మథన పడుతున్నాను. మన ఎన్నికల వ్యవస్థలో సంభవించనున్న మూడు పెనుమార్పులను సూచిస్తున్న విషయాలవి. మహాజన్‌తో జరిగిన మాటామంతీతో డీ-లిమిటేషన్ (2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన), వన్ నేషన్, వన్ టైమ్ (ఒక దేశం, ఒక ఎన్నిక (పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ), ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్– సర్) మధ్య పరస్పర సంబంధమూ, అది జాతీయ అధికార పక్షానికి సమకూర్చే శాశ్వత నిర్మాణాత్మక ప్రయోజనం గురించి నాకు మరింత మెరుగైన అవగాహన ఏర్పడ్డది.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే మంగళవారం లోక్‌సభలో, బుధవారం రాజ్యసభలో 'ఎన్నికల సంస్కరణల'పై చర్చ జరిగింది. ఎన్నికల సంస్కరణ అనేది అందమైన భావన. అది గతించిన ఒక అమాయక కాలాన్ని గుర్తుచేస్తుంది. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరియన్లకు నచ్చజెప్పి, వారిని ఒప్పించడం సాధ్యమయ్యే నిష్కపటత్వం ఉన్న రోజులవి. అయితే యమునా నదిలో నాటికీ నేటికీ చాలా మురికినీరు ప్రవహించింది సుమా!

ఎన్నికల వ్యవస్థలో ఆవశ్యక మార్పుల విషయమై 'ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్' పద్ధతి (ఓటర్లు ఒకే అభ్యర్థికి ఓటు వేసే బహుళ ఓటింగ్ వ్యవస్థ. అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి విజేత అవుతాడు) నుంచి దామాషా ప్రాతినిధ్యానికి మారే విషయమై చర్చించాం. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకురావాల్సిన చట్టాల గురించీ తర్జన భర్జనలు పడ్డాం. చివరకు ఇప్పుడు ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత కనీసంగానైనా ఉండేలా తీసుకోవల్సిన జాగ్రత్తలు మొదలైన అంశాల గురించి తర్కిస్తున్నాం. నిజానికి ఎన్నికల 'సంస్కరణల' గురించి కాకుండా ప్రస్తుత పాలకుల విధానాల వల్ల ఎన్నికల వ్యవస్థలో సంభవిస్తోన్న వికృతాలను నిరోధించే విషయమై పార్లమెంటు చర్చించడం యుక్తంగా ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను.

ఎన్నికలలో అక్రమాలు సంభవించడమనేది భారత్‌కే పరిమితమైన పరిణామం కాదు. ఎన్నికల నిర్వహణా నియమాలను నిరంకుశ పాలకులు తమకు అనుకూలంగా మార్చుకోవడమనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్నది. ఇరవయో శతాబ్ది నియంతలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అయితే 21వ శతాబ్ది నిరంకుశ పాలకుల పరిస్థితి వేరు. తమకు ప్రజల మద్దతు పూర్తిగా ఉన్నదని చూపాల్సిన అవసరం వీరికి ఉన్నది. కనుకనే ఎన్నికలను పూర్తిగా రద్దు చేయలేకపోతున్నారు. అలా అని ఎన్నికలు నిర్వహించి తమ అధికారానికి ప్రమాదాన్ని కొనితెచ్చుకోలేరు. అందుకే రెండు కుయుక్తులకు పాల్పడుతున్నారు. ఒకటి– ఎన్నికలు నిర్వహించే రాజ్యాంగ సంస్థను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు; రెండోది రాజకీయ పోటీని యథాతథంగా ఉంచుతూ ఎన్నికల నియమాలు పూర్తిగా పాలకులకే అన్ని విధాలా అనుకూలంగా ఉండేలా చేస్తున్నారు. సమకాలీన ప్రపంచంలో హంగేరీ, తుర్కియే, వెనిజువెలా, ఈక్వెడార్, బొలీవియా, కెన్యా, థాయిలాండ్, మయన్మార్ మొదలైన దేశాల తులనాత్మక రాజకీయాల పరిశోధకులు నిగ్గుదేల్చిన 'దుర్వినియోగ రాజ్యాంగవాదం' (అబ్యూసివ్ కాన్స్టిట్యూషనలిజమ్ – ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు, నిరంకుశ పాలనను నెలకొల్పేందుకు రాజ్యాంగ విధానాలను అనుసరించడం), 'నిరంకుశ చట్టబద్ధత' (ఆటోక్రాటిక్ లీగలిజం– అధికారాన్ని ఏకీకృతం చేసేందుకు, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు స్వస్తిచెప్పేందుకు చట్టపరమైన పద్ధతులను ఉపయోగించడం), 'ఎలెక్టోరల్ టిల్టింగ్' (ఓటింగ్ చట్టాలను మార్చడం, మీడియా కథనాలను నియంత్రించడం తదితర చర్యల ద్వారా వ్యవస్థలను నిజమైన ప్రజాస్వామ్యం కంటే పోటీ నిరంకుశత్వం వైపు కదిలించడం) మొదలైన అప్రజాస్వామిక పాలనా రీతులకు ఉదాహరణలుగా ఉన్నాయి. గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్న పాలకులు, అసమ పోటీ అవకాశాలను కల్పించేందుకు చట్టబద్ధమైన, పాలనా యంత్రాంగాలను ఉపయోగించుకుంటున్నారు. చట్టాలలోను, పాలనా సంస్థలలోను క్రమంగా తీసుకొచ్చిన మార్పులు భారత్‌లో పార్టీ– రాజ్య వ్యవస్థ ఏకీభవనం (పార్టీ– స్టేట్ ఫ్యూజన్)ను ఎలా సృష్టించాయో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ న్యాయశాస్త్ర ఆచార్యుడు తరునాభ్ ఖైతాన్ తన పరిశోధనా పత్రం 'కిల్లింగ్ ఎ కాన్స్టిట్యూషన్ విత్ ఎ థౌజండ్ కట్స్'లో చూపారు.

ఈ విశ్లేషణను దేశ్, కాల్, పత్రకు పొడిగిద్దాం. బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఉన్నత బాధ్యతల్లో ఉన్న పెద్ద మనిషి ఒకరు 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రత్యక్ష ప్రసారాలను వీక్షిస్తూ సహజంగానే కలవరపడి ఉంటారు. తమ పార్టీ బలహీనతలు మూడింటిని ఆయన గుర్తించి ఉంటారు. దేశ్– తూర్పు తీరస్థ రాష్ట్రాలలో బీజేపీని వ్యతిరేకించిన ప్రాంతాలు ఉన్నాయి; కాల్– ఎన్నికల సమయాలు ఏటా బీజేపీ ఆధిపత్యానికి పరీక్ష పెడుతున్నాయి; పత్ర– సమాజంలో దిగువ స్థాయిలో ఉన్న కొన్ని వర్గాలు బీజేపీకి ఓటు వేసినప్పుడు కూడా ఆ పార్టీని విశ్వసించడం లేదు. ఈ బలహీనతలను అధిగమించేందుకు ఆయనకు ఒక ఆలోచన వచ్చి ఉంటుంది. అది– నియోజకవర్గాల పునర్విభజన, ఒక దేశం–ఒక ఎన్నిక, ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణల కలయిక.

నియోజకవర్గాల పునర్విభజన (డీ–లిమిటేషన్) బీజేపీకి రెండు ప్రయోజనాలను సమకూరుస్తుంది. 2026 జనాభా లెక్కల ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో బీజేపీ ఓట్లు, సీట్ల పరంగా బలహీనంగా ఉన్న నియోజకవర్గాల సంఖ్యను తగ్గిస్తుంది. తద్వారా, ఆ పార్టీ తలపెట్టే రాజ్యాంగ సవరణలకు ప్రతికూలతనూ తగ్గిస్తుంది. బీజేపీ సాపేక్షంగా బలహీనంగా ఉన్న రాష్ట్రాలు (కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బెంగాల్, పంజాబ్) సీట్లను కోల్పోతాయి. ఎక్కువ నియోజక వర్గాలు ఉండే రాష్ట్రాలు (ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్) బీజేపీకి కంచుకోటలు అవుతాయి. ఇదంతా రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా జరుగుతుంది. నియోజక వర్గాల పునర్విభజనను ఇప్పటికే అస్సాం, జమ్మూ–కశ్మీర్‌లలో ప్రయోగాత్మకంగా అమలుపరిచారు. దేశవ్యాప్తంగా దానిని అమలుపరిచినప్పుడు కనీసం డజన్‌కు పైగా సీట్లు బీజేపీ వైపు మొగ్గుతాయి.

ఒక దేశం, ఒక ఎన్నిక అనేది బీజేపీకి రెండు ప్రయోజనాలను సమకూరుస్తుంది. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల అధికారంలో ఉన్న పార్టీకి పరిస్థితులు అనుకూలమవుతాయి. అసెంబ్లీ ఎన్నికలలో కూడా బాగా లబ్ధి పొందే అవకాశాలు ఉంటాయి.

బీజేపీకి అనుకూలంగా లేని వ్యక్తులకు, సామాజిక సమూహాలకు ఓటింగ్ హక్కులు నిరాకరిస్తున్న 'సర్' ఈ కథకు తగిన ముక్తాయింపు. బిహార్ దృష్టాంతాన్ని ('సర్'కు ముందున్న ఓటర్ జాబితాల నుంచి నికరంగా 44 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు) బట్టి దేశవ్యాప్త 'సర్' ఓటర్ జాబితాల నుంచి ఐదు కోట్లకు పైగా ఓటర్ల పేర్లను తొలగించే అవకాశమున్నదని పలువురు అంచనా వేస్తున్నారు. ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది అతిపెద్ద ఓటు హక్కు తొలగింపు కార్యక్రమమనడంలో సందేహం లేదు. ఇలా ఓటు హక్కు నిరాకరణకు గురైనవారిలో అత్యధికులు పేదలు, మైనారిటీలు, వలస కార్మికులు అనేది గమనార్హం. ఓటర్‌గా నమోదు చేసుకునే బాధ్యతా భారాన్ని పూర్తిగా ఓటర్లపై మోపడం కూడా ఆ తొలగింపులకు ఒక ప్రధాన కారణమని చెప్తితీరాలి. ఇలా తొలగింపునకు గురైన వారిలో బీజేపీ మద్దతుదారులు చాలా తక్కువ మంది కనుక 'సర్' ప్రక్రియతో బీజేపీకి ఇంచుమించు ఎటువంటి నష్టం ఉండదు. తన సంస్థాగత బలిమి, స్థానిక అధికారుల మద్దతుతోను తన విధేయ ఓటర్లను ఓటుహక్కు తొలగింపు ప్రక్రియ నుంచి బీజేపీ కాపాడుకోగలుగుతుంది. ఈ విషయంలో దేశ పాలకపక్షం తన ప్రత్యర్థి రాజకీయ పక్షాల కంటే చాలా చాలా మెరుగ్గా ఉన్నది. 'సర్'ను రూపొందించిన తీరు, దాన్ని అమలుపరుస్తున్న వైనాన్ని గమనిస్తే అత్యధిక ముస్లింల ఓటుహక్కు తొలగింపే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ లక్ష్యమని అర్థమవుతుంది.

నియోజకవర్గాల పునర్విభజన, ఒకే దేశం–ఒకే ఎన్నిక, ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కలసికట్టుగా భారతదేశ ప్రజాస్వామ్య రేటింగ్‌ను మరింతగా దిగజార్చే అవకాశం ఎంతైనా ఉన్నది. అంతర్జాతీయ అంతర్– ప్రభుత్వ సంస్థ అయిన ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్ (అంతర్జాతీయ IDEA) ఇప్పటికే ఇండియాను 'ప్రజాస్వామిక తిరోగమనం'కు ఒక నిదర్శనాధ్యయనం (కేస్ స్టడీ)గా పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థను క్రమంగా నిరంకుశత్వం వైపు మళ్లించడమే ప్రజాస్వామ్య తిరోగతి. ఇది చట్టబద్ధమైన మార్గాల ద్వారా, తరచుగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకుల నిర్వాకాల వల్లే ఈ తిరోగతి సంభవిస్తోంది. గత ఐదు సంవత్సరాలుగా 'విశ్వసనీయ ఎన్నికలు' సహా వివిధ సూచికలపై భారత్ గణనీయమైన గణాంక తగ్గుదలను నమోదు చేసిందని ఆ సంస్థ 'గ్లోబల్ స్టేట్ ఆఫ్ డెమొక్రసీ' నివేదిక పేర్కొంది. 2026 సంవత్సరంలో ఇంటర్నేషనల్ IDEA సంస్థ అధ్యక్ష పదవిని భారత్ చేపట్టనున్నది భారత ప్రజాస్వామ్య ప్రస్థానం, ఎన్నికల పద్ధతులు, సమ్మిళిత పాలనకు నిబద్ధత మొదలైన నిర్దిష్ట అంశాలను అంతర్జాతీయ సమాజం రాబోయే సంవత్సరంలో నిశితంగా పరిశీలించనున్నది. ఈ బృహత్తర బాధ్యతను ఆ అంతర్జాతీయ సంస్థ ఎవరి ఆధ్వర్యంలో నిర్వహించనున్నదో తెలుసా? ఇంకెవరు? మన భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలోనే!

> నియోజకవర్గాల పునర్విభజన, ఒకే దేశం–ఒకే ఎన్నిక, ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కలసికట్టుగా భారతదేశ ప్రజాస్వామ్య రేటింగ్‌ను మరింతగా దిగజార్చే అవకాశం ఉన్నది. ఇప్పటికే ఇండియాను 'ప్రజాస్వామిక తిరోగమనం'కు ఒక నిదర్శనాధ్యయనంగా 'ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్' పేర్కొంది. గత ఐదు సంవత్సరాలుగా 'విశ్వసనీయ ఎన్నికలు' సహా వివిధ సూచికలపై భారత్ గణనీయమైన గణాంక తగ్గుదలను నమోదు చేసిందని ఆ సంస్థ నివేదిక వెల్లడించింది.



AKBAR


(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

న్యాయ జాప్యం ప్రజాస్వామ్యానికి శాపం!

అపరిష్కృత వ్యాజ్యాలు భారీగా పెరిగిపోతుండటం భారత న్యాయ వ్యవస్థ నేడు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య. జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ ప్రకారం – దేశవ్యాప్తంగా సివిల్, క్రిమినల్ వివాదాలకు సంబంధించి సుప్రీంకోర్టులో 88 వేల వ్యాజ్యాలు, హైకోర్టుల్లో 63.65 లక్షల దావాలు, కింది స్థాయి కోర్టుల్లో సుమారు 4.70 కోట్ల కేసులు పెండింగులో ఉన్నాయి. తీవ్రమైన క్రిమినల్ కేసులు సైతం ఏళ్ల తరబడి పెండింగులో ఉండిపోతున్నాయి. 750 ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులు ఉన్నప్పటికీ, విచారణ దశలో ఉండిపోతున్న దావాల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది.

ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం న్యాయపరమైన చిక్కులు, కాలయాపన వలన భారత్ ఏటా సుమారు రూ.50 వేల కోట్లు నష్టపోతోంది. భారత న్యాయ వ్యవస్థ ఆధునికీకరణకు కొత్త క్రిమినల్ చట్టాలు తెచ్చినప్పటికీ వాటితో అపరిష్కృత కేసులన్నీ పరిష్కారం అవుతాయన్న భరోసా లేదు. కొత్త పెండింగ్ కేసులు రావన్న గ్యారెంటీ లేదు. న్యాయమూర్తులు, మౌలిక వసతుల కొరతే ఇందుకు ప్రధాన కారణం.

2007 నాటికి దేశంలో ప్రతి 10 లక్షల జనాభాకు కనీసం 50 మంది న్యాయమూర్తులు ఉండేలా చూడాలని 2002లో సుప్రీంకోర్టు ఆదేశించింది. కానీ, కేంద్ర న్యాయశాఖ లోక్‌సభలో వెల్లడించిన లెక్కల ప్రకారం ప్రస్తుతం 10 లక్షల జనాభాకు కేవలం 21 మంది జడ్జీలు మాత్రమే ఉన్నారు. అదే ఆస్ట్రేలియాలో 58 మంది, బ్రిటన్‌లో 100, అమెరికాలో 150 మంది ఉన్నారు. ప్రస్తుత న్యాయమూర్తులతో దేశవ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ వ్యాజ్యాలపై తీర్పులు వెలువడడానికి 350 ఏళ్ళు పడుతుందనేది నిపుణుల అంచనా!



> కోర్టుల విచారణ, తీర్పుల వెల్లడిలో జరుగుతున్న విపరీత జాప్యం వలన నిర్దోషులు ఏళ్ల తరబడి జైళ్లల్లో మగ్గిపోతుంటే, దోషులు సమాజంలో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. దేశంలోని వివిధ కారాగారాల్లో 77 శాతం మంది విచారణ ఖైదీలుగానే సుదీర్ఘకాలం ఉండిపోతుండడం సిగ్గుచేటు! ఆలస్యంగా న్యాయం జరిగినా.. జరగనట్టే అని న్యాయశాస్త్రం చెపుతున్నప్పుడు నిర్దోషులకు ఇంత అన్యాయం జరిగితే నిజమైన న్యాయానికి అర్థమేముంది?

వకీళ్లు కోరిందే తడవుగా వాయిదాలపై వాయిదాలు పడుతున్న కేసుల మూలాన కక్షిదారులు ఎంతో నష్టపోతున్నారు. న్యాయం కోరి కోర్టు తలుపు తట్టడమే నేరమవుతోందని వారు విలపించే దుస్థితి నెలకొంది. కోర్టుల విచారణ, తీర్పుల వెల్లడిలో జరుగుతున్న విపరీత జాప్యం వలన నిర్దోషులు ఏళ్ల తరబడి జైళ్లల్లో మగ్గిపోతుంటే, నిజమైన దోషులు సమాజంలో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. దేశంలోని వివిధ కారాగారాల్లో 77 శాతం మంది విచారణ ఖైదీలుగానే సుదీర్ఘకాలం ఉండి పోతుండడం ఎంత సిగ్గుచేటు! 'ఆలస్యంగా న్యాయం జరిగినా న్యాయం జరగనట్టే' అని న్యాయశాస్త్రం చెపుతున్నప్పుడు నిర్దోషులకు ఇంత అన్యాయం జరిగితే నిజమైన న్యాయానికి ఇక అర్థమేముంది?

ఒకప్పుడు తప్పనిసరైతే తప్ప, తనవైపే న్యాయం ఉందనే ధీమా ఉంటే తప్ప ఫిర్యాదు చేయడానికి జంకేవారు. రాజకీయ కక్షలు, కార్పణ్యాలు పెరిగిపోయిన నేటి రోజుల్లో పరిస్థితి పూర్తి భిన్నంగా మారిపోయింది. ప్రత్యర్థుల్ని లొంగదీసుకునే క్రమంలో వారిని ఆర్థికంగాను, శారీరకంగానూ ఇబ్బందులకు గురిచేసేలా అక్రమ కేసులు పెట్టడం మామూలు విషయమైపోయింది. దాంతో ఎంతో మంది యువత బంగారు భవిష్యత్తు నాశనం అయిపోతోంది. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర పరిణామం.

ఓ వైపు విపరీతంగా పేరుకుపోతున్న కేసులను, న్యాయస్థానాల్లో సిబ్బంది కొరతను పరిష్కరించడానికి యూనియన్ ప్రభుత్వం కొన్ని చట్టసవరణలనూ, కొత్త శాసనాలను తీసుకొస్తున్నది. దీనిలో భాగంగానే యూనియన్ ప్రభుత్వం, సుప్రీంకోర్టు, దాని ఆధ్వర్యంలోని మధ్యవర్తిత్వ ప్రాజెక్టు కమిటీ, జాతీయ న్యాయసేవా ప్రాధికార సంస్థలు సంయుక్తంగా మొన్న జూలై నుంచి దేశవ్యాప్తంగా తొంభై రోజుల పాటు 'మీడియేషన్ ఫర్ ది నేషన్' పేరిట మధ్యవర్తిత్వ డ్రైవ్‌ను చేపట్టాయి. దీనిలో భాగంగా ఆస్తి, వైవాహిక, కుటుంబ తగాదాలు, గృహహింస కేసులు, వాణిజ్య, ఉద్యోగ సంబంధమైన తగాదాలు, రోడ్డు ప్రమాద క్లెయిమ్‌లూ పరిష్కరించుకోవచ్చు. మరోవైపు చిన్నచిన్న నేరాలను నేరరహితం (డీక్రిమినలైజ్) చేసేందుకు ఉద్దేశించిన జన్ విశ్వాస్ బిల్లు 2.0ను ఎన్డీయే ప్రభుత్వం 2022 డిసెంబర్ 22న లోక్‌సభలో ప్రవేశపెట్టింది. మొత్తం 288 నేరాలను ఇందులో చేర్చింది. 2023లో ఇలా 183 నేరాలను జన్ విశ్వాస్ బిల్లు ద్వారా తొలగించారు. సులభతర జీవనాన్ని ప్రోత్సహించి, వ్యాపార అనుకూల వాతావరణాన్ని మెరుగుపరిచేందుకు ఈ రెండో బిల్లును ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ బిల్లును సమగ్ర పరిశీలన నిమిత్తం లోక్‌సభ సెలెక్ట్ కమిటీకి పంపించారు.

గత తీర్పులు, నిందితుల పూర్వాపరాలతో కూడిన అపార సమాచారాన్ని మధించడంలో కృత్రిమ మేధ, బ్లాక్‌చెయిన్ సాంకేతికతలను వినియోగిస్తున్న దేశాలు సత్ఫలితాలను సాధిస్తున్నాయి. అత్యాధునిక పరిజ్ఞానంతో న్యాయస్థానాలను సమీకరించడంలో యూకే, ఎస్టోనియా, లిథువేనియా వంటి దేశాలు ముందంజలో ఉన్నాయి. ఇప్పుడు తమ వంతుగా ఏం చేయవచ్చునో ప్రభుత్వాలు ఆలోచించాలి.

ఎప్పటికప్పుడు న్యాయమూర్తుల ఖాళీలు భర్తీ చేయడం తక్షణావసరం. అలాగే, న్యాయమూర్తుల నియామకానికి ఎన్‌జేఏసీ, జవాబుదారీతనానికి జ్యుడీషియల్ స్టాండర్డ్స్ అండ్ అకౌంటబిలిటీ చట్టం, సామర్థ్యానికి ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్లతో శాశ్వత రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు, కింది కోర్టులలో న్యాయమూర్తుల సంఖ్య పెంచడం, న్యాయ విచారణ పద్ధతుల్ని సులభతరం చేయడం, స్థానిక న్యాయస్థానాలను బలోపేతం చేయడం, నేరపరిశోధనలో, పోలీసు యంత్రాంగాన్ని సంస్కరించడం, రాజకీయ జోక్యాన్ని దూరం చేయడం వంటివి చేపట్టాలి. ఏకపక్ష అరెస్టులను నిలువరించడానికి న్యాయ నిబంధనలను కఠినంగా అమలుచేయాలి. వీటితో పాటు అవసరమైన మౌలిక వసతులు సమకూరిస్తే సకాలంలో న్యాయం అందించాలన్న లక్ష్యసాధన వేగంగా సుగమమవుతుంది. నాగరిక సమాజంలో సత్వర న్యాయం అందించడం వ్యవస్థ బాధ్యతగా గుర్తించిననాడే ప్రజాస్వామ్య వ్యవస్థ విశ్వసనీయత పెరుగుతుంది.

● కూసంపూడి శ్రీనివాస్
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

విత్తన చట్టానికి ఈ సవరణలు చేయాలి

ఆరవై సంవత్సరాల తర్వాత కేంద్ర ప్రభుత్వం 'విత్తన చట్టం–2025' ముసాయిదాను రూపొందించి, ప్రజాభిప్రాయం కోసం ఇటీవల వ్యవసాయ మంత్రిత్వశాఖ వెబ్‌సైట్ (www.agriwelfare.gov.in/en/whatsnew/75)లో ఉంచింది. ఈ చట్టం ద్వారా విత్తనాలు, నర్సరీ మొక్కల నాణ్యతను నియంత్రించడం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. ఈ ముసాయిదా బిల్లును చూసిన రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు, మేధావులు, రైతు ప్రయోజనాల కోసం పనిచేస్తున్నవారందరూ నిరాశకు గురయ్యారు. మొత్తం 48 సెక్షన్లు, 10 అధ్యాయాలతో రూపొందించిన ఈ ముసాయిదాను పరిశీలిస్తే, ఇది "విత్తన చట్టమా, లేక కంపెనీలకు అనుకూలమైన చట్టమా?" అనే సందేహం కలుగుతుంది.

కేంద్ర ప్రభుత్వం దీనిని ఒక మోడల్ చట్టంగా రూపొందించి అన్ని రాష్ట్రాలకు పంపాలి. తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయా రాష్ట్రాలు మార్పులు చేసుకుని, చట్టాలు రూపొందించుకోవడానికి అవకాశం కల్పించాలి. ఈ ముసాయిదా బిల్లుపై రాష్ట్ర రైతాంగం వారి అభిప్రాయాలను డిసెంబరు 11లోపు ఇ–మెయిల్ (jsseeds–agri@gov.in.) ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపాలి. ఈ బిల్లులో రైతుల ప్రయోజనాలను కాపాడేలా, విత్తన నాణ్యతను బలపరిచేలా, అన్ని వర్గాల ఉత్పత్తిదారులు–వ్యాపారులకు సమాన అవకాశాలు కల్పించేలా సవరణలు, అదనపు ప్రతిపాదనలు చేర్చాల్సిన అవసరం ఉంది.

ఈ ముసాయిదా చట్టం సెక్షన్–13 ప్రకారం ఏ పంట విత్తన రకమైనా రైతులకు అందించే ముందు తప్పనిసరిగా కేంద్ర విత్తన కమిటీ ద్వారా రిజిస్ట్రేషన్ పొందాల్సి ఉంటుంది. దీనిపై పూర్తి అధికారం కేంద్రానికి మాత్రమే ఉండటం వల్ల, రాష్ట్రాల భౌగోళిక–పర్యావరణ పరిస్థితులు, స్థానిక సాగు వ్యవస్థలు, రైతుల అవసరాలు రిజిస్ట్రేషన్ సమయంలో సక్రమంగా ప్రతిబింబించవు. కాబట్టి, ఈ సెక్షన్‌లో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా నిర్ణయాధికారాన్ని కల్పించేలా నిబంధనలను సవరించాలి.

సెక్షన్–16(1) ప్రకారం, కొత్త విత్తన రకం రిజిస్ట్రేషన్ పొందాలంటే ఆ రకం దిగుబడి, ఇతర అంశాలపై కేంద్ర విత్తన కమిటీ నియమించిన భారత వ్యవసాయ పరిశోధనా మండలి, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థలు నిర్వహించిన పరిశీలన నివేదికలు ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ఇలా ఇతర సంస్థలు సమర్పించే పరిశీలనలపై ఎక్కువగా ఆధారపడటం వల్ల చాలా అంశాలు పూర్తిగా నిర్ధారణ కావు. అందువల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత, శాస్త్రీయతను పెంచడానికి ప్రతిపాదించిన ప్రతి కొత్త రకాన్ని తప్పనిసరిగా భారత వ్యవసాయ పరిశోధనా మండలి లేదా సంబంధిత రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో కనీసం ఒక పంటకాలం ప్రత్యక్ష క్షేత్ర పరీక్షలు చేయాలని నిబంధనగా చేర్చాలి.

> కేంద్ర ప్రభుత్వం 'విత్తన చట్టం–2025' ముసాయిదా రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు, మేధావులు, రైతు ప్రయోజనాల కోసం పనిచేస్తున్న వారిని నిరాశకు గురిచేసింది. ఈ బిల్లులో రైతుల ప్రయోజనాలు కాపాడేలా, విత్తన నాణ్యతను బలపరిచేలా, అన్ని వర్గాల ఉత్పత్తిదారులు–వ్యాపారులకు సమాన అవకాశాలు కల్పించేలా సవరణలు, అదనపు ప్రతిపాదనలు చేర్చాలి.



సెక్షన్–17(3), సెక్షన్–18(1) ప్రకారం విత్తన ఉత్పత్తిదారులు, శుద్ధి కేంద్రాలు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను పాటించినప్పుడే రిజిస్ట్రేషన్ పొందగలరు. దీనిని సవరించాలి. విత్తనోత్పత్తిదారులు, శుద్ధి కేంద్రాలు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఎవరైనా రిజిస్ట్రేషన్ పొందాలంటే బీఎస్సీ (వ్యవసాయం), వ్యవసాయ డిప్లొమా లేదా ప్రభుత్వరంగ సంస్థలు అందించే విత్తనోత్పత్తి–విత్తన సాంకేతికతకు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సు తప్పనిసరి అర్హతగా చేర్చాలి.

సెక్షన్–21(1డి) ప్రకారం ఏ విత్తన విక్రయ సంస్థకు స్వీయ ధ్రువీకరణకు అనుమతి ఇవ్వడం వల్ల గతంలో నకిలీ, నాసిరకం విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చాయి. అందువల్ల రైతులను రక్షించాలంటే, స్వీయ ధ్రువీకరణ విధానాన్ని తొలగించి, ఏ విత్తనమైనా విక్రయానికి ముందు తప్పనిసరిగా ప్రభుత్వరంగ విత్తన ధ్రువీకరణ సంస్థలు, భారత వ్యవసాయ పరిశోధనా మండలి లేదా రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా అధికారిక ధ్రువీకరణ పొందాలన్న నిబంధన చేర్చాలి.

సెక్షన్–22 ప్రకారం, విత్తనాల ధరలు అసాధారణంగా పెరిగినప్పుడు లేదా కృత్రిమ కొరత ఏర్పడ్డప్పుడు మాత్రమే కేంద్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితుల్లో జోక్యం చేసుకోవచ్చు. అయితే, ధరల మార్పులు, సరఫరా లోపాలు ప్రతీ ఏడాది రైతులను ప్రభావితం చేస్తున్నందున, అత్యవసర పరిస్థితుల్లో కేంద్రం పర్యవేక్షణ సరిపోదు. స్థానిక పరిస్థితులు, డిమాండ్–సరఫరాపై రాష్ట్రాలకు ఎక్కువ అవగాహన ఉండటంతో, విత్తన సరఫరా, ధరల నియంత్రణ, మార్కెట్ పర్యవేక్షణ వంటి అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలకే కల్పించేలా చట్టాన్ని సవరించాలి.

సెక్షన్ 33(సి) ప్రకారం, ఇతర దేశాల్లో ధృవీకరించిన క్షేత్ర పరీక్షల ఆధారంగా విత్తనాలు దిగుమతి చేయవచ్చు. అయితే ఆ విత్తనాలు ఆ దేశ వాతావరణం, మట్టి, చీడ–పీడలు వంటి అంశాలకు అనుగుణంగా ఉండటం వల్ల, భారత్‌లో కూడా అలాగే పనిచేస్తాయని హామీ ఇవ్వడం సాధ్యం కాదు. కాబట్టి, విదేశీ విత్తనాలను రాష్ట్రంలో విక్రయించే ముందు కనీసం రెండు పంట సీజన్ల పాటు భారత వ్యవసాయ పరిశోధనా మండలి లేదా సంబంధిత రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా తప్పనిసరిగా క్షేత్ర పరీక్షలు నిర్వహించాలన్న నిబంధన ఉండాలి.

సెక్షన్ 34 ప్రకారం– రిజిస్టర్ చేయని, నాసిరకం లేదా నాణ్యత తక్కువ విత్తనాలను విక్రయించిన వ్యక్తులకు రూ.50 వేల నుంచి రూ.30 లక్షల వరకు జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష విధించవచ్చు. కానీ దీని సవరణలో.. లైసెన్స్ రద్దు చేసి, సంబంధిత ఉత్పత్తిదారులు, విక్రేతలు కనీసం ఐదేళ్ల పాటు విత్తన ఉత్పత్తి, విక్రయం చేయరాదన్న నిబంధన చేర్చాలి.

విత్తన చట్టం–2025లో ప్రధానంగా రెండు లోపాలు ఉన్నాయి. నకిలీ లేదా నాసిరకం విత్తనాల వల్ల రైతులకు పరిహారం కల్పించే సెక్షన్ లేకపోవడం; విత్తన ఉత్పత్తి రైతుల రక్షణకు ప్రత్యేక నిబంధనలు లేకపోవడం. కాబట్టి విత్తన ఉత్పత్తి అత్యంత నైపుణ్యం, అధిక సాగు ఖర్చు, కఠినమైన నాణ్యత–నియంత్రణలను అవసరం చేసే క్రమంలో రైతులకు చట్టపరమైన రక్షణ కల్పించడానికి ప్రత్యేక నిబంధనలు ఉండాలి. వీటిలో త్రిముఖ ఒప్పందాలు (రైతులు, విత్తన కంపెనీలు, వ్యవసాయశాఖ), విత్తన పంటకు బీమా, విత్తన రైతులకు జీవిత బీమా, విత్తనోత్పత్తిలో మధ్యవర్తుల వ్యవస్థపై పూర్తి నిషేధం, రైతుల దిగుబడిని కంపెనీలు అంగీకరించి నిర్ణీత ధరలో కొనుగోలు చేయడం వంటి ప్రమాణాలు ఉండాలి.

అంతేకాకుండా విత్తన కంపెనీలకు లైసెన్స్ జారీ చేసే విధానంపై కొన్ని ప్రత్యేక సూచనలు ఉన్నాయి. లైసెన్స్ ఇచ్చే కమిటీలో తప్పనిసరిగా ఐసీఏఆర్ లేదా సంబంధిత రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఉండాలి. విత్తన కంపెనీ ఏర్పాటుకు ఒక పరిశోధన విభాగం, 5–10 ఎకరాల స్థలం ఉండాలి. విత్తన రకం రిజిస్ట్రేషన్ కోసం కంపెనీ స్థాపించిన తర్వాత కనీసం 8–10 సంవత్సరాల కాల పరిశీలన, హైబ్రిడ్ అయితే కనీసం మూడేళ్ళ కాల పరిశీలన ఉండేలా నిబంధన విధించాలి. ఈ సవరణలతో విత్తన చట్టం–2025 రైతుల ప్రయోజనాలను రక్షిస్తూ, నకిలీ విత్తనాల వ్యాప్తిని తగ్గించి, విత్తన ఉత్పత్తిలో నైపుణ్యం, నాణ్యత ప్రమాణాలు అమల్లో ఉండేలా తయారవుతుంది.

■ అల్దాస్ జానయ్య
ఉపకులపతి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

చట్టసభలలో బీసీలకు 50% రిజర్వేషన్లు ఇవ్వాలి

- వాటిని సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం
- ఓబీసీ జాతీయ సదస్సులో తెలుగు ఎంపీల డిమాండ్



సదస్సులో ఓబీసీ నేతల అభివాదం

న్యూఢిల్లీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రెండు తెలుగు రాష్ట్రాల ఎంపీలు డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బుధవారం, ఆంధ్ర/తెలంగాణ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య అధ్వర్యంలో బీసీల హక్కులపై ఓబీసీ జాతీయస్థాయి సెమినార్‌ను నిర్వహించారు. ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బి.నాగరాజు, వి.రవిచంద్ర, బీద మస్తాన్‌రావు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మాట్లాడుతూ.. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి రూ.2 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని అన్నారు. బీసీలకు పారిశ్రామిక పాలసీలో 50 శాతం కోటా ఇవ్వాలని కోరారు. సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తుల నియమాకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లను బీసీలకు జనాభా ప్రకారం పెంచాలని డిమాండ్ చేశారు. దేశంలోని ప్రతి జిల్లాలో బీసీలకు ప్రత్యేకంగా రెండు నవోదయ పాఠశాలలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌లాగా బీసీలకు ప్రత్యేక చట్టం రూపొందించాలని కోరారు.



దీక్షల విరమణకు ముస్తాబైన దుర్గమ్మ ఆలయం

నేటి నుంచి భవానీ దీక్షల విరమణలు

ఏర్పాట్లు పూర్తి

విజయవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై గురువారం నుంచి భవానీ దీక్షల విరమణలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. గురువారం ఉదయం 6.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, ఒడిసా రాష్ట్రాల నుంచి సుమారు 5-6 లక్షల మంది భవానీ దీక్షాధారులు ఇంద్రకీలాద్రికి వస్తారని అంచనా వేశారు. భవానీల కోసం కనకదుర్గ నగర్‌లో మూడు హోమగుండాలు ఏర్పాటు చేశారు. కుమ్మరిపాలెం వైపున ఒక హోల్డింగ్ పాయింట్, వీఎంసీ వద్ద రెండు హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా భక్తులను క్యూలైన్లలోకి పంపుతారు. కనకదుర్గ నగర్‌లో 13 ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు. వారిలో రెండు కౌంటర్లను విభిన్న ప్రతిభావంతులకు కేటాయించారు. ప్రతి రోజూ అమ్మవారికి నాలుగుసార్లు నివేదన, సాయంత్రం ఆరు గంటలకు హారతులు ఇస్తారు. ఈ సమయాల్లో దర్శనాన్ని నిలుపుదల చేస్తారు. భవానీ దీక్షల విరమణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 4,123 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నిఘా కోసం 312 సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు.

గిరిజన సంక్షేమ శాఖ రిటైర్డ్ ఈఎన్‌సీ శ్రీనివాస్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- బంధువులు, స్నేహితుల ఇళ్లలోనూ తనిఖీలు
- ఆదాయానికి మించి ఆస్తులు కలిగిఉన్నట్టు కేసు నమోదు

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించేందుకు రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) సబ్బవరపు శ్రీనివాస్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగిఉన్నట్టు కేసు నమోదైంది. శ్రీనివాస్ రిమాండ్‌లో ఉండగానే ఆగస్టు నెలలో ఉద్యోగ విరమణ చేశారు. అయితే ఆయన ఆదాయానికి మించిన ఆస్తులు కూడగట్టినట్టు సమాచారం అందడంతో విశాఖ ఏసీబీ అధికారులు తాజాగా కేసు నమోదుచేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం విశాఖలోని విశాలాక్షినగర్‌లోని శ్రీనివాస్ నివాసంతోపాటు బంధువులు, కుటుంబసభ్యులకు చెందిన మరో నాలుగు ఇళ్లలోనూ, ఏలూరు, హైదరాబాద్‌లోని ఆయన స్నేహితుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.కోటిన్నరకుపైగా విలువైన పది ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బంగారం, నగదు, కారు స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

విశేష పర్వదినాల్లో సిఫారసు బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డిసెంబరు, జనవరి నెలల్లోని విశేష పర్వదినాల్లో తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. ఈ నెల 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 29, 30 తేదీల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 8 వరకు కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉండవు. అలాగే జనవరి 25న రథసప్తమి సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్టు టీటీడీ తెలిపింది. అయితే స్వయంగా తిరుమలకు వచ్చే వీఐపీలకు మాత్రం ప్రొటోకాల్ బ్రేక్ దర్శనాలు ఉంటాయి.

నక్క దాడిలో 12 మందికి గాయాలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా డొంకూరు గ్రామంలో ఓ నక్క మంగళవారం రాత్రి స్వైర విహారం చేసింది. దాని దాడిలో 12 మందికి గాయాలయ్యాయి. డొంకూరుకు చెందిన రైతులు మంగళవారం రాత్రి పొలాల్లో వరి నూర్పిడి ముగించుకుని ఇంటికి వస్తుండగా చీకట్లో నక్క దాడికి పాల్పడింది. గ్రామానికి చెందిన యువకులు పిచ్చి నక్కగా గుర్తించి కర్రలతో కొట్టి చంపేశారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈశాన్య రుతుపవనాలు బలహీనం

విశాఖపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు బలహీనంగా ఉన్నాయి. దీనికితోడు బంగాళాఖాతం నుంచి తూర్పు గాలులు నిలిచిపోయాయి. దీంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో పొడి వాతావరణం నెలకొంది. రానున్న నాలుగైదు రోజుల వరకు పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే చలిగాలుల తీవ్రత కొనసాగుతోంది. వాయవ్య భారతం మీదుగా వీస్తున్న శీతలగాలుల ప్రభావంతో ఏజెన్సీ ప్రాంతాలు, తెలంగాణకు ఆనుకుని ఉన్న ప్రాంతాలు, రాయలసీమల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు, నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. బుధవారం అల్లూరి జిల్లా అరకు లోయలో 4.4, డుంబ్రిగుడలో 4.7, జి.మాడుగులలో 4.8 డిగ్రీలు నమోదయ్యాయి.

బకాయిలు చెల్లించాలి

- మున్సిపల్ కాంట్రాక్టర్ల డిమాండ్

తాడేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల నుంచి మూడేళ్లుగా రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని మున్సిపల్ కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండలోని స్టేట్ ఆఫ్ ఏపీ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్(సబ్కా) కార్యాలయంలో బుధవారం రాష్ట్రంలోని మున్సిపల్ కాంట్రాక్టర్ల సమావేశం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ కూచిపూడి శివకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కొండా రమేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పెండింగ్ బిల్లుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన కొందరికే పేమెంట్లు జరుగుతున్నాయని, పాతవారికి జరగడం లేదని ఆరోపించారు.

కోర్టులో లొంగిపోనున్న పిన్నెల్లి సోదరులు..?

మాచర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలకు సుప్రీంకోర్టు ఇచ్చిన రెండు వారాలు గడువు గురువారంతో ముగియనుంది. సోదరులిరువురు గురువారం మాచర్లలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోనున్నట్లు సమాచారం. గత మే 24న వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావులు తెలంగాణలోని ఓ శుభకార్యంలో పాల్గొని ద్విచక్ర వాహనంపై వస్తూ బోదలవీడు వద్ద హత్యకు గురయ్యారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు 9 మందిని నిందితులుగా తేల్చి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. కాగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(ఏ6), పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(ఏ7)లు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా తిరస్కరించింది. దీంతో వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించగా తొలుత షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కాగా గత నెల 28న మధ్యంతర బెయిల్‌ను రద్దు చేస్తూ కోర్టులో లొంగిపోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో పిన్నెల్లి సోదరులు రెండు వారాల గడువు కోరగా అందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఆ గడువు గురువారంతో ముగియనుంది. దీంతో పిన్నెల్లి సోదరులు గురువారం కోర్టులో లొంగిపోనున్నట్లు సమాచారం.

TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED
TENDER NOTICE

The APTRANSCO invites on-line bids for Spec No.PMM23-e- 50/2025 for "Supply of 18Nos. 80MVA 220/33kV PTRs (Lot 1 -:9 Nos. Lot-2: 9Nos.) for utilization of Transformers at BESS (Phase-II) substations of APTRANSCO." Date and time of availability of tender 11.12.2025 by 17.00 Hrs. Further details can be seen in website(s) **www.eprocurement. gov.in** For further details Contact No: 9491030732. **Sd/- CHIEF ENGINEER / TRANSMISSION**
DIPR RO No.4653PP/CL/ADVT/1/1/2021-22, Dt: 10.12.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన

నెం.35/ఎ.టి.ఓ/నిట్ నెం.832 టు 842/2025-26, తేది: 04.12.2025
కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స. & పా.డివిజన్, బాపట్ల పరిధిలోని వివిధ గ్రాంట్ ద్వారా మంజూరైన 11 పనులకు **అంచనా విలువ: రూ.148.70 లక్షలతో** ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లు www.apeprocurement.gov.in నందు తేది:11.12.2025 నుండి అందుబాటులో ఉండును.
సం/- కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, బాపట్ల
DIPR R.O. No.18334/CL/ADVT/1/1/2021-22, Dt: 10.12.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No.91 to 93/TO/2025-26 తేది:06.12.2025
PM ABHIM గ్రాంట్స్ క్రింద **రూ.126.00 లక్షల** అంచనా వ్యయంతో 3 భవనం పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరుచున్నారు. **బిడ్ అప్‌లోడ్ & డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 12.12.2025 నుండి. తదుపరి వివరాల కొరకు **www.tender.apeprocurement.gov.in** దర్శించండి. ఫోన్ నం: 6305693265.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, పంచాయతీ రాజ్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా
DIPR RO No.18344/CL/ADVT/1/1/2021-22, Dt:10.12.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం,
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref:B1/93/2025 **ఫారమ్ నెం. VII** **Dt.09.12.2025**

(2013 వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన, నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ -1 ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్థిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజాప్రయోజనములకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాశితులు వరరామచంద్రపురం మండలం చొక్కనపల్లి గ్రామం, చింతూరు డివిజన్, అల్లూరి సీతారామరాజు జిల్లా నిర్వాశితులకు భూమికి భూమి కేటాయించు నిమిత్తం ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం, చీమలవారిగూడెం గ్రామములో అవసరమై ఉన్నదని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూల్లు దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థవారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2025-26 నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూల్లు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనములకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాశితులు వరరామచంద్రపురం మండలం చొక్కనపల్లి గ్రామం, చింతూరు డివిజన్, అల్లూరి సీతారామరాజు జిల్లా నిర్వాశితులకు భూమికి భూమి కేటాయించు నిమిత్తం ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం చీమలవారిగూడెం గ్రామములో అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : ఏలూరు | మండలం : బుటాయిగూడెం | గ్రామం : చీమలవారిగూడెం

వరుస సంఖ్య	ఎల్.పి. నెం.	సర్వే నెం	వివరణ	భూసేకరణ క్రింద విస్తీర్ణం	సంబంధించిన ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడములు వివరములు
1	2	3	4		6	7				8
1	186	51/1	స.పుంజ	1.07	పాకనాటి విజయభాస్కర్ తండ్రి ఆదినారాయణ	ఎల్.పి.నెం. 157, 173	ఎల్.పి.నెం. 189	కురసకన్నప్ప గూడెం గ్రామం	ఎల్.పి.నెం. 156, 158	ఖాళీ స్థలం
2		51/2	స.పుంజ							
3	188	51/3	స.పుంజ	0.88	పాకనాటి రాజశేఖర్ తండ్రి ఆదినారాయణ	ఎల్.పి.నెం. 189	ఎల్.పి.నెం. 166	ఎల్.పి.నెం. 191	ఎల్.పి.నెం. 187	ఖాళీ స్థలం
4		51/6								బోరు-1, పైపులైను-1, ఎలిక్ట్రికల్ పోల్-1, డ్రిప్-1
5	187	51/6	స.పుంజ	0.87	పాకనాటి చంద్రశేఖర్ తండ్రి ఆదినారాయణ	ఎల్.పి.నెం. 189	ఎల్.పి.నెం. 166	ఎల్.పి.నెం. 188	ఎల్.పి.నెం. 165	డ్రిప్, కొబ్బరి-5
6	191	51/6	స.పుంజ	2.71	రెడ్డం కృష్ణారావు తండ్రి లక్ష్మయ్య	ఎల్.పి.నెం. 189	ఎల్.పి.నెం. 171	ఎల్.పి.నెం. 172	ఎల్.పి.నెం. 188, 166, 167, 168	ఖాళీ స్థలం
మొత్తం				5.53						

ఈ భూముల ప్లాను శ్రీ ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారి కార్యాలయంలో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకొనవచ్చును. చట్టములో అంశములను అనుసరించి, ఈ ప్రతిపాదిత భూసేకరణ జరిగిన ఆర్ అండ్ ఆర్ గ్రామము నందు నూతన భూసేకరణ మరియు పురావాస పున:స్థాపన న్యాయమైన, పారదర్శకత నష్టపరిహారం పొందే హక్కు చట్టం, 2013 అనుసరించి ఇంటింటికి వెళ్ళి సర్వే జరిపి ఇందు అర్హులైన నిర్వాశిత కుటుంబములు గాని, ప్రభావిత కుటుంబములు లేవని నివేదిక ఆధారంగా నిర్ధారించడమైనది.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని, లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలను.

కె. సతీష్
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఆర్.ఎం.సి.యూనిట్ -I, కొవ్వూరు

సం/- యస్. సరళావందనం
భూసేకరణాధికారి మరియు స్పెషల్ కలెక్టరు(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం,
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref:B1/101/2025 **ఫారమ్ నెం. VII** **Dt.09.12.2025**

(2013 వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన, నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ -1 ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్థిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజాప్రయోజనములకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాశితులు వరరామచంద్రపురం మండలం చొక్కనపల్లి గ్రామం, చింతూరు డివిజన్, అల్లూరి సీతారామరాజు జిల్లా నిర్వాశితులకు భూమికి భూమి కేటాయించు నిమిత్తం ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం, కోటరామచంద్రపురం గ్రామములో అవసరమై ఉన్నదని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూల్లు దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థవారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2025-26 నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూల్లు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనములకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాశితులు వరరామచంద్రపురం మండలం చొక్కనపల్లి గ్రామం, చింతూరు డివిజన్, అల్లూరి సీతారామరాజు జిల్లా నిర్వాశితులకు భూమికి భూమి కేటాయించు నిమిత్తం ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం కోటరామచంద్రపురం గ్రామములో అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : ఏలూరు | మండలం : బుటాయిగూడెం | గ్రామం : కోటరామచంద్రపురం

వరుస సంఖ్య	ఎల్.పి. నెం.	సర్వే నెం	వివరణ	భూసేకరణ క్రింద విస్తీర్ణం	సంబంధించిన ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడములు వివరములు
1	2	3	4	5	6	7				8
1	71	37	స.పుంజ	3.597	పాకనాటి రాజశేఖర్ తండ్రి ఆదినారాయణ	L.P.No. 70	L.P.No. 73	L.P.No. 72	L.P.No. 70, 74	నిమ్మ-527, కొబ్బరి-268, ఆరెంజ్-10, సపోట-1, మామిడి-6, మునగ-8, పనస-8, తాడి-13, టేకు-6, బోర్లు-2, సీతాఫలం-6, కరెంటు స్థంబాలు-4, పైపులైన్, డ్రిప్, తైవాన్ జామ-4, షెడ్-1
2	72	37	స.పుంజ	0.947	పాకనాటి రాజశేఖర్ తండ్రి ఆదినారాయణ	L.P.No. 71	L.P.No. 71	L.P.No. 199	L.P.No. 73	వేప-110, కొబ్బరి-60, మునగ-2, ఆరెంజ్-3, బోర్-1, డ్రిప్, పైపులైన్, మామిడి-9, పనస-6, తైవాన్‌జామ-2
3	269	23	స.పుంజ	3.42	యండాపు సత్యవతి భర్త వెంకటరావు	L.P.No. 59	L.P.No. 57	L.P.No. 77, 78	L.P.No. 55	మామిడి-1, సీతాఫలం-9, తాడి-8, వేప-1, నెమలి-1, బోర్-1, పైపులైన్-1,
4	59	23	స.పుంజ	3.65	నక్క వరలక్ష్మి భర్త అప్పారావు	L.P.No. 63, 60	L.P.No. 58	L.P.No. 77	L.P.No. 55	తాడి-4, సీతాఫలం-6, నెమలి-1, టేకు-4, వేప-2
5	257	110	స.పుంజ	5.993	వల్లభనేని సుబ్బారావు తండ్రి సూర్యనారాయణ	L.P.No. 256, 253, 252	L.P.No. 258	L.P.No. 261	L.P.No. 180	తాడి-16, మామిడి-1, బోరు-2, షెడ్-1
6	258	110	స.పుంజ	2.88	వల్లభనేని నాగేశ్వరరావు తండ్రి సూర్యనారాయణ	L.P.No. 257	L.P.No. 260	L.P.No. 261	L.P.No. 155	వేప-2, తాడి-9
మొత్తం				20.487						

ఈ భూముల ప్లాను శ్రీ ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారి కార్యాలయంలో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకొనవచ్చును. చట్టములో అంశములను అనుసరించి, ఈ ప్రతిపాదిత భూసేకరణ జరిగిన ఆర్ అండ్ ఆర్ గ్రామము నందు నూతన భూసేకరణ మరియు పురావాస పున:స్థాపన న్యాయమైన, పారదర్శకత నష్టపరిహారం పొందే హక్కు చట్టం, 2013 అనుసరించి ఇంటింటికి వెళ్ళి సర్వే జరిపి ఇందు అర్హులైన నిర్వాశిత కుటుంబములు గాని, ప్రభావిత కుటుంబములు లేవని నివేదిక ఆధారంగా నిర్ధారించడమైనది.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని, లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలను.

కె. సతీష్
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఆర్.ఎం.సి.యూనిట్ -I, కొవ్వూరు

సం/- యస్. సరళావందనం
భూసేకరణాధికారి మరియు స్పెషల్ కలెక్టరు(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,రాజమహేంద్రవరం

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
I.T. శాఖ, తి.తి.దే., తిరుపతి
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Adv.No.16/TTD-11021(91)/5/2025-IT-TTD, తేది: 09.12.2025
దిగువ NIT No.లతో పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ఆన్‌లైన్ బహిరంగ టెండర్లు కోరబడుతున్నవి:
NIT No. 95 TO 114/EDPM/TTD/TPT/2025-26
టెండరు ప్రకటన కొరకు **http://www.tirumala.org** ను దర్శించగలరు. ఇ-టెండరులో పాల్గొనుటకు **https://tender.apeprocurement.gov.in** కు లేదా **https://www.apeprocurement.gov.in**కు లాగాన్ కాగలరు.
కార్యనిర్వహణాధికారి
TTD-40021/10/2025-PRO SEC (Adv. No.316) Dt. 10.12.2025

ADDANKI MUNICIPALITY
E-Procurement Tender Notice

ROC.No. 953/2024/E1 Dt: 10-12-2025

S. No.	Tender Notice No	Name of the Work	Estimate Amount (Rs.in Lakhs)
1.	82/NIT/2025-26	Construction of Town Hall in Addanki Municipality under CSR Grants	330.00

Download Start Date & Time : 10-12-2025 5.00PM
Download End Date & Time : 24-12-2025 5.00PM
Receipts of Bids End Date & Time : 26-12-2025 4.00PM
PQ Stage Opening Date & Time : 26-12-2025 4.01PM
For further details visit "www.eprocurement.gov.in"
Contact Phone No: 7331143660

Sd/- **Commissioner,**
Addanki Municipality.

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
IGMC STADIUM, LABBIPET, BANDAR ROAD, VIJAYAWADA

Tenders are hereby invited from reputed and experienced companies for the following tenders.

S. No	Tender ID	Name of the work	Estimate Contract Value (in Rs.)
1	873857	Providing to electrification, Compound wall, wooden flooring works Kreeda Vikasa Kendram at Jaggampeta, Kakinada District.	25,14,035/-
2	873860	Providing to civil, Play fields, and External works Kreeda Vikasa Kendram at Jaggampeta, Kakinada District.	30,13,010/-
3	873863	Providing Electrification, Compound Wall & Wooden Flooring Works to Kreeda Vikasa Kendra at Peddapuram, Kakinada District.	25,87,427/-
4	873867	Providing Civil Works, Playfields & External Works to KVK at Peddapuram, Kakinada District.	30,13,010/-
5	873872	Providing Civil Works & Electrical Works to KVK at Peddapuram, Kakinada District.	23,87,876/-

Bid Starting Date 11.12.2025. Bid End date: 19.12.2025. Tender documents are available on e-procurement platform **tender. apeprocurement.gov.in**. Tenders will be opened in the presence of company representatives who attend the evaluation. For further details contact:8501074922.
Sd/- Vice Chairman and Managing Director
DIPR RO No.4656PP/CL/ADVT/1/1/2021-22, Dt: 10.12.2025

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
IGMC STADIUM, LABBIPET, BANDAR ROAD,VIJAYAWADA

Tenders are hereby invited from reputed and experienced Companies For the following tenders.

S.No.	Tender ID	Name of the Work	Estimate Contract Value (in Rs.)
1	873680	Completion of Incomplete Civil work and Compound wall at kreeda vikasa kendram (KVK) in Pithapuram of Kakinada District, Andhra Pradesh.	28,60,234/-
2	873686	Completion of Incomplete Civil work and Electrical work at kree-da Vikasa kendram in Pithapurama of kakinada District, Andhra Pradesh.	30,51,699/-
3	873691	Tender Notice for Completion of incom-plete kreeda Vikasa kendra at kota, Gudur Constituency, Tirupathi District (part-1)"	30,73,876/-
4	873695	-Do- (Part-2)	31,22,065/-
5	873698	-Do- (Part-3)	31,08,089/-
6	873701	-Do- (Part-4)	30,78,305/-
7	873704	-Do- (Part-5)	29,83,170/-
8	873707	-Do- (Part-6)	23,96,824/-
9	873722	Completion of Incomplete Indoor Stadium at Gummalakshmipuram (V&M), Parvathipuram Manyam District (Part-1)	31,36,372/-
10	873724	-Do- (Part-2)	31,13,077/-
11	873726	-Do- (Part-3)	31,17,601/-
12	873730	-Do- (Part-4)	31,13,175/-
13	873735	-Do- (Part-5)	29,21,123/-
14	873738	-Do- (Part-6)	31,17,278/-
15	873743	Completion of Incomplete Indoor Stadium & Providing of 400 mtrs Athletic Track at Gummalakshmipuram (V&M), Parvathipuram manyam District (Part-7)	31,17,750/-
16	873748	-Do- (Part-8)	15,91,138/-
17	873769	Development of SAAP Water Sports Center at Rushikonda, Vishakhapatnam (Part-1).	28,39,451/-
18	873772	-Do- (Part-2)	30,09,340/-
19	873776	-Do- (Part-3)	29,63,950/-
20	873777	-Do- (Part-4)	30,89,360/-
21	873779	-Do- (Part-5)	30,18,728/-
22	873780	-Do- (Part-6)	31,10,180/-
23	873782	-Do- (Part-7)	26,43,386/-
24	873785	-Do- (Part-8)	30,00,000/-
25	873787	-Do- (Part-9)	15,90,672/-

Bid Starting Date 10.12.2025. Bid End date: 18.12.2025. Tender documents are available on e-procurement platform Tender apeprocurement.gov.in tenders will be opened In the presence of company representatives who attend the evaluation For further details contact:8501074922.
Sd/- Vice Chairman and Managing Director
DIPR RO No.4655PP/CL/ADVT/1/1/2021-22, Dt.10.12.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం,
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref:B1/99/2025 **ఫారమ్ నెం. VII** **Dt.09.12.2025**

(2013 వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన, నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ -1 ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్థిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజాప్రయోజనములకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాశితులు వరరామచంద్రపురం మండలం చొక్కనపల్లి గ్రామం, చింతూరు డివిజన్, అల్లూరి సీతారామరాజు జిల్లా నిర్వాశితులకు భూమికి భూమి కేటాయించు నిమిత్తం ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం, కొవ్వాడ గ్రామములో అవసరమై ఉన్నదని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూల్లు దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థవారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2025-26 నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ స్పెషల్ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమండ్రి వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూల్లు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనములకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాశితులు వరరామచంద్రపురం మండలం చొక్కనపల్లి గ్రామం, చింతూరు డివిజన్, అల్లూరి సీతారామరాజు జిల్లా నిర్వాశితులకు భూమికి భూమి కేటాయించు నిమిత్తం ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం కొవ్వాడ గ్రామములో అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : ఏలూరు | మండలం : బుటాయిగూడెం | గ్రామం : కొవ్వాడ

వరుస సంఖ్య	ఎల్.పి. నెం.	సర్వే నెం	వివరణ	భూసేకరణ క్రింద విస్తీర్ణం	సంబంధించిన ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడములు వివరములు
1	2	3	4	5	6	7				8
1	11	4/1	స.పుంజ	7.00	మల్లిన మంగరాజు భర్త రామచంద్రరావు (లేటు)	స.నెం.1	రాజనగరం గ్రామం	స.నెం. 4/2A, 4/2B, 13	R.S.No. 2, 3	పామాయిల్-479 (2 సం.వయస్సు) కొబ్బరి-16 (పెద్దవి) కొబ్బరి-58 (చిన్నవి) టేకు-4, వెదురు-10, బోర్-1, డ్రిప్-1, ఫెన్సింగ్, కరెంటు సర్వీస్-1, షెడ్-1
మొత్తం				7.00						

ఈ భూముల ప్లాను శ్రీ ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారి కార్యాలయంలో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకొనవచ్చును. చట్టములో అంశములను అనుసరించి, ఈ ప్రతిపాదిత భూసేకరణ జరిగిన ఆర్ అండ్ ఆర్ గ్రామము నందు నూతన భూసేకరణ మరియు పురావాస పున:స్థాపన న్యాయమైన, పారదర్శకత నష్టపరిహారం పొందే హక్కు చట్టం, 2013 అనుసరించి ఇంటింటికి వెళ్ళి సర్వే జరిపి ఇందు అర్హులైన నిర్వాశిత కుటుంబములు గాని, ప్రభావిత కుటుంబములు లేవని నివేదిక ఆధారంగా నిర్ధారించడమైనది.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని, లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలను.


కె. సతీష్
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఆర్.ఎం.సి.యూనిట్ -I, కొవ్వూరు

సం/- యస్. సరళావందనం
భూసేకరణాధికారి మరియు స్పెషల్ కలెక్టరు(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,రాజమహేంద్రవరం

'వడ్డీ'లోనూ వైసీపీ బాదుడు!

12% వడ్డీకి అప్పులు తెచ్చారు

- రుణాలు, వడ్డీలు రీ-షెడ్యూల్‌తో ఆదా
- కలిసి పని చేస్తే సత్ఫలితాలు: సీఎం



అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అప్పులు చేయడమే ధ్యేయంగా గత వైసీపీ ప్రభుత్వం అధిక వడ్డీలకు భారీ ఎత్తున రుణాలు చేసిందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఫలితంగా వడ్డీల రూపంలో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని సీఎం చంద్రబాబు చెప్పారు. "గత పాలకుల నిర్లక్ష్యంతో సగటున 12 శాతం మేర అధిక వడ్డీలకు అప్పులు తెచ్చారు. కొన్ని రుణాలను రీ-షెడ్యూలింగ్ ద్వారా మొదటి ఏడాదిలోనే రూ.512 కోట్ల మేర ఆదా చేయగలిగాం. వచ్చే మార్చి నాటికి రూ.1000 కోట్ల మేర ఆదా అవుతుంది. హెచ్‌వోడీలు జాగ్రత్తగా వ్యవహరిస్తే ప్రజాధనం వృథా కాకుండా నిలువరించే అవకాశం ఉంది. మొత్తంగా అప్పులపై రూ.7 వేల కోట్లు ఆదా అవుతుందని అంచనా. గత పాలనలో ఏపీ బ్రాండ్ పడిపోవడం వల్ల అదనంగా వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పుడు వాటన్నింటినీ 'రీ-షెడ్యూల్' చేసి ప్రజాధనాన్ని కాపాడుతున్నాం. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథం రావడంతో పాటు, వాళ్లకు సంతృప్తి కలిగించేలా ప్రభుత్వ శాఖలు పనిచేయాల్సిందే. అంతా కలిసి పనిచేస్తే 3 నెలల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చే అవకాశం ఉంది." అని సీఎం చంద్రబాబు తెలిపారు.

పరుగు తీయాలి

(మొదటి పేజీ తరువాయి)

తన అభిప్రాయాలను సూటిగా చెబుతూ... స్పష్టమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. 'సుస్థిరాభివృద్ధి' లక్ష్యాలను గుర్తు చేస్తూ... ఆయా శాఖల 'ప్రోగ్రెస్' కార్డులను వారి ముందుంచారు. 18 నెలల పాలనలో ఏ శాఖ గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో వివరించారు. ఇక మాన్యువల్ ఫైల్స్ పెట్టడం కుదరదని... జనవరి 15 నుంచి పరిపాలన మొత్తం 'ఆన్‌లైన్'లోనే సాగాలని స్పష్టం చేశారు. జనవరి 15 తర్వాత 'వాట్సాప్ గవర్నెన్స్'లో మొత్తం 1200 సేవలు అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజలు వాటిని వినియోగించుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. మంత్రులు, కార్యదర్శులు రోజుల తరబడి ఫైళ్లను పెండింగ్‌లో పెట్టడం కుదరదని... 15 రోజుల్లో 'క్లియర్' కావాలని తేల్చి చెప్పారు. ప్రస్తుతం ప్రజల్లో 69.98 శాతం సంతృప్తి రేటు ఉందని... ఇది మూడు నెలల్లో 80 శాతానికి చేరాలని మంత్రులు, కార్యదర్శులకు లక్ష్యం విధించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద వచ్చిన నిధులు మురిగిపోయేందుకు వీల్లేదని... వాటికి సంబంధించి రాష్ట్ర వాటా నిధులను విడుదల చేసి ఉపయోగించుకోవాలని సీఎం స్పష్టం చేశారు. నిధులు ఖర్చుచేయక పోతే సంబంధిత మంత్రులు, కార్యదర్శులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు. సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా చేసి చూపిస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. దీనికి అనుగుణంగా ఆదాయం పెంచుకుని, ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలని ఆర్థిక శాఖకు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అధిక వడ్డీకి అప్పులు తెచ్చిందని... కొన్ని రుణాలను రీషెడ్యూల్ చేసుకోగలిగితే మార్చి నాటికి వెయ్యి కోట్లు ఆదా అవుతుందని అంచనా వేశారు. ఈనెల 17, 18 తేదీల్లో జరిగే కలెక్టర్ల సదస్సులో ఆయా శాఖల లక్ష్యాలు, ప్రగతిపై చంద్రబాబు మరింత స్పష్టమైన, సవివరమైన సూచనలు చేయనున్నారు.

ఫైళ్ల 'పరుగు' ఇలా!

డోలా, నిమ్మల, ఫరూక్ టాప్.. సీఎం, లోకేశ్‌కు, 3 రోజులు

- దుర్గేశ్, సత్యకుమార్ కూడా
- పవన్ కల్యాణ్, కొండపల్లికి 4 రోజులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఈ-ఆఫీస్ ఫైళ్ల పరిష్కారంలో సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ముందు వరసలో ఉన్నారు. ఆయన లాగిన్‌కు ఫైల్ రాగానే సగటున రెండు రోజుల 41 నిమిషాల వ్యవధిలోనే చూసి పరిష్కరిస్తున్నారు. గత ఏడాది జూలై 15 నుంచి ఈ నెల 9 వరకు 651 ఫైళ్లు పరిష్కరించారు. ఆ తర్వాతి స్థానం మంత్రి నిమ్మల రామానాయుడిది. సగటున తన లాగిన్‌కొచ్చిన ఫైలును చూసేందుకు రెండు రోజుల 7 గంటల సమయం తీసుకుంటున్నారు. ఈ ఇద్దరూ ఒక్క ఫైలు కూడా పార్కింగ్(ఎటూ తేల్చకుండా పెండింగ్‌లో పెట్టడం) లో ఉంచలేదు. మూడో స్థానంలో న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ ఉన్నారు. ఆయన ఇప్పటి వరకు 1,532 ఫైళ్లు పరిష్కరించగా, సగటున తనకొచ్చిన ఫైలును పరిశీలించేందుకు రెండు రోజుల 9.59 గంటల సమయం తీసుకుంటు న్నారు. అయితే ఈయన 20 ఫైళ్లు పార్కింగ్‌లో పెట్టారు. ఫైళ్ల పరిష్కారం, లాగిన్‌కొచ్చిన ఫైళ్లు చూసుకునే సమయం ఆధారంగా ఇచ్చిన డేటాలో ముఖ్యమంత్రి చంద్రబాబుది 6వ స్థానం. నిజానికి, మంత్రుల అందరికంటే సీఎంకు ఎక్కువ ఫైల్స్ వచ్చాయి. ఇప్పటి వరకు ఆయనకు 6,713 ఫైళ్లు రాగా 6,653 పరిష్కరించారు. అత్యధికంగా 401 ఫైళ్లను పార్కింగ్ లో ఉంచారు. ఆయన ఫైల్స్‌ను చూసేందుకు సగటున 3 రోజుల 8.18 గంటల సమయం తీసుకుంటున్నారు. ఐటీ, విద్యా శాఖల లోకేశ్‌ది 9వ వస్థానం. ఆయన లాగిన్‌కు మొత్తం 3,916 ఫైల్స్ రాగా, 3,669 పరిష్కరించారు. 266 పార్కింగ్‌లో ఉంచారు. ఒక ఫైల్‌ను చూసేందుకు సగటున 3 రోజుల 14:10 గంటలు తీసుకుం టున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కలా ణ్ 11వ స్థానంలో ఉన్నారు. ఆయన 2,001 ఫైళ్లు పరిష్కరించారు. 67 పార్కింగ్‌లో ఉంచారు. తన లాగిన్‌కొచ్చిన ఫైళ్లను చూసేందుకు ఆయన సగటున 4 రోజుల 9.43 గంటల సమయం తీసుకుంటున్నారు. అచ్చెన్నాయుడి లాగిన్‌లో 127 ఫైళ్లు పార్కింగ్‌లో ఉన్నాయి. ఫైళ్ల పరిష్కారంలో ఈయన స్థానం 15.

ఆ ఇద్దరూ బాగా వెనుకబడ్డారు

ఈ-ఆఫీసు ఫైళ్లను చూడడంలో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొల్లు రవీంద్ర వెనుకబడ్డారు. ఫైలు చూసేందుకు రాంప్రసాద్‌రెడ్డి సగటున 15 రోజుల 19.53 గంటలు తీసుకుంటున్నారు. కొల్లు రవీంద్ర 15 రోజుల 5:23 గంటలు తీసుకుంటున్నారు. మంత్రి పయ్యావుల కేశవ్‌కు 11 రోజులు పడుతోంది. ఈయన చివరి నుంచి మూడోస్థానంలో నిలిచారు. ఐటీ శాఖ నివేదిక ప్రకారం సీఎం, మంత్రుల ఈ-ఆఫీస్‌ల్లో 978 ఫైళ్లు పార్కింగ్‌లో ఉన్నాయి. వీటిలో సీఎం 401, లోకేశ్ 266 పార్కింగ్‌లో ఉంచారు.

శాఖల్లో పెండింగ్ ఇలా..

సకాలంలో ఫైళ్లు చూడడంలో కొందరు ఐఏఎస్‌లు ముందు వరసలో ఉంటే.. మరి కొందరు వెనకబడిపోయారు. ఐపీఎస్ రాహుల్‌దేవ్ శర్మ సగటున 18 రోజుల 2.45 గంటల సమయం తీసుకుంటున్నారు. ఐఏఎస్ అధికారి రేఖారాణి 11 రోజుల 5.26 గంటల సమయం తీసుకుంటున్నారు. సచివాలయం స్థాయిలో ఫైళ్ల పెండింగ్ భారీగా ఉంటోందని నివేదిక తేటతెల్లం చేసింది. పరిశ్రమల శాఖలో ఒక ఫైలు చూసేందుకు 27 రోజులు, పంచాయతీరాజ్‌లో 24 రోజులు, ఇంధన శాఖలో 23 రోజులు, రెవెన్యూలో 21 రోజుల సమయం పడుతోంది. పాఠశాల విద్యలో 16 రోజులు, ఉన్నత విద్యలో 15 రోజులు పడుతోంది. గిరిజన శాఖలో ఫైళ్లను చూడడానికి 12 రోజుల సమయం పడుతుండటం పట్ల సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆఫీసులో మాత్రమే ఒక్క రోజులోనే ఫైలు చూసి పరిష్కరిస్తున్నారు. సీఎం కార్యాలయానికి 3 రోజుల సమయం పడుతోంది.

ఎవరు... ఎలా

మంత్రులు...	సగటు స్పందన కాలం (రోజులు)
డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి:	2 రోజులు
నిమ్మల రామానాయుడు:	2 రోజులు
ఎన్‌ఎండీ ఫరూక్:	2 రోజులు
బీసీ జనార్దన్‌రెడ్డి:	3 రోజులు
పి.నారాయణ:	3 రోజులు
సీఎం చంద్రబాబు:	3 రోజులు
కందుల దుర్గేశ్:	3 రోజులు
సత్యకుమార్ :	3 రోజులు
లోకేశ్:	3 రోజులు
కొండపల్లి శ్రీనివాస్:	4 రోజులు
పవన్ కల్యాణ్:	4 రోజులు
ఎస్. సవిత:	4 రోజులు
అనగాని సత్యప్రసాద్:	4 రోజులు
ఆనం రామనారాయణరెడ్డి:	5 రోజులు
కింజారపు అచ్చెన్నాయుడు:	5 రోజులు
గొట్టిపాటి రవి :	6 రోజులు
టి.జి. భరత్:	7 రోజులు
వాసంశెట్టి సుభాష్:	7 రోజులు
గుమ్మిడి సంధ్యారాణి:	8 రోజులు
వంగలపూడి అనిత:	8 రోజులు
కొలుసు పార్థసారథి:	8 రోజులు
నాదెండ్ల మనోహర్:	9 రోజులు
పయ్యావుల కేశవ్:	11 రోజులు
కొల్లు రవీంద్ర:	15 రోజులు
మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి:	15 రోజులు

కల్తీ నెయ్యిపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదేం?

- సుబ్రహ్మణ్యంపై సిట్ ప్రశ్నల వర్షం

తిరుపతి/తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'శ్రీవారి ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ అవుతోందని తెలిసినా పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదు? టీటీడీ చైర్మన్‌కు ఇచ్చిన ఆ సమాచారాన్ని ఈవోకు ఎందుకు ఇవ్వలేదు? మైసూరు సీఎఫ్‌టీఆర్‌ఐ రిపోర్టును ఎందుకు తొక్కిపెట్టారు' అంటూ కల్తీ నెయ్యి కేసులో నిందితుడు ఆర్‌ఎస్‌ఎస్‌వీఆర్ సుబ్రహ్మణ్యంపై సిట్ ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న ఏ16 అజయ్ కుమార్ సుగంధ్, ఏ29 టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ మాజీ జీఎం సుబ్రహ్మణ్యంను సిట్ మంగళవారం నుంచి నాలుగు రోజుల కస్టడీకి తీసుకున్న సంగతి తెలిసిందే. రెండో రోజైన బుధవారం కూడా తిరుపతిలోని సిట్ కార్యాలయంలో వీరిద్దరినీ సిట్ అధికారుల బృందం విచారించింది. గతంలో ప్రొక్యూర్‌మెంట్ జీఎంగా కీలక పోస్టులో పనిచేసి కల్తీ నెయ్యి సరఫరాకు సహకరించారన్న ఆరోపణలెదుర్కొంటున్న సుబ్రహ్మణ్యంను సిట్ లోతుగా ప్రశ్నించింది. "భోలేబాబా, ప్రీమియర్, వైష్ణవీ డెయిరీ నుంచి టీటీడీకి సరఫరా అయిన నెయ్యి కల్తీతో కూడుకున్నదని 2022 ఆగస్టులో మైసూరు సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ నుంచి రిపోర్టు రాగా వెంటనే పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదు? బాధ్యత కలిగిన జీఎంగా కల్తీ నెయ్యి సరఫరాను ఎందుకు అడ్డుకోలేదు? మైసూరు ల్యాబ్ నివేదిక గురించి టీటీడీ చైర్మన్‌కు సమాచారమిచ్చి, ఈవోకు మాత్రం ఎందుకు ఇవ్వలేదు? కల్తీ నెయ్యి సరఫరాకు సహకరించకపోతే సంబంధిత డెయిరీల ప్రతినిధుల నుంచి రూ.3.50 లక్షల నగదు ఎందుకు తీసుకున్నారు? మైసూరు ల్యాబ్ నివేదికను ఎందుకు తొక్కిపెట్టారు?" అని ప్రశ్నించినట్టు సమాచారం.

నేడూ విచారణ

"నివేదికను తొక్కి పెట్టడం, ఈవోకు, పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం వంటివి అటుంచితే అసలు కల్తీ నెయ్యి అని తెలిశాక కూడా ఎందుకు అనుమతించారు. అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నఅప్పన్నతో ఎలా పరిచయమైంది? అతడికి నెయ్యి సరఫరాదారుల వివరాలు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది?" అని సిట్ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. కాగా టీటీడీ చైర్మన్ పీఏ కదా అన్న గౌరవంతోనే చిన్నఅప్పన్న అడిగిన వివరాలు ఇచ్చానని సుబ్రమణ్యం సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. తనను అనవసరంగా ఇరికిస్తున్నారని ఆరోపించినట్టు తెలిసింది. కాగా ఏ16 నిందితుడు అజయ్‌కుమార్ సుగంధ్ మహాముదరని సిట్ వర్గాల ద్వారా తెలిసింది. రెండో రోజు కూడా సిట్ అధికారుల విచారణలో అతడు పెద్దగా నోరు విప్పలేదు. బుధవారం ఉదయం 10 గంటలకు నిందితులు ఇరువురినీ సిట్ కార్యాలయానికి తీసుకొచ్చిన అధికారులు సాయంత్రం 6 గంటల దాకా వేర్వేరుగా విచారించినట్టు తెలిసింది. సాయంత్రం 6.30 గంటలకు వారిని ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. గురువారం వీరిద్దరి నుంచి సాధ్యమైనంత సమాచారం రాబట్టేందుకు ప్రయత్నించే అవకాశముంది.

ఆ 12 మందిపై ప్రాసిక్యూషన్!

- టీటీడీ ఈవో అనుమతి కోరుతూ సిట్ లేఖ

తిరుపతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసు దర్యాప్తు దాదాపు చివరకు వచ్చిన దశలో, టీటీడీకి చెందిన 12 మంది ప్రాసిక్యూషన్‌కు అనుమతి వ్వాలంటూ ఈవోకు 'సిట్' లేఖ రాసింది. ఈ కేసులో దేవస్థానానికి చెందిన 9మంది ఇప్పటికే నిందితులుగా ఉండగా, వారిలో నలుగురు ఇదివరకే పదవీ విరమణ చెందారు. సర్వీసులో కొనసాగుతోంది ఐదుగురే. అయినా, సిట్ లేఖలో 12 మంది పేర్లున్నాయి. దీంతో మిగిలిన ఆ ఏడుగురు ఎవరన్నది టీటీడీ వర్గాలను ఉత్కంఠకు గురిచేస్తోంది. ఈ సంఖ్య 12 వద్దే ఆగుతుందా... ఇంకా పెరుగుతుందా? అనే చర్చ ఈ వర్గాలలో మొదలైంది. టీటీడీ నిబంధనల ప్రకారం, ఉద్యోగి రిటైరైన ఏడాదిలోగా ప్రాసిక్యూషన్ చేయాల్సి వస్తే ఈవో అనుమతి అవసరం. ఈ నిబంధనల ప్రకారం... ఏడాదిలోపు ఒకరు మాత్రమే పదవీ విరమణ చేశారు

చిత్రజ్యోతి

SINCE 1965



మనసుకు హత్తుకునేలా..

రోషన్, అనస్వర రాజన్ జంటగా ప్రదీప్ అద్వైతం తెరకెక్కిస్తున్న సినిమా 'ఛాంపియన్'. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి రెండో పాట 'సల్లంగుండాలే'ను విడుదల చేశారు మేకర్స్. వివాహం చేసుకుని పుట్టినింటిని, సొంతూరును వదిలి వెళ్తున్నామని బాధపడే వధువుకు నచ్చజెప్పే సందర్భంలో వచ్చే ఈ పాట మనసుకు హత్తుకునేలా ఉంది. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను రితేశ్ జి రావు, మనీశా ఈరబత్తిని ఆలపించారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వర రావు, సినిమాటోగ్రఫీ: ఆర్.మధీ.

అదిరిపోయే యాక్షన్ హంగామా



నందమూరి బాలకృష్ణ టైటిల్ రోల్‌లో బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం' చిత్రం రిలీజ్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇది ఇప్పటికే సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచేసింది. 'అఖండ' అవతార్‌లో అదరగొట్టారు బాలకృష్ణ. ధర్మ రక్షకుడిగా ఆయన పోషించిన ఈ పాత్ర సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లేలా ఉంది. అద్భుతమైన పోరాట ఘట్టాలు, ఆకట్టుకునే విజువల్స్, గూస్ బంప్స్ తెప్పించే నేపథ్య సంగీతంతో నిండిన ఈ టీజర్ ప్రస్తుతం అందర్నీ ఆకట్టుకుంటోంది. బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట 14 రీల్స్ ప్లస్ బేనర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ శుక్రవారం విడుదల అవుతోంది.

టికెట్ ధరల పెంపు: 'అఖండ 2:తాండవం' విడుదల నేపథ్యంలో ఈ సినిమాకు టికెట్ ధరలను పెంచుతూ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. ఈ రోజు సాయంత్రం ఎనిమిది గంటల నుంచి ప్రీమియర్ షోలను ప్రదర్శించుకునేలా అనుమతులు జారీ అయ్యాయి. ప్రీమియర్ షో బుకింగ్స్ నేడు ప్రారంభం కానున్నాయి.

తెలంగాణలో ఇలా..: సింగిల్ స్ర్కీన్స్‌లో రూ. 50 (జీఎస్టీ అదనం), మల్టీప్లెక్సుల్లో రూ.100 (జీఎస్టీ అదనం) చొప్పున పెంచుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల 12 నుంచి 14 వరకు ఈ ధరలు అమల్లో ఉంటాయి. ప్రీమియర్ షో టికెట్ ధరను రూ.600గా నిర్ణయించింది. ఈ టికెట్ ధరల ఆదాయంలో 20 శాతం మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు వెళ్లనుంది.

ఏపీలో..: సింగిల్ స్ర్కీన్స్‌లో రూ.75 (జీఎస్టీ అదనం), మల్టీప్లెక్సుల్లో రూ.100 (జీఎస్టీ అదనం) చొప్పున ధరలు పెంపునకు అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. ఈ నెల 12 నుంచి పది రోజుల పాటు ఈ ధరలు అమల్లో ఉండనున్నాయి. ప్రీమియర్ షోకు రూ. 600(జీఎస్టీ అదనం)గా టికెట్ ధర నిర్ణయించారు.

అఖండ 2 విడుదల తేదీ మార్పు చిన్న సినిమాలకు భారమే

● ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ కేఎల్ దామోదర ప్రసాద్



భారీ అంచనాలున్న 'అఖండ 2' చిత్రం విడుదల కొత్త తేదీ (డిసెంబర్ 12)కు మారడం చిన్న సినిమాలపై కచ్చితంగా ప్రభావం చూపుతుందని ప్రముఖ నిర్మాత, ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ కేఎల్ దామోదర ప్రసాద్ అభిప్రాయపడ్డారు. అఖండ కొత్త విడుదల తేదీ కారణంగా ఆ రోజున రావాల్సిన చిన్న సినిమాలు తమ షెడ్యూళ్లను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది మిగిలిన సినిమాలకు భారమేనని ఆయన బుధవారం జరిగిన 'ఈషా' చిత్రం ప్రెస్‌మీట్‌లో వ్యాఖ్యానించారు.

తేదీల గందరగోళం: అఖండ సినిమా ప్రభావం చిన్న సినిమాలపై పడిందని తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదనీ, ఆ తేదీన ఎన్ని చిన్న సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయో అందరికీ తెలిసిన విషయమేనని దామోదర్ ప్రసాద్ అన్నారు. 'అఖండ 2' ఈ నెల 12కు మారడం వల్ల మిగిలిన నిర్మాతలు తమ తేదీలను మార్చుకుంటున్నారు కదా అన్నారు. అయితే జరిగిన సంఘటన దురదృష్టకరమని, ఇండస్ట్రీలో ఇలాంటివి మామూలేనని ఆయన పేర్కొన్నారు. పరిస్థితులు మన చేతిలో లేనప్పుడు జరిగినదాన్ని సానుకులంగా స్వీకరించి ముందుకెళ్లడమే మనం చేయగలిగిన పని అని దామోదర ప్రసాద్ అన్నారు. సినిమా చిన్నదైనా, పెద్దదైనా అంతిమంగా అది వ్యాపారమేనని చెప్పారు.

అన్‌ఆర్గనైజ్డ్ ఇండస్ట్రీ: సినిమా పరిశ్రమ ప్రాథమికంగా ఒక అన్‌ఆర్గనైజ్డ్ సెక్టార్ అని దామోదర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. చిన్న సినిమాలకు సేఫ్టీ ఉండాలని కోరుకుంటామనీ, పరిస్థితులను బట్టి మరో మార్గం చూసుకుంటామని అన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం ఫిల్మ్ ఛాంబర్‌లో చాలా మాట్లాడుకుంటామని, కానీ ఒక నెల తర్వాత మళ్లీ అంతా మామూలేనని ఆయన అన్నారు.

కుటుంబ కథా చిత్రంతో వస్తున్న వెంకీ



వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ఇటీవలె ప్రారంభమైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. 'ఆదర్శ కుటుంబం' అనే టైటిల్‌తో వస్తున్న ఈ సినిమాకు 'హౌస్ నెం47' (ఏకే 47) అనేది ఉపశీర్షిక. వెంకటేశ్ ఫస్ట్ లుక్ విడుదల చేసి రెగ్యులర్ షూటింగ్ మొదలైందని మేకర్స్ తెలిపారు. ఫ్యామిలీ మ్యాన్ లుక్‌లో క్లాస్‌గా కనిపించారు వెంకీ. ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే ఓ మంచి కుటుంబ కథా చిత్రంగా ఇది నిలిచిపోనుందని మేకర్స్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది వేసవిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ బేనర్‌పై ఎస్ రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఇద్దరు కథానాయికలకు చోటు ఉందని సమాచారం. త్రిష, రుక్మిణీ వసంత్, నిధి అగర్వాల్ పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.





చలికాలం...అప్రమత్తం



- గతంలో కంటే పెరిగిన చలి
- పిల్లల ఆరోగ్య రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పదికి.. వంద రోజుల ప్రణాళిక

- మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యా శాఖ కసరత్తు
- ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహణ
- సెలవు రోజుల్లోనూ పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం





ముగిసిన యువజనోత్సవం

- మూడు రోజులు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- ఓవరాల్ చాంపియన్ షిప్ అందుకుంటున్న జేకేసీ కళాశాల విద్యార్థులు

పోలీసులకు ఐ కాన్‌గా డ్రోన్లు



- నేరాల నియంత్రణకు అధునాతన సాంకేతికత
- డ్రోన్ ఆపరేటింగ్‌పై పోలీసు సిబ్బందికి శిక్షణ

10లో..

చెరువులకు మహర్దశ

మున్సిపల్ పట్టణాల్లో చెరువులకు మహర్దశ పట్టింది. తాగునీటి నిల్వలుగా ఉన్న చెరువుల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అమృత్ 2.0 పథకంలో చెరువుల సంరక్షణ, సుందరంగా తీర్చిదిద్దడం, ఆహ్లాదకరంగా మార్చడంతో పాటు భూగర్భజల నీటి నిల్వలు పెరిగేలా పనులు చేపట్టనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపల్ కేంద్రాల్లోని 32 చెరువుల ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.92.29 కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో ఆయా పనులకు ఎట్టకేలకు పబ్లిక్ హెల్త్‌శాఖ టెండర్ ప్రక్రియ నిర్వహించింది. పల్నాడు జిల్లాలో 13 చెరువులను రూ.32.72 కోట్లతో ఆధునికీకరించనున్నారు. గుంటూరు జిల్లాలో కార్పొరేషన్ సహా 12 చెరువులు రూ.45.38 కోట్లతో, బాపట్ల జిల్లాలో 7 చెరువులను రూ.14.10 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

అమృత్ 2.0లో ఆధునికీకరణ

- టెండర్ నిర్వహించిన పబ్లిక్ హెల్త్ శాఖ
- రూ.92.29 కోట్లతో మున్సిపల్ చెరువుల అభివృద్ధి

ఆధునికీకరణ ఇలా..

- ఆక్రమణలు తొలగించి హద్దుల నిర్ణయం
- చెరువుల్లో పూడిక తీత
- చెరువు కట్టల పటిష్టతకు రాతితో రిటైనింగ్ వాల్ నిర్మాణం
- పట్టణ వాసుల నడకకు అనుకూలంగా కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మాణం
- ట్రాక్ చెరువు వైపు ఇనుప వైరుతో ఫెన్సింగ్ ఏర్పాటు
- చెరువు బయట వైపు కట్టలపై పచ్చిక పెంపకం

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

అమృత్ 2.0 పథకం కింద పురపాలక సంఘాల్లోని చెరువులను ఆధునికీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. పట్టణాల్లో భూగర్భ జలాలు పెంపొందించడమే అమృత్ లక్ష్యం. గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీల్లో పూడిక పేరుకుపోయి రూపు రేఖలు కోల్పోయిన చెరువులకు మహర్దశ పట్టింది. అమృత్ 2.0లో 32 చెరువులు ఆధునికీకరణకు ఎంపిక కాగా రూ.92.29 కోట్లు విడుదలయ్యాయి. ఈ క్రమంలో పబ్లిక్‌హెల్త్‌శాఖ టెండర్ ప్రక్రియ చేపట్టింది. భూగర్భ జలాలు పెంపొందించేందుకు చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. చెరువుల అభివృద్ధి ద్వారా పట్టణాల్లో భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఇప్పటికే (మిగతా 10వ పేజీలో)



నరసరావుపేటలో అభివృద్ధి చేయనున్న కత్తవ చెరువు

అజ్ఞాతంలో.. భోక్తలు



- జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్.. పరారీ
- అజ్ఞాతంలో మాజీ డైరెక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు
- రూ.22.25 కోట్ల కుంభకోణంపై చర్యలతో ఉలికిపాటు
- ఫోర్జరీ దస్తావేజులతో రూ. కోట్ల రుణాల కేసులో 11 మంది అరెస్టు

వీరిపై కేసులు..

డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు నాటి బ్రాంచ్ మేనేజర్ దేవరకొండ అరుణ్ కుమారి (ఏ1), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తొర్లికొండ కృష్ణ వేణి(ఏ2), నాటి అప్రైజర్ యర్రంశెట్టి ఈశ్వరప్రసాద్(ఏ3), నాటి బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు అలియాస్ లాల్‌పురం రాము(ఏ4), డైరెక్టర్లు నల్లపాటి రామయ్య(ఏ5), కోట హరిబాబు(ఏ6), వట్టికొండ కోటేశ్వరమ్మ(ఏ7), పీట వెంకటేశ్వర్లు (ఏ8), గోవిందనాయక్(ఏ9), వెలిశెల ఏడుకొండలు(ఏ10), కూని శెట్టి శివనవీన్ (ఏ11)లపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. అయితే కేసులో నిందితుడైన లాల్‌పురం రాము 10 రోజుల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది.

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రూ.22 కోట్ల కుంభకోణం కేసులో నిందితుడైన నాటి బ్యాంకు చైర్మన్, వైసీపీ నాయకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు అలియాస్ లాల్‌పురం రాము పరారీలో ఉన్నారు. ఆయన చైర్మన్‌గా కొనసాగిన సమయంలో నల్లపాడు బ్యాంకు బ్రాంచ్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై కలెక్టర్ ఆదేశాలతో నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే అవకతవకలపై బ్యాంకు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ కే శీనారెడ్డి దర్యాప్తు చేస్తుండగా విషయాన్ని రాముతో సహా నాటి మాజీ డైరెక్టర్లు అందులో పాత్ర ఉన్న బ్యాంకు ఉద్యోగులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్నారు. ఈ నేపథ్యంలో తమపై కేసు తప్పదని (మిగతా 10వ పేజీలో)

అసైన్డ్‌పై.. కొరడా



- అక్రమాలపై సమగ్ర విచారణకు ఆదేశాలు
- గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా భూముల ఫ్రీహోల్డ్
- నాడు మూడు జిల్లాల్లో 4,200 బాధితుల వినతులు బుట్టదాఖలు
- నిర్దిష్ట కాలపరిమితితో న్యాయం చేసే దిశగా నేడు ప్రభుత్వ కార్యాచరణ

చట్ట సవరణ ముసుగులో..

2003కు ముందు పేదలకు అసైన్డ్ చేసిన భూములపై యాజమాన్య హక్కులు కల్పించేలా ఫ్రీహోల్డ్ చేయడానికి గత ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఈ చట్ట సవరణ ముసుగులోనే వైసీపీ పెద్ద ఎత్తున అసైన్డ్ అక్ర మాలకు పాల్పడిందనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఒరిజినల్ అసైనీలను భయభ్రాంతులకు గురిచేసి మరీ భూములను ఫ్రీహోల్డ్ చేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో దాదాపు 15,000 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు సమాచారం. ఒక్క బాపట్ల జిల్లాలోనే 2,686 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే అసైన్డ్ చట్ట సవరణ ఆధారంగా దాదాపు 6,000 ఎకరాల వరకు ఫ్రీహోల్డ్ బాట పట్టినట్లు సమాచారం. ఇక ఈ చట్టంతో సంబంధం లేకుండా స్థానికంగా ఉండే నేతల మాటలే ఆదేశాలుగా వేల సంఖ్యలో భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించి అప్పనంగా దోచేశారు. ఉద్దేశపూర్వకంగా లిటిగేషన్‌లో పడేసి నిషేధిత జాబితాలో దాదాపుగా పదివేల ఎకరాల భూములను చేర్చారని సమాచారం. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ అసైన్డ్ అక్రమాలను ఆధారాలతో సహా నిలదీసినా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆయా అసైన్డ్ అక్రమాలపై నిగ్గు తేల్చి త్వరితగతిన వివాదాలకు ముగింపు పలకాలని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

నిబంధనలకు పాతరేస్తూ, రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా గత ప్రభుత్వంలో అసైన్డ్ భూ దందా ఆకాశమే హద్దుగా సాగగా.. కూటమి ప్రభుత్వం ఆయా అక్రమాలపై చర్యలకు సిద్ధమైంది. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో దాదాపు 4,200 వినతులు వైసీపీ ప్రభుత్వంలో అందగా వాటిని బుట్టదాఖలు చేసి భూ అక్రమార్కులకు నాటి పాలకులు వత్తాసు పలికారు. అసైన్డ్ అక్రమాలపై విచారణ జరిపి, అడ్డగోలు వ్యవహారాలపై చర్యలు తీసుకుంటామని కూటమి నేతలు ఎన్నికలకు ముందే బాధితులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ల నుంచి అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ జాబితాపై నివేదికలను (మిగతా 10వ పేజీలో)

ఈ-ఆఫీసు ఫైల్స్‌లో జాప్యం

- సగటు స్పందన 6 రోజుల 19 గంటలు
- 26 జిల్లాల్లో 23వ స్థానంలో జేసీ అశుతోష్
- గణాంకాలను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ-ఆఫీసు ఫైల్స్ క్లియర్ చేయడంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తీవ్ర జాప్యం చేస్తోన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. జిల్లాల వారీగా జాయింట్ కలెక్టర్లు ఈ-ఫైల్స్ విషయంలో స్పందిస్తోన్న సగటు సమయాన్ని బుధవారం విడుదల చేసింది. గుంటూరు జిల్లా ఫైళ్ల క్లియరెన్స్ సగటు స్పందన సమయం 6 రోజుల 19 గంటల 27 నిమిషాలుగా ప్రభుత్వం లెక్కించింది. గత ఏడాది జూలై 15 నుంచి ఈ నెల 9 వరకు జాయింట్ కలెక్టర్ పనితీరుని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ప్రస్తుత జేసీ అశుతోష్ శ్రీవాస్తవ మూడు నెలల క్రితమే బదిలీపై వచ్చారు. అంతకుముందు జేసీగా అమిలినేని భార్గవతేజ (ప్రస్తుత సీఆర్‌డీఏ అదనపు కమిషనర్) హయాంలో ఈ-ఫైల్స్ చూసేందుకు సగటు స్పందన సయయం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు ఆ ప్రభావం ప్రస్తుత జేసీ అశుతోష్ శ్రీవాస్తవపై పడుతున్నది. 1185 ఈ-ఫైల్స్ రూపొందగా 1038 ఫార్వార్డ్, మూసేయడం, విలీనం, పెండింగ్ పెట్టడం చేశారు.

కలెక్టర్ స్పందన ఒక రోజు 11 గంటలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా సగటు స్పందన గణాంకాలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. ఆమె ఒక రోజు 11 గంటల 45 నిమిషాల వ్యవధిని ఫైల్స్‌పై చర్య తీసుకునేందుకు సమయం తీసుకుంటున్నారని గుర్తించింది. మొత్తం 816 ఫైల్స్ రాగా 770 సంబంధిత అధికారులకు ఆన్‌లైన్‌లో పంపడం/పరిష్కరించి మూసేయడం/విలీనం చేయడం చేశారు.

మంత్రి నాదెండ్ల స్పందన 9 రోజుల పైమాటే

జిల్లాకు చెందిన మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ-ఫైల్స్ క్లియర్ చేసే విషయంలో ఎక్కువ సమయాన్ని తీసుకుంటున్నారు. ఆయన సగటు స్పందన 9 రోజుల మూడు గంటల 40 నిమిషాలుగా ఉన్నది. ఆయన వద్దకు బ్యాలెన్స్ ఫైల్స్ కలుపుకుని 321కి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వచ్చాయి.

16న కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలు

- బెటాలియన్‌లో అందజేయనున్న సీఎం చంద్రబాబు
- కలెక్టర్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 16న ముఖ్యమంత్రి చంద్రబాబు నియామక పత్రాలను అందజేయనున్నారు. మంగళగిరిలోని ఆరో బెటాలియన్‌లో ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా ఏర్పాట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం పరిశీలించారు. వీవీఐపీ, వీఐపీ, అభ్యర్థుల వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఏర్పాట్లపై డీఐజీ సత్య యేసుబాబు, బెటాలియన్ కమాండెంట్ ఎస్పీ నగేష్‌లతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవి కుమార్, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాంబాబు, మంగళగిరి రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

భూ సమీకరణకు వడ్డమాను సానుకూలం

సమస్యలు లేకుండా చూస్తామన్న మంత్రి నారాయణ

తుళ్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి భూసేకరణకు తాము సానుకూలమని వడ్డమాను గ్రామ రైతులు తెలిపారు. రైల్వే ట్రాక్, స్టేషన్, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం వడ్డమానులో ప్రభుత్వం ల్యాండు పూలింగ్ చేయనున్నది. ఈ క్రమంలో వడ్డమానులో బుధవారం రైతులతో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ భార్గవతేజ సమావేశమయ్యారు. సమస్యలు లేకుండా చూస్తామని రైతులకు మంత్రి హామీ ఇచ్చారు. స్పోర్ట్స్ సిటీ, ఎయిర్ పోర్టు వస్తేనే అమరావతి అభివృద్ధితో పాటు రైతుల భూములకు విలువ పెరుగుతుందన్నారు. రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను త్వరితగతిన కేటాయించడమే కాకుండా మౌలిక వసతుల కల్పన కూడా వేగవంతం చేస్తామని చెప్పారు. సమావేశం అనంతరం మైనేని సత్యనారాయణ గిరిజా దంపతులు 5 ఎకరాలు, పిన్నక తరుణ్‌సాయి 2 ఎకరాలు, నిడదవోలు శివపార్వతిభూముల దస్తావేజులను అందజేశారు.



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

అమరావతిలో.. తపాలశాఖ



- రాజధానికి కేంద్ర కార్యాలయాల రాక
- రూ.80 కోట్లతో తపాలా ప్రాంతీయ కార్యాలయం
- ఐనవోలులో కాగ్ కార్యాలయానికి పరిపాలన అనుమతి

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలు క్యూ కడుతున్నాయి. ఇటీవలే ఒకే రోజున జాతీయ బ్యాంకులు, బీమా కంపెనీలు శంకుస్థాపన చేయగా తాజాగా తపాల, కాగ్ సంస్థలు ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. తపాల శాఖను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని నిర్వర్తిస్తోన్న దృష్ట్యా సాధ్యమైనంత త్వరగా ఆ సంస్థ రూ.80 కోట్లతో ప్రాంతీయ కార్యాలయం నిర్మాణం చేయనున్నది. ఈ విషయాన్ని బుధవారం పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. మరోవైపు ఇప్పటికే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)కు ఐనవోలులో భూమిని సీఆర్‌డీఏ కేటాయించగా అందులో కార్యాలయ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ కార్యాలయం ప్రస్తుతం విజయవాడలోని కృష్ణలంకలో ఉన్నది. రాష్ట్రంలోని ఆ శాఖ పరిపాలన కార్యకలాపాలన్నీ ఈ కార్యాలయం చూసుకుంటుంది. దీనిని అమరావతి రాజధానికి తరలించాలని కేంద్రం నిర్ణయించింది. అక్కడ సకల సదుపాయాలతో అత్యాధునికంగా భవనాన్ని నిర్మించి ఆపరేషన్స్ నిర్వహించనుంది. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించి రీజనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని ప్రకటించింది.


కాగ్‌కు అదనంగా ఐదు ఎకరాలు..

కాగ్ సంస్థకు గతంలో 12 ఎకరాల భూమిని సీఆర్‌డీఏ కేటాయించింది. దీనికి అదనంగా సిబ్బంది నివాసాలకు మరో 5 ఎకరాల భూమిని ఇచ్చింది. ఈ నేపథ్యంలో కాగ్ తన ఏపీ కార్యాలయం, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఇక ఆ సంస్థ త్వరలోనే టెండర్లు పిలిచి ఏజెన్సీని ఖరారు చేసి నిర్మాణ పనులను ప్రారంభింప చేయనుంది.



రైతులకు చెరువు భూముల్లో ప్లాట్లు

- మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లిన వైనం
- రాజధానిలో సబ్ డివిజన్ లేకుండానే రిజిస్ట్రేషన్



తుళ్లూరులోని చెరువు ప్రాంతం

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సమీ కరణ పద్ధతిలో భూములు తీసుకున్న ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లను చెరువు భూముల్లో కేటాయించింది. తుళ్లూరు, దొండపాడులో వీటికి సంబంధించిన వ్యవహారం బయటకు వచ్చింది. ఇటీవల వడ్డమానులో ఓ రిజిస్ట్రేషన్ సందర్భంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం రాజధాని రైతుల్లో కలకలం రేపింది. బుధవారం మంత్రి నారాయణ దృష్టికి రైతులు ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. భూమి స్థితిని మార్చకుండానే సీఆర్డీఏ తమకు ప్లాట్లు కేటాయించినట్లు ఆరోపించారు. తుళ్లూరులో సర్వే నెంబరు 80లో 35.91 ఎకరాల చెరువు భూమి ఉంది. చెరువులో నీటి పరిమాణం తగ్గడంతో గతంలో సాగుకు, నివాసానికి అసైన్డ్ పద్ధతిలో ప్రభుత్వం భూములు కేటాయించింది. అయితే వాటిని చెరువుగా గుర్తిస్తూ ఆర్‌సీ నెంబరు 4245/2015/ఈ1 ప్రకారం 2018 ఆగస్టు 21న నోటిఫై చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ తర్వాత రైతులకు ప్లాట్లు ఇచ్చే సమయంలో భూ స్థితిని మార్చలేదు. రెవెన్యూ రికార్డుల్లో సర్వే నెంబరు 80లో చెరువు భూమిగా చూపిస్తోంది. నోటిఫికేషన్ ఉండటంతో దాన్ని సబ్‌డివిజన్ చేయకుండానే 2019 ఫిబ్రవరి 13న 65 మందికి ప్లాట్లు కేటాయించారు. పిచ్చుకలపాలెంలోనూ సర్వే నెంబరు 87లో చెరువు భూమిని నోటిఫై చేస్తూ 2018 ఆగస్టు 21న కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చారు. సమాచార హక్కు సమైక్య వేదిక ఆధ్వర్యాన పిల్‌పై విచారించిన హైకోర్టు జీవో 188లోని క్లాజ్ 3(సీ) ప్రకారం భూములను గుర్తించాలని పంచాయతీరాజ్ కమిషనర్‌ను ఆదేశించింది. ప్రస్తుతం ఈ కేసు విచారణలో ఉంది.

ఏషియన్ పోటీల్లో చంద్రికకు కాంస్యం


బొల్లినేని చంద్రిక

మంగళగిరి సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక 84 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించింది. టర్కీలో ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు ఏషియన్ సీనియర్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన చంద్రిక స్క్వాట్ విభాగంలో రజతం, బెంచిప్రెస్‌లో కాంస్యం, డెడ్‌లిఫ్ట్‌లో కాంస్యం సాధించి ఓవరాల్‌గా కాంస్య పతకం సొంతం చేసుకుందని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని తెలిపారు. చంద్రికను ఆమె కోచ్ నరేంద్రను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

47,152 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 48,555 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 47,152 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 13,892 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17200
నెంబరు. 5	11500	15500
273	----	----
341	10500	16500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15700
షార్క్-1	----	----
బ్యాడిగి	10500	15700
దేవనూరు డీలక్స్	11000	16500
ఆర్మూరు	10500	12800

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	17000
నెంబరు. 5	11000	15300
273	----	----
341	11000	16400
4884	11500	14300
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	11000	16900
దేవనూరు డీలక్స్	10500	16000
తాలుకాయలు	5000	7500

గ్రావెల్ సరఫరాకు కమిటీలు

- కమిటీలకు చైర్మన్లుగా ఐదు జిల్లాల కలెక్టర్లు
- మెంబర్ కన్వీనర్‌గా జిల్లా గనులశాఖ అధికారి
- సీఆర్డీఏ ప్రతినిధి, ఆర్డీవో సహా మరో ఐదుగురు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు చేపడుతోంది. రాజధాని పరిధిలో జరుగుతున్న పనులకు అవసరమైన గ్రావెల్, రోడ్డు మెటల్, ఇసుక సరఫరా చేయడంలో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాజధాని మాస్టర్ ప్లాన్ పరిధిలోకి వచ్చే ఐదు జిల్లాల్లో ఐదు ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో కమిటీలు

సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్ పరిధిలోకి వచ్చే గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో ఆయా జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలకు కలెక్టర్లు చైర్మన్లుగా వ్యవహరిస్తారు. జిల్లా గనుల శాఖ అధికారి మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. వీరితోపాటు సీఆర్డీఏ ప్రతినిధి, సంబంధిత ఆర్డీవో, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) జోనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, జిల్లా అటవీ అధికారి, సీఆర్డీఏలోని కాంట్రాక్టర్ల ప్రతినిధులు కొందరు సభ్యులుగా ఉంటారు.

● త్వరతగతిన అనుమతులు

ఈ కమిటీ గ్రావెల్, రోడ్ మెటల్, ఇసుక సరఫరాకు సంబంధించిన లీజులను మంజూరు చేయడం, సరఫరాలో జాప్యం జరగకుండా చేయడం వంటి పనులను పర్యవేక్షిస్తుంది. సీఆర్డీఏ సూచించిన కాంట్రాక్టు సంస్థల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, వాటికి రెవెన్యూ శాఖ నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ) కాలుష్య నియంత్రణ మండలి నుంచి పర్యావరణ అనుమతులు వేగంగా వచ్చేలా ఈ కమిటీ చూస్తుంది. అందుకోసం సింగిల్ విండో విధానాన్ని కమిటీ అనుసరిస్తుంది. కాగా రాష్ట్రస్థాయి కమిటీకి సీఆర్డీఏ అదనపు కమిషనర్ చైర్మన్‌గా ఉంటారు. గనులశాఖ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్ గా ఉంటారు. మిగిలిన అన్నివిభాగాల ఉన్నతస్థాయి అధికారులు రాష్ట్ర స్థాయి కమిటీలో ఉంటారు. జిల్లాస్థాయి కమిటీలు వారానికోసారి, రాష్ట్రస్థాయి కమిటీ 15 రోజులకోసారి సమావేశమై మెటీరియల్ సరఫ రా, అవసరమైన అనుమతులపై సమీక్ష జరుపుతాయి. సమస్యలుంటే వాటిని వారం రోజుల్లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాయి.

14న యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం


ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న ఎన్ వెంకటేశ్వర్లు, ఏఎస్ఎస్ ప్రసాద్ తదితరులు

గుంటూరు (విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. బుధవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో ఆహ్వానపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు యూ.రాజశేఖర్, ఎం కళాధర్ మాట్లాడుతూ, కౌన్సిల్ సమావేశానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తామని వెల్లడించారు. అలాగే ఉపాధ్యాయ వర్గ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమ కుమారి, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎండీ షకీలా బేగం, కె.రంగారావు, బి.ప్రసాద్, ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఫార్మశీ విద్యలో నాణ్యత పెంచాలి

● ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు జశుబాయి


బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న జశుబాయి హీరాబాయ్ చౌదరి తదితరులు

గుంటూరు (విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫార్మశీ విద్యలో నాణ్యత పెంపొందించడానికి బయో మెట్రిక్ హాజరు వ్యవస్థ ఎంతో కీలకమని ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు జశుబాయి హీరాబాయ్ చౌదరి అన్నారు. చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో బుధవారం ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు వ్యవస్థపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న ఫార్మసీ కాలేజీల్లో ఫ్యాకల్టీ, విద్యార్థుల హాజరును పర్యవేక్షించేందుకు ఇది సహాయపడుతుందని అన్నారు. అనంతరం సదస్సులో పీసీఐ ఐటీ విభాగం చైర్మన్ డాక్టర్ పి.సత్యమూర్తి, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర, ఏపీసీఐ ప్రతినిధులు డాక్టర్ కె.వెంకటరమణ, డాక్టర్ ఎమ్ ప్రసాదరావు, విజ్ఞాన్ ఫార్మశీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాస్ బాబు, బాపట్ల ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

12న భవిష్యనిధి అదాలత్

గుంటూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న భవిష్యనిధి పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడానికి ఈ నెల 12న భవిష్యనిధి అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సంయుక్త కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 11.50 వరకు కృష్ణనగర్‌లోని కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలుంటే ఈ మెయిల్ (ro.guntur@epfindia.gov.in),వాట్సప్ (9494657469) ద్వారా పంపవచ్చన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

గుంటూరు వాసి హిందూపురంలో చోరీలు

రూ.40 లక్షల బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం


బండికాళ్ల రత్నరాజు

హిందూపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడే ఐదుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను హిందూపురం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.40 లక్షల విలువచేసే బంగారం, వెండి ఆభరణాలు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం వివరించారు. పట్టుబడినవారిలో గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన బండికాళ్ల రత్నరాజు అలియాస్ తేజ.. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం గొల్లపల్లిలో ఉంటున్నాడు, హిందూపురం మండలం హనుమేపల్లికి చెందిన బాబుప్రసాద్, హిందూపురం మండలం సంతేబిదునూరుకు చెందిన గంగరాజు, ఉప్పర సురేష్, గౌరీబిదునూరుకు చెందిన సిద్దిక్ సాబ్ ఉన్నారు. ముఠా సభ్యుల నుంచి 310 గ్రాములు బంగారు ఆభరణాలు, 3 కిలోలకుపైగా వెండి ఆభరణాలు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

● స్కెచ్ వేశాడంటే అంతే..

గుంటూరుకు చెందిన బండికాళ్ల రత్నరాజు అలియాస్ తేజ వయసు 39 సంవత్సరాలు. ఇతను స్కెచ్ వేశాడంటే ఇంటి చుట్టూ పది మంది కాపలా ఉన్నా లూటీ కావాల్సిందే అని పోలీసులు అంటున్నారు. ఇంత ఆరితేరిన దొంగను ఇప్పటి వరకు తాము చూడలేదని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో నమోదైన మొదటి కేసులో జైలుకు వెళ్లిన సమయంలో ఖైదీలతో పరిచయం పెంచుకున్నాడు. బయటకు వచ్చాక ఆ ఖైదీలు ఉంటున్న ప్రాంతాల్లో చోరీకి పాల్పడ్డాడు. రత్నరాజుపై ఇప్పటి వరకూ 55 చోరీ కేసులు నమోదయ్యాయి. పోలీసుల దృష్టికి రానివి ఇంకెన్ని ఉంటాయో తెలియదు. ఇళ్లలో చొరబడి చోరీ చేసిన సొమ్ముతో తన సొంతూరు గుంటూరులో రత్నరాజు రెండు ఇళ్లను నిర్మిస్తున్నాడు. వీటి నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ.2 కోట్లు ఖర్చయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆ జిల్లా అధికారుల ద్వారా కోర్టు అనుమతితో ఇళ్లను అటాచ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు.

స్త్రీ శక్తితో ప్రభుత్వానికి మంచి పేరు

● ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించేలా స్త్రీ శక్తి పథకం అమలుతో కూటమి ప్రభుత్వానికి మంచి పేరు, ప్రఖ్యాతలు వస్తున్నాయని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. అదే సమయంలో సిబ్బందిని రిక్రూట్ చేయకుండా, బస్సులు పెంచకుండా ఉంటే మంచిదికాదని ఆయన పేర్కొన్నారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లోని కొత్తపేట మల్లయ్యలింగం


సమావేశంలో మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు తదితరులు

భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిబ్బంది చిన్న చిన్న పొరపాట్లకు కూడా క్షమించకుండా సస్పెండ్‌లు, తీవ్రమైన ఇక్రిమెంట్‌లు, పనిష్‌మెంట్లు చేస్తున్న విధానాలను డిపో మేనేజర్లు మానుకోవాలని అన్నారు. ఈ నెల 14న విజయవాడలో జరగనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణలను ప్రకటించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందపాటి శంకరరావు, నాయకులు ఈ. విజయ్‌కుమార్, రత్నాకర్, డీవీ స్వామి, వలి, జి.ప్రకాశ్, వాకా రమేష్, త్రిలోచన దత్తు, తదితరులున్నారు.

● ఆర్టీసీ ఈయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు

సమావేశం అనంతరం ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు నూతన కమిటీని ప్రకటించారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్ శ్రీనివాసరావు (టోపీ శ్రీను), రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కేవీఎస్ నరసింహరావు, నెల్లూరు జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె లక్ష్మయ్య, నెల్లూరు జోన్ సహాయ కార్యదర్శిగా జి ప్రకాశ్, జిల్లా జాయింట్ సెక్రటరీగా జి కృష్ణవేణి, జిల్లా ముఖ్య సలహాదారుగా కె దండేశ్వరుడులతో కూడిన కమిటీని ప్రకటించారు.

ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చాలి

● డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వినయ్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజల కనీస అవసరాలు తీర్చేలా ప్రభుత్వాలు కృషి చేయాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ కోరారు. అరండల్


సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌కుమార్ తదితరులు

పేటలోని కార్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. మానవ హక్కులు, కనీస అవసరాలైన రక్షిత మంచి నీరు, స్వచమైన గాలి, పౌష్టికారం, గృహవసతి, మెరుగైన ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలని కోరారు. మానవ హక్కుల కార్యకర్త ల్యాంప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ, 2029 నాటికి ఎనిమిది సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్‌ను చేరేందుకు ప్రతి ప్రభుత్వం కృషి చేయాలని, మన దేశంలో వివిధ రంగాల్లో మనం ఇంకా ఎంతో వెనకబడిపోయి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో న్యాయవాది పొందుగల ప్రకాష్, బీసీ ఉద్యమ రాష్ట్ర నేత ఉగ్గం సాంబశివరావు, గెజిటెడ్ ఆఫీసర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుస్సా రత్నప్రసాద్, ఆవాజ్ నాయకులు చిష్టి సామాజిక వేత్త డాక్టర్. మూకిరి సుధా, వాయిస్ ఆఫ్ జస్టిస్ నేత ప్రశాంతి, చంద్రనాయక్, తురకా వీరయ్య, నల్లపు నీలాంబరం, కొరివి రజనీష్, పాలకాయల వెంకట్, ప్రకాష్, బి సురేంద్ర, సూరిబాబు, రామారావు, మద్ద శ్యామ్, సురేష్, పిల్లి రమేష్ తదితరులున్నారు.

రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు

తుళ్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం నిమిత్తం భూములను అందజేసిన ఉండవల్లి గ్రామ రైతులకు ఈ లాటరీ ద్వారా రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. ఈ కార్యక్రమం బుధవారం రాయపూడిలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో జరిగింది. 11 మంది రైతులు, భూ యజమానులకు ఈ-లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించారు. వీటిల్లో 11 నివాస ప్లాట్లు కాగా 5 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏజీ చిన్ని కృష్ణ మాట్లాడుతూ, ప్లాట్లు ఎక్కడ దక్కాయో రైతులకు వివరించేందుకు ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బందిని, గ్రామ సర్వేయర్లను నియమించామని చెప్పారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ పక్రియకు ఎలాంటి రుసుము వసూలు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


ప్లాట్లు పొందిన రైతులకు ప్రొవిజన్ సర్టిఫికెట్ అందజేస్తున్న సీఆర్డీఏ డీసీ చిన్ని కృష్ణ

పశువుల్లో పిండోత్పత్తి, పిండమార్పిడిపై జాతీయస్థాయి శిక్షణ

గుంటూరు సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో పిండోత్పత్తి, పిండమార్పిడిపై జాతీయ స్థాయిలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు గుంటూరు సమీపంలోని లాంలో ఉన్న పశు పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ ఎం ముత్తారావు తెలిపారు. లాం ఫారము నందు ఈ నెల 11 నుంచి 20 వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఆయన బుధవారం తెలిపారు. దేశం నలు మూలల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. దేశంలో ఉన్న దాదాపు 20 కోట్ల గోజాతి పశువులలో 75-80% దేశవాళీ ఆవులున్నాయన్నారు. ఈ దేశవాళీ గోవుల వారసత్వ సంపద మాత్రమేగాక, గ్రామీణ ఆర్థిక పరిపుష్టికి ఇతోధికంగా దోహదం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా భూమి లేని, చిన్న, సన్నకారు రైతుల ఇంటిల్లిపాది అవసరాలకు దేశవాళీ ఆవుల పాత్ర ఎంతగానో వుంటుందన్నారు. భారత ప్రభుత్వం, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా దేశవాళీ ఆవులలో ఉత్పాదక శక్తిని(పాలదిగుబడి) పెంచడానికి చేపట్టిన వినూత్న కార్యక్రమమే ఈ 'పిండోత్పత్తి, పిండ మార్పిడి జీవసాంకేతిక ప్రక్రియ' అని తెలిపారు. ఈ నూతన ప్రక్రియను చేపట్టి అందులో శాస్త్రవేత్తలను నిష్ణాతులుగా తయారు చేసే భాద్యతను లాం ఫాం లోని పశు పరిశోధనా స్థానానికి అప్పగించారని తెలిపారు. దీనిలో భాగంగా అక్టోబరులో మొదటి శిక్షణా కార్యక్రమం విజయవంతంగా చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం జరిగేది రెండో దశ శిక్షణా కార్యక్రమమన్నారు.

వైసీపీ నాయకులకు అర్థంకాని పీపీపీ విధానం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పీపీపీ విధానం అర్థంకాక వైసీపీ నాయకులు కల్లు తాగిన కోతుల్లా ఎగురుతున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఎద్దేవా చేశారు. బుధవారం అందుకూరులో నిర్వహించిన వంద రోజులు వంద గ్రామాల కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీపీపీ విధానంపై వైసీపీ నాయకులకు అవగాహన తరగతులు నిర్వహిస్తామన్నారు. తమ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకే వైసీపీ నాయకులు తిరుగుతున్నారని, కోటి సంతకాల కార్యక్రమం పెద్ద డ్రామా అని అభివర్ణించారు. చంద్రబాబు ఏ పని చేసినా ప్రజల దీర్ఘ కాలిక ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని చేస్తారన్నారు. పీపీపీ విధానంపై కనీస అవగాహన లేకుండా వైసీపీ నాయకులు దాన్ని వ్యతిరేకించటం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేసిన ఏ విధానం కూడా విఫలం కాలేదని, ఈ విధానాన్ని కూడా ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ప్రవీణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ దిగుమర్తి అప్పారావు, మండల టీడీపీ అధ్యక్షుడు మొగల్ జాన్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ పరీక్షలు ప్రారంభం


పరీక్షలు జరిగే తీరును పరిశీలిస్తున్న పీజీ కోఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు

ఏఎన్‌యూ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ పరిధి ఇంజనీర్ విభాగంలో బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ కోఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ పరీక్షలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల పరిధిలోని బాపట్లలో పరీక్ష కేంద్రంలో కూడా నిర్వహించామన్నారు. పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని తెలిపారు.

వ్యక్తికి జీవిత ఖైదు

● తల్లిదండ్రులను హత్య చేసినందుకు శిక్ష


పాగోలు కిరణ్ చంద్ర (ఫైల్‌ఫొటో)

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను అత్యంత క్రూరంగా హత్య చేసిన నిందితుడికి బాపట్ల 6వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.శ్యాంబాబు జీవిత ఖైదు విధించింది. బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన పాగోలు కిరణ్‌చంద్ర తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేసి రిటైరయి పెన్షన్ పొందుతున్నారు. పెన్షన్ వచ్చిన ప్రతిసారి నిందితుడు డబ్బులు ఇవ్వాలని తండ్రితో గొడవ పడేవాడు. తల్లిదండ్రుల ఆస్తిని తనకు కాకుండా తన అక్కకు, ఆమె పిల్లలకు రాస్తారేమో అనే అనుమానంతో 2024 సంవత్సరం డిసెంబరు 14న కిరణ్‌చంద్ర తన తల్లిదండ్రులు పాగోలు విజయభాస్కర్ (74), పాగోలు వెంకటసాయికుమారి (71)ని రోకలిబండతో కొట్టి హత్యచేసి పారిపోయాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో విచారణ అనంతరం నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమాన విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

తక్కెళ్ళపాడులో వివాహిత ఆత్మహత్య

పెదకాకాని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్ళపాడులో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి, పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం శ్రీనివాస తండాకు చెందిన సిద్దు నాయక్, అతని భార్య జ్యోతి భాయ్ (26) జీవనోపాధి నిమిత్తం కొన్ని సంవత్సరాల క్రితం తక్కెళ్ళపాడు వచ్చారు. అక్కడ బ్రిక్స్ రాయి తయారుచేసే యూనిట్లో పనిచేస్తూ జీవిస్తున్నారు. ఇటీవల కుటుంబ కలహాల నేపథ్యంలో జ్యోతి భాయ్ మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00



పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజాసేవ కోసమే టీడీపీని ఎంచుకున్నా

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సేవ కోసమే తాను తెలుగుదేశం పార్టీని ఎంచుకున్నానని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె 18వ డివిజన్ పార్టీ కమిటీ, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం గుర్తింపు కోసం రాజకీయాల్లోకి వచ్చే ఎక్కువ కాలం నిలవలేరని చెప్పారు. తాను చేసే అభివృద్ధి కార్యక్రమాలు తన గుర్తింపు కోసం ఎంతమాత్రం కాదని స్పష్టం చేశారు. కార్యకర్తలు నేరుగా తన వద్దకు రాలేకపోతే తానే స్వయంగా వారి ఇళ్లకు వెళతానని చెప్పారు.

ప్రజా సమస్యలపై తక్షణ చర్యలు

మహిళా గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆదేశించారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆమె 'కార్య కర్తలతో ముఖాముఖి' కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని అరండల్‌పేట, నగరం పాలెం సీఐలకు సూచించారు. చాకలికుంటను ఆక్రమణల నుంచి రక్షించేందుకు ప్రహరీ నిర్మించాలని సిటీ ప్లానర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

40 శాతానికిపైగా ఎస్ఐఆర్ ఎలక్టోరల్ మ్యాపింగ్

● అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎలక్టోరల్ మ్యాపింగ్ విధానంలో రాష్ట్రంలోని ఇతర అర్బన్ నియోజకవర్గాలతో పోలిస్తే 95 గుంటూరు తూర్పు, 94 పశ్చిమ నియోజకవర్గాల్లో 40 శాతానికి పైగా మ్యాపింగ్ చేసినందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేకంగా అధికారులు, బీఎల్‌వోలకు అభినందనలు తెలిపారని పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ చాంబర్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకొని వివరాలను తమకు అందించాలని కోరారు. ఎస్ఐఆర్‌పై జరిగే సర్వేని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పరిశీలించి, సర్వే వేగవంతానికి సహకరించాలన్నారు. సమావేశంలో జీఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ సూరజ్‌కుమార్, ఎన్.ఓంకార్ (తెలుగుదేశం), హెచ్.రామకృష్ణ (బీజేపీ), డి.జాన్‌బాబు (వైసీపీ), విన్సెంట్‌కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), తాతా సేవాకుమార్ (ఆమ్ ఆద్మీ పార్టీ), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ బాలాజీ బాషా, డిప్యూటీ తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను సాధించేందుకు ఉద్యమం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో అన్ని సంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేసి ఓపీఎస్‌ను సాధించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం ఏపీసీపీఎస్‌యూఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. నిరసనకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న ఓపీఎస్ కోల్పోవడం బాధాకరమన్నారు. ఏపీసీపీఎస్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానంలో పదవీ విరమణ పొందిన వారికి రూ.1400 పెన్షన్ రావడం అన్యాయమన్నారు. అనంతరం డీఆర్వో ఖాజావలీకి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనల్లో ఎస్టీయూ, ఏపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు బాజీ, బసవలింగరావు, కే సాంబ శివరావు, ఉద్యోగులు దయానంద్‌కుమార్, కిషోర్, సైదావలి పాల్గొన్నారు.



నిరసనల్లో పాల్గొన్న ఉద్యోగులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

పత్తి క్వింటాల్‌కు రూ.12 వేలు మద్దతు ధర ప్రకటించాలి

● సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తక్షణమే ప్రభుత్వం స్పందించి పత్తి క్వింటాల్‌కు రూ.12 వేలు మద్దతు ధర ప్రకటించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం గుంటూరు, సీపీఐ కార్యాలయం ఎదుట ఏఐకేఎస్ ఆధ్వ ర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పత్తి రైతుల సంఘ రాష్ట్ర కార్యదర్శి డి.శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముప్పాళ్ల నాగేశ్వర రావు ప్రసంగించారు. రైతుల కష్టాలు పట్టించుకోకుండా సీసీఐ తేమ శాతం పేరుతో పత్తిని వెనక్కిపంపడం అన్యాయమన్నారు. అనంతరం సీసీఐ జీఎం రాజేంద్ర షాకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదు, జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి, అకిటి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మాల గజిటెడ్ అధికారుల అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏసీ కళాశాలలో బుధవారం మాల గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగం విజయానంద్ అధ్యక్షతన అసోసియేషన్ జిల్లా సమావేశం, కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ పొలకాటి రామకృష్ణ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా తెనాలి ప్రకాష్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నెహ్రూబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ప్రవీణ్‌కుమార్, జనరల్ సెక్రెటరీగా చెరుకూరి జాన్ మణికుమార్, ఉపాధ్యక్షులుగా దాసరి కోటయ్య, పి.శామ్యూల్ పాల్, కర్రీ సుధాకర్, బుల్లయ్య, జాయింట్ సెక్రెటర్లుగా గుంటి ప్రకాష్, పచ్చల కుమార్ రాజా, బి.రవికుమార్, రత్నరాజు, ట్రెజరర్‌గా కె.వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శిగా ఝాన్సీరాణి, ఈసీ సభ్యులను ఎన్నుకున్నట్టు తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి నగరోత్సవం

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో అయ్యప్పస్వామి భక్తులకు 40 రోజుల సద్ధి కార్యక్రమం ముగింపునకు చేరుకోవడంతో స్వామి వారి నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం యార్డు ప్రాంగణంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నగరోత్సవం జరిగింది. ఈ సందర్భం గా ఉత్సవమూర్తులను ఊరేగించారు. కాగా ఈ నెల 11వ తేదీ గురువారం ఉదయం నుం చి యార్డు ఆవరణలో అయ్యప్ప పడిపూజ జరుగుతుందని కమిటీ నాయకులు తెలిపారు.

గుంటూరు టౌన్-1 ఈఈ పోస్టు భర్తీపై పీటముడి

● కీలకమైన పోస్టు కోసం ఇద్దరు ఈఈల పోటా పోటీ

● విద్యుత్ శాఖలో హాట్ టాపిక్‌గా ఈఈ పోస్టింగ్ వ్యవహారం

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలో గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) పోస్టు భర్తీపై పీటముడి పడినట్లయింది. గుంటూరు సర్కిల్ పరిధిలో కీలకమైన ఈ పోస్టు కోసం ఇద్దరు ఈఈలు పోటీ పడటంతో భర్తీ వ్యవహారం సందిగ్ధంలో పడినట్లయింది. గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఈఈగా వ్యవహరిస్తున్న తిరుమలశెట్టి శ్రీనివాసబాబు గత నెల 26న సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. అదే సమయంలో శ్రీనివాసబాబును విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయంలో ఆపరేషన్ జీఎంగా బదిలీ చేశారు. కాగా కొత్త ఈఈ పోస్టు భర్తీ వ్యవహారం పది రోజులు కావస్తున్నా ఎడతెగకపోవటం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఎంతో కీలకమైన ఈ పోస్టుకు బాపట్ల సర్కిల్ పరిధిలో ఈఈ (కన్‌స్ట్రక్షన్)గా వ్యవహరిస్తున్న పీహెచ్ ఖాన్, సీఆర్‌డీఏ సర్కిల్‌లో ఈఈ (టెక్నికల్)గా పనిచేస్తున్న జె.హరిబాబు పోటీ పడుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ప్రత్యామ్నాయంగా గుంటూరు టౌన్-1 డివిజన్ ఇన్‌ఛార్జ్‌గా సర్కిల్ టెక్నికల్ ఈఈగా వ్యవహరిస్తున్న పి.నాగేశ్వరరావును నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఏపీ సీపీడీసీఎల్ సంస్థలో గుంటూరు సర్కిల్ పరిధిలో గుంటూరు టౌన్-1 డివిజన్ ఎంతో కీలకంగా భావిస్తారు. అంతటి ప్రాధాన్యత కలిగిన గుంటూరు డివిజన్ ఈఈ పోస్టుపై పోటీ పెరగటంతోనే భర్తీలో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. గతంలో 2014-19 కాలంలో గుంటూరు ఈఈగా జె.హరిబాబు పనిచేశారు. ఈ అనుభవాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు. ఇటీవల కూడా నగరంలో డిప్యూటీ ఈఈగా పనిచేసిన పీహెచ్ ఖాన్ ఈఈగా పదోన్నతి పొంది బాపట్ల సర్కిల్‌కు బదిలీపై వెళ్ళారు. వీరిద్దరూ పోటీపడుతుండటంతో ఈ పోస్టు భర్తీలో పీటముడి పడినట్లయింది. కాగా జిల్లాకు చెందిన ఒకరిద్దరు నేతలు ఈఈలలో ఒకరి కోసం గట్టిగా పట్టుపడుతున్నట్లు సమాచారం. మొత్తానికి ఈఈ పోస్టు భర్తీ వ్యవహారం ఆ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలు ప్రోత్సహించడం హర్షణీయం

● ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు కృష్ణకుమారి

● ఘనంగా 28వ లలిత కళాఉత్సవం

గుంటూరు(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందించడానికి శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లలిత కళా ఉత్సవాలు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు కృష్ణకుమారి అన్నారు. స్థానిక ఏటీ అగ్రహారంలోని ఎంఎన్ఆర్ కన్వెన్షన్‌లో బుధవారం జరిగిన లలిత కళాపుష్కరాల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు అధ్యక్షత వహించారు. తొలుత ప్రభావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణకుమారి మాట్లాడుతూ సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం రంగాల్లో నేటి విద్యార్థులకు కనీస అవగాహన ఉండటం లేదని, ఈ నేపథ్యంలో ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి కృషి చేయడం హర్షణీయమని అన్నారు. శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకులు డాక్టర్ నన్నపనేని మంగాదేవి ప్రసంగిస్తూ సాహిత్య, కళా, చిత్రలేఖనం తదితర రంగాల్లో చిన్నారులకు ప్రోత్సాహం అందించడానికి ఏటా లలిత కళా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగాదేవి విశిష్టసేవా పురస్కారాన్ని విఠాల రాజేశ్వరశర్మకు అందజేశారు. ఈ సందర్భంగా రూ.25వేలు నగదు, జ్ఞాపిక అందజేశారు. మాలతీ ప్రమదా సాహితీ పురస్కారం వెనిగండ్ల పద్మజకు, ప్రతిభా పల్లవం పురస్కారం కుంచాల కైవల్యరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జీ వీసీ కంచర్ల గంగాధరరావు, పాలడుగు లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందజేస్తున్న కృష్ణకుమారి, మంగాదేవి, వీసీ గంగాధర్ తదితరులు

వైభవంగా స్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్‌నగర్, శ్రీరామనామక్షేత్రంలో 99వ శ్రీరామ కోటి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం కోగంటి వెంకటలక్ష్మి నరసింహ అప్పలాచార్యులు హనుమత్ వైభవంపై ఉపన్యాసం, రామ్ భట్టర్ భాగవతార్‌చే భక్త కుచేలా హరికథ, కేవీ సాయిబాబా బృందంచే సంకీర్తనలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నంజనేయస్వామికి విశేష సహస్ర నాగవల్లీ దళార్చన నిర్వహించారు. సాయంత్రం శ్రీ ఆంజనేయస్వామి తిరువీధి ఉత్సవం కోవెలమాడ వీధులలో మేళతాళాలతో వైభవంగా నిర్వహించారు.

రేపటి నుంచి గరికపాటి ఆధ్యాత్మిక ప్రవచనాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు, బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వర దేవ స్థానం, అన్నమయ్య కళావేదికపై ఈ నెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావుతో ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతాయని దేవస్థానం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, గుళ్లపల్లి రాఘవేంద్రరావు, సాహితి పరిశోధకుడు పారా ఆశోక్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఈ ప్రవచనా లు జరుగుతాయన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

గుంటూరు(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతపై ప్రజల్లో అవగా హన కల్పించాలని ప్రభుత్వ మహిళా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధాత్రి కుమారి సూచించారు. బుధవారం స్థానిక 23డివిజన్ పరిధిలోని గుండారావుపేట, చెక్క బజారు, జెండా చెట్టు వీధి పరిసర ప్రాంతాల్లో ఎన్ఎస్ఎస్ విద్యా ర్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధాత్రి కుమారి మాట్లాడుతూ ఏడు రోజుల జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలి పారు. దత్తత తీసుకున్న ప్రాంతాలను శుభ్రం చేసి వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పరిశుభ్రత గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ రాకేష్ పాల్గొన్నారు.

రైతుల సేవలో డీసీఎంఎస్‌లు : చైర్మన్ వడ్రాణం



మంత్రి అచ్చెన్నాయుడుకు శాలువా, జ్ఞాపికను అందజేస్తున్న హరిబాబు తదితరులు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతుల సేవలో డీసీఎంఎస్‌లు ముందంజలో ఉంటున్నాయని డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలోని డీసీఎంఎస్‌ల చైర్మన్లు బుధవారం సచివాలయంలో వ్యవసాయ సంబంధిత సమస్యలపై హరిబాబు నేతృత్వంలో మంత్రి అచ్చెన్నాయుడుతో సుదీర్ఘంగా చర్చించారు. రైతుల సంక్షే మం కోసం ప్రభుత్వం తీసుకొస్తున్న పలు సంస్కరణలపై మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాల్లో కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలు ఎరువులను సకాలంలో అందించడం, రైతుల పంట కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం వంటి బాధ్య తలను సమర్థంగా నిర్వర్తిస్తున్నాయని హరిబాబు అన్నారు. రైతు పక్షపాతిగా వ్యవహరి స్తున్న సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు చాగంటి మురళీ కృష్ణ(పశ్చిమ గోదావరి), కాశిరెడ్డి (ప్రకాశం జిల్లా), బండి శివరామకృష్ణ (కృష్ణా జిల్లా) పలువురు చైర్మన్‌లు ఉన్నారు.

పోరాట యోధుడు జీవీ కృష్ణారావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసంఘటిత రంగంలోని కార్మికవర్గ ప్రయోజనాల కోసం అనేక పోరాటాలు చేసిన యోధుడు జీవీ కృష్ణారావు అని ఏఐటీయూసీ ఏపీ హమాలీ(ముఠా) ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన ఆంజనేయులు కొని యాడారు. స్థానిక ఏటుకూరురోడ్డు, రేగుల రాఘవయ్య భవన్ వద్ద జీవి కృష్ణారావు జయంతి నిర్వహించారు. ఆయన మా ట్లాడుతూ రాష్ట్రంలో హమాలీ ముఠా ఫెడరేషన్‌ని ఏర్పాటు చేసి అసంఘటిత రంగంలోని కార్మికులను ఏకతాటిపై నడిపించిన ఘనత కృష్ణారావుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి.సురేష్‌బాబు, రావుల అంజిబాబు, శివ, జి.సుధాకర్, పోనుగోటి వెంకటరెడ్డి, ముసల లక్ష్మయ్య పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నగర మేయర్ రవీంద్ర, కమిషనర్, సీపీ తదితరులు

బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌లపై అవగాహన కల్పించాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా బీపీఎస్, ఎల్ఆర్ఎస్ మీడియా డివైస్ పాలసీలపై జారీ చేసిన మార్గదర్శకాలపై నగర ప్రజలకు అవగాహన కలిగించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులకు తెలిపారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నిర్వహించిన పట్టణ ప్రణాళిక విభాగ సమీక్షలో మేయర్ పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ మీడియా డిస్‌ప్లే డివైస్ బోర్డులపై రూపొందించిన మార్గదర్శకాల వల్ల నగర సుందరీకరణతో పాటు అనధికారిక హోర్డింగ్స్ కూడా లేకుండా ఉంటాయన్నారు. కమిషనర్ మాట్లాడుతూ బీపీఎస్‌పై సందేహాల నివృత్తికై పట్టణ ప్రణాళికా విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ (8096084343 విజయ రామరాజు)కు కార్యాలయ సమయంలో ఫోన్ చేసి తెలుసుకోవచ్చునన్నారు. అనధికారిక బోర్డుల తొలగింపు నిరంతర ప్రక్రియగా ఉండాలని, ఈ నెల 15 లోపు బకాయిలు, నెలాఖరు లోపు ప్రస్తుత డిమాండ్ ఫీజులు చెల్లించాలన్నారు. అనంతరం బీపీఎస్‌పై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో సీపీ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు, టీపీఎస్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఐపై నింద కేసులో మీడియా ప్రతినిధి సహా ఇద్దరు అరెస్టు

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తన కారుపై తానే దాడి చేయించుకుని సీఐపై నింద మోపిన కేసులో మీడియా ప్రతినిధి కన్నెగంటి అరుణ్‌బాబు, పొంగులూరి అన్వేష్, కారుకుంట్ల సుధీర్‌కుమార్‌లను పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం పట్టాభిపురం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావే శంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్ నిందితులను మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. గత నెల 4న అర్ధరాత్రి సమయంలో పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణనగర్ 2వ లైనులోని సాయి తేజ అపార్ట్మెంట్లో నివాసం ఉండే మీడియా ప్రతినిధి కన్నెగంటి అరుణ్‌బాబు రౌడీమూక లను నియమించుకుని, తన కారుని తానే ధ్వంసం చేయించుకుని, తుళ్ళూ రు సీఐ తన మనుషులతో దాడి చేయించారని, సీఐపై నింద మోపి, పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఈ ఘటనపై ఎస్పీ దిశానిర్దేశంతో వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ ఆధ్వర్యంలో సమగ్రంగా దర్యాప్తు జరిపి అరుణ్‌బాబును ప్రథమ నిందితుడిగా చేర్చి, మరో 10 మందిని నిందితులుగా గుర్తించి, వారిలో ఐదుగురిని గత నెల 13న పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారన్నారు. విజయవాడలోని బస్టాండ్ వద్ద కన్నెగంటి అరుణ్‌బాబు (ఏ1), ప్రస్తుతం వికాస్‌నగర్‌లో ఉంటున్న కారంపూడి మండలం ఒప్పిచర్లకు చెందిన పొంగులూరి అన్వేష్ (ఏ12), ఏటీ అగ్రహారం 12వ లైనుకు చెందిన కారుకుట్ల సుధీర్ కుమార్ (ఏ13)లను అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో మిగిలిన నిందితులను కూడా త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు అరుణ్‌బాబు మీద వేరువేరు పోలీస్‌స్టేషన్లో 9 కేసులు నమోదయ్యా యన్నారు. సమావేశంలో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, సీఐ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తదితరులు

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తోన్న ఇద్దరిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కిలోలకు పైగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్యామలానగర్ ఎక్స్‌టెన్షన్ రోడ్డులో సుద్ధపల్లి డొంక ప్రగతినగర్ 14వ లైనుకు చెందిన షేక్ నాగూర్ సైదా, పాతగుంటూరు బాలాజీనగర్‌కు చెందిన షేక్ బాబూల్ రేయాన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా రామిరెడ్డి నగర్‌లో నివాసం ఉండే ఒరిస్సాకు చెందిన కృష్ణ ఒరిస్సా నుంచి గంజాయి కొని తెచ్చి గుంటూరులో అమ్ముతూ ఉంటాడని వారు చెప్పారు. వారం రోజుల క్రితం షేక్ నాగూర్ సైదా, షేక్ నాగుల్ మీరా కలసి కృష్ణ వద్ద 4 కిలోల గంజాయిని 20 వేలకు కొని, అందులో సుమారు 2 కిలోల గంజాయిని అమ్మగా రూ.20 వేలు రాగా ఇద్దరూ సమానంగా పంచుకున్నట్లు చెప్పారు. మిగిలిన 2 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సామాజిక స్వరం పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, హైదరాబాద్ ఆధ్వర్యంలో కళాసారథి నూతలపాటి సాంబయ్య రచించిన కవితా స్రవంతి సామాజిక స్వరం పుస్తకావిష్కరణ సభ జరిగింది. తొలుత ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏపీ నాటక పరిషత్ అధ్యక్షుడు బుద్ధాల వెంకట రామారావు, ఇతర అతిథులు పుస్తకాన్ని ఆవిష్కరించారు.

లేబర్ కోడ్‌ల అమలును నిలిపివేయాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యాజమాన్యాల ప్రయోజనాల కోసం ఏకపక్షంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలు నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక అరండల్‌పేట, ఎల్ఐసీ ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో నాలుగు లేబర్ కోడ్స్ అమలు - ఉద్యో గులు, కార్మికులపై ప్రభావం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సమావేశంలో అబ్దుల్ సలీం, బి.లక్ష్మణరావు, ఎం.సాంబశివరావు, వీవీకే సురేష్ పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

వైద్యరంగానికి అగ్ర తాంబూలం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వైద్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన అనారోగ్య బాధితులకు రూ.1.58లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యానికి గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందిన మేకా శాంతకుమారి, తమన్నా సుజాత, గుంటి సంధ్యారాణి కుటుంబాలకు చెక్కులు అందజేశామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకూ రూ.7 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశామన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో అన్ని విభాగాల్లో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.

లోకేశ్ అమెరికా పర్యటన పెట్టుబడులకు పునాది

● మన్నవ మోహనకృష్ణ



మంత్రి లోకేశ్‌తో మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మావన వనరుల మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటనతో రాష్ట్రంలో రూ.వేల కోట్ల పెట్టుబడులకు పునాది పడిందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. మంత్రి లోకేశ్ చేపట్టిన అమెరికా పర్యట నలో మోహనకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడానికి లోకేశ్ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారన్నారు. అమెరికాలో జెట్‌లాగ్‌ను సైతం లెక్కచేయ కుండా లోకేశ్ ఉదయం నుంచి రాత్రి వరకూ దిగ్గజ కంపెనీల సీఈవోలతో వరుస మీటింగులు జరిపి పెట్టుబడులు రప్పించేందుకు శ్రమపడుతున్నారని చెప్పారు.

శ్రీవిష్ణు గ్రూపుతో ఎస్ఆర్ఎం వర్సిటీ ఎంవోయూ



ఒప్పందాలపై సంతకాలు చేస్తున్న ఎస్ ఆర్ఎం వీసీ సతీష్‌కుమార్, శ్రీవిష్ణు గ్రూపు సంస్థ వైస్ చైర్మన్ రవిచంద్ర రాజగోపాల్

తుళ్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో ముందుకు సాగుతున్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, పరిశోధనల విస్తృత దిశగా గుర్తింపు కలిగిన శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీతో బంధాన్ని ఏర్పరచుకుని పరస్పర సహకారంతో వివిధ రంగాల్లో పరిశోధనలు జరిపేందుకు సమాయత్తమైంది. బుధవారం ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్ర రాజగోపాల్‌తో సమావేశమైన ఎస్ఆర్ఎం వీసీ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్‌లు ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఐదేళ్ల పాటు కొనసాగే ఈ ఒప్పందంలో సైంటిఫిక్ రీసెర్చ్, రీసెర్చ్ ఫం డింగ్, అకడమిక్ యాక్టివిటీస్, వర్క్‌షాప్స్ నిర్వహణ, జజాయింట్ మెంటారింగ్ వంటి కీలక అంశాల్లో రెండు విద్యా సంస్థల మధ్య పరస్పర సహకారం ఉంటుంది. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం వీసీ సతీష్‌కుమార్ ఎస్వీఈఎస్ వైస్ చైర్మన్ రవిచంద్రను సత్కరించి జ్ఞాపికను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం వర్సిటీ డీన్లు టామ్, రమణారావు, విష్ణుఫర్, వినాయక్‌లతో పాటు ప్రొఫెసర్లు మహేశ్, హరీష్, పాల్గొన్నారు. విష్ణు గ్రూపు నుంచి రవీంద్రబాబు, రాజు యడ్ల, శ్రీనివాసరావు, రాజు, ప్రసాదరాజులు పాల్గొన్నారు.

టీటీడీలో శాలువా దొంగలు ఎవరు..?

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టీటీడీలో శాలువా దొంగలు ఎవరు.. జగన్‌రెడ్డి నా.. సుబ్బారెడ్డి నా.. మాజీ ఈవో ధర్మారెడ్డి నా.. తిరుమల శ్రీవారి సన్నిధిలో జగన్ అండ్ దొంగల ముఠా మరో అపచారానికి తెర తీసి అడ్డంగా దొరికిపోయారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ అన్నారు. స్వామి దర్శనం చేసుకున్న తర్వాత వీఐపీలకు వేద ఆశీర్వచనం పేరుతో.. స్వామి వారి శాలువాలు కప్పుతారు.. సహజంగా ఈ శాలువా ధర రూ.300 నుంచి 350 వరకు ఉంటుంది.. కానీ జగన్ దొంగల ముఠా పాలనలో.. ఏకంగా రూ.1334లు చెల్లించినట్లు.. టీటీడీ రికార్డులలో చూపడం దారుణం అన్నారు. అంటే ఒక్కొక్క శాలువాలో వెయ్యి రూపాయలు వరకు.. స్కామ్ చేసి.. దాదాపుగా స్వామివారి డబ్బును 50 కోట్లు వరకు నొక్కేసినట్లు టీటీడీ రికార్డులను బట్టి తెలుస్తోందన్నారు. అదేవిధంగా స్వామివారికి శుక్రవారం రోజు అభిషేకం చేసిన తర్వాత.. మల్బరి సిల్క్ ప్యూర్ పట్టు తోటి స్వామివారి విగ్రహాన్ని శుభ్రపరుస్తారు. ఈ వస్త్రాన్ని (మేల్ చాట్) వస్త్రం అంటారు. ఈ వస్త్రంలో కూడా కల్తీ జరిగి తప్పుడు లెక్కలు కట్టి స్వామివారికి జగన్ ముఠా చాలా అపచారం చేసిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న హిందువులందరూ జగన్‌పై ఈ- కార్డులు బ్లాక్ చేయాలని అధికారులకు దర్శనపు శ్రీనివాస్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా డాక్టర్ రాధామాధవి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా డాక్టర్ శనక్కాయల రాధామాధవి నియమితులయ్యారు. బుధవారం లాలుపురంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. రాధామాధవి మాట్లాడుతూ మహిళల సంక్షేమం, భద్రత, సాధికారతపై బీజేపీ అమలు చేస్తున్న కార్యక్రమాల్ని గ్రామ స్థాయికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తా నని అన్నారు. కార్యక్రమంలో యడ్ల పాటి స్వరూప రాణి, కొత్తూరు వెంకట సుబ్బారావు, తులసి రామచంద్ర ప్రభు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారావు, నాగమల్లేశ్వరి, శ్రావణకుమారి, పద్మ, లక్ష్మి, విమలాదేవి పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నదాన సమాజంలో ఘంటసాల వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. చివరోజున పలువురు గాయకులు ఘంటసాల పాటలు అలపించి ప్రేక్షకులను అలరించాయి. అనంతరం గాయకులను, వాయిద్య సహకారం అందించిన అన్నదాన సమాజం కార్య నిర్వాహణాధికారి జి.శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు.

పోలీసులకు ఐకాన్‌గా డ్రోన్లు

● నేరాల నియంత్రణకు అధునాతన సాంకేతికత

● డ్రోన్ ఆపరేటింగ్‌పై పోలీసు సిబ్బందికి శిక్షణ

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఒక పక్క టెక్నాలజీ పరంగా ముందుకు వెళుతూనే మరో పక్క నేరస్థుల కదలికలతో పాటు అక్రమ రవాణ వంటి పలు అసాంఘిక కార్యకలాపాలను పసిగట్టేందుకు డ్రోన్ టెక్నాలజీ పోలీసులకు బ్రహ్మాస్త్రంగా దొరికింది. మనుషులు వెళ్ళలేని స్థావరాలకు కూడా డ్రోన్‌లను పంపుతూ చిమ చిటుక్కు మన్నా తెలుసుకునే ప్రయత్నాన్ని పోలీసులు మొదలు పెట్టారు. జిల్లాలో ఇప్పటికే డ్రోన్‌ల సాయంతో చాలా విషయాలలో సత్ఫలితాలు పొందారు.

● ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒకరికి శిక్షణ

డ్రోన్లను ఆపరేట్ చేసేందుకు సిబ్బందికే ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందు కోసం ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్‌కు డ్రోన్ ఆపరేటింగ్‌పై అవగాహన కోసం శిక్షణ కూడా ఇస్తున్నారు. వినాయకుని నిమజ్జన వేడుకలతో పాటు పలు ప్రాంతాలలో జరిగే జాతర్లలో అల్లరి మూకలను గుర్తించి వారి భరతం పట్టేందుకు డ్రోన్ పోలీసులకు మూడో కన్నుగా ఉపయోగ పడుతోంది. అంతే కాకుండా గంజాయి, గ్రావెల్ వంటి అక్రమ రవాణాను కూడా గుర్తించేందుకు ఇవి ఎంత గానో ఉపయోగ పడుతున్నాయి.

● డ్రోన్ ప్రభావంతో తగ్గుతున్న నేరాలు...

- కోస్టల్ రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి



డ్రోన్ కెమెరాల వల్ల జిల్లాలో నేరాలను నియంత్రించ గలుగుతున్నాం. ప్రతి జిల్లాలో ఐదు లేదా ఆరు డ్రోన్ కెమెరాలు పోలీసు శాఖకు సమకూర్చాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటాన్ని అరికట్టటంలోనూ, మారుమూల ప్రదేశాల్లో జూదం, వ్యభిచార కేంద్రాల నిర్వహణ వంటి అసాంఘిక కార్యకలాపాలను డ్రోన్ కెమెరాలతో పసిగట్టి అరికట్టేందుకు చర్యలు చేపట్టాం.



జిల్లాలో ఎన్నడూ లేని విధంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రత పెరగడంతో జనాలు అల్లాడి పోతున్నారు. పెరిగిన చలితో ముఖ్యంగా పిల్లల్లో, వృద్ధుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయి. సరైన ఆహారం, చిన్నపాటి జాగ్రత్తలు వహిస్తే వ్యాధుల నుంచి బయట పడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

చలికాలం.. అప్రమత్తం





● గతంలో కంటే పెరిగిన చలి తీవ్రత

● పెద్దలలో పెరుగుతున్న కీళ్ల నొప్పులు

● శీతాకాలంలో బ్యాక్టీరియా, వైరస్‌లు సోకే ప్రమాదం

● అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది జనవరిలో కూడా నమోదు కాని కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఈ ఏడాది డిసెంబరులోనే నమోదవుతున్నాయి. పెరిగిన చలి తీవ్రతతో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారు. పిల్లల్లో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎదురువుతున్నాయి. జలుబు, దగ్గు, ఊపిరి తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు వంటి సమస్యలతో ఆసుపత్రులకు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఈ కాలంలో పిల్లలపై సుక్ష్మక్రిములు దాడి చేస్తుంటాయని, తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వారు తినే ఆహారం, దుస్తులు, ఆడుకునే బొమ్మలు, చదువుకునే ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. చలి, తగలకుండా వెచ్చదనం ఉండేలా దుస్తులను వేయాలని, మంకీ క్యాప్‌లు, ప్యాంట్లు, ఫుల్ హ్యాండ్స్ చొక్కాలు వినియోగించాలని సూచిస్తున్నారు. పిల్లలకు విటమిన్ సి, ఐరన్, జింక్ ఉన్న ఆహారాన్ని అందించాలని, పండ్లు, పాలు, ఆకుకూరలను ఎక్కువగా ఇవ్వాలని చెబుతున్నారు. కూరగాయలు, గోధములు, నాటు గుడ్లు ఆహారంలో చేర్చాలని అంటున్నారు. ఈ కాలంలో పిల్లలకు నీటిని బాగా తాగించాలని, వారు రోజులకు 12 గంటలు నిద్రపోయేలా చూడాలని చెబుతున్నారు. శీతాకాలంలో పిల్లలు బయటకు వెళ్లి ఆడుకునేలా ప్రోత్సహించాలని, అప్పుడే వారి శరీరానికి విటమిన్ డి అందుతుందని వైద్యులు చెబుతున్నారు.

● టీకాలు వేయించాలి

ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌తో పిల్లలకు దగ్గు, జలుబు, నియంత్రిస్తుందని, వీటిని ఏడాది పిల్లలకు రెండు సార్లు, ఆ తరువాత ఐదేళ్ల వరకు ఏటేటా ఒక్కొక్కటి చొప్పున వేయాలని వైద్యుల సూచిస్తున్నారు. చల్లని గాలులతో పిల్లలకు జ్వరంతో పాటు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ సమయంలో సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించాలని అంటున్నారు.

● పెద్దలపై కీళ్ల ఒత్తిడి

చలి పెరిగే కొద్ది వాతవారణ పీడనం తగ్గిపోతుందని, ఈ ఒత్తిడితో పెద్దలలో కీళ్ల చుట్టూ ఉన్న కండరాలు, లిగ్‌మెంట్లు కొద్దిగా ఉబ్బుతుంటాయని వైద్యులు చెబుతున్నారు. దీని కారణంగా కీళ్లపై ఒత్తిడి పెరిగి నొప్పులు వస్తాయని, అర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్న వారికి ఈ నొప్పి ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. పెరిగిన చలితో మైగ్రేన్స్లు, రుమటాయిడ్ అర్థరైటిస్, ఫైట్రో మైయాల్టియా, న్యూరోపతిక్, ఆస్టియా అర్థరైటిస్ వస్తాయని, ఈ సమయంలో వైద్యులు సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి



చలికాలంలో వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలి. మంచి ఆరోగ్యం, నిద్ర, వ్యాయమం తప్పనసరి. విటమిన్ సి ఉన్న పండ్లు పిల్లలు తినేలా చూడాలి. శీతాకాలంలో సర్వ సాధారణంగా వచ్చే అనారోగ్యాలు దగ్గు, తుమ్ములు, జలుబు, చర్మం పగలడం వంటివి చూడ్డానికి చిన్నవిగా కనిపిస్తాయి. నిర్లక్ష్యంగా ఉంటే అవే పెద్దవిగా మారే ప్రమాదం ఉంటుంది. ఈ సమయంలో బ్యాక్టీరియా, వైరస్‌లు సోకే ప్రమాదం ఉంది. చిన్న పాటి సమస్య అయినా వైద్యులను సంప్రదించాలి. జీజీహెచ్‌లో అన్ని సమయాల్లోనూ వైద్యులు అందుబాటులో ఉంటారు.

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ



అంథోని థామస్ చర్చి వేడుకల్లో గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ప్రతి హృదయం పవిత్రంగా ఉండాలి

● బిషప్ డాక్టర్ సీహెచ్ భాగ్యయ్య

రెంటచింతల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి హృదయం పవిత్రంగా ఉండాలని, స్వార్థరహిత జీవనం గడపాలని గుంటూరు మేత్రాసన పీఠాధిపతి (బిషప్) డాక్టర్ చిన్నబత్తిని భాగయ్య కోరారు. బుధవారం మండలంలోని తుమృకోట గ్రామంలో పునీత థామస్ చర్చి 125వ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి స్థానిక విచారణ గురువు హెచ్‌జీఎన్ పవిత్రన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బిషప్ భాగ్యయ్య మాట్లాడుతూ, స్వాతంత్య్రం రాక ముందు నిర్మించిన ఈ చర్చిని రూ.40లక్షలతో ఆధునీకరించిన తీరు చూడముచ్చటగా ఉందని కొనియాడారు. అనంతరం సమష్టి దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఎలీషా రాజ్, మర్రి అనిల్, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అసైన్డ్‌పై కొరడా

(7వ పేజీ తరువాయి)

ప్రభుత్వం తెప్పిం చుకుంది. దీనితో పాటు వీటిలో ఎన్ని రిజిస్ట్రేషన్ వరకు వెళ్లాయనే అంశంతో పాటు, తిరిగి నిషేధిత జాబితాలో చేర్చడానికి ఉన్న సాధ్యాసాధ్యాలేమిటనే రిపోర్టులు కూడా గతంలోనే ప్రభుత్వం చేతికి అందాయి. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో నెలలోగా నిర్ణయం తీసుకుని, భూ సంబంధిత సమస్యల పరిష్కారం నిర్దిష్ట కాలపరిమితితో జరగాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో అసైన్డ్ అక్రమాలపై కొరడా ఝుళిపించడంతో పాటు, అందకు బాధ్యులైన వారిపై కూడా చర్యలకు దిగనున్నామనే సంకేతాలను ప్రభుత్వం స్పష్టంగా పంపింది.

పదికి.. వంద రోజుల ప్రణాళిక



● మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు


● ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహణ

● సెలవు రోజుల్లోనూ పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

గుంటూరు(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రత్యేక తరగతులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. పదిలో రాష్ట్రస్థాయిలో తమ తమ జిల్లాలను అగ్రస్థానంలో ఉంచడమే లక్ష్యంగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 60వేల మందికి పైగా ఉన్నట్లు సమాచారం. గతేడాది ఉమ్మడి జిల్లాలో గుంటూరు రాష్ట్రస్థాయిలో టాప్ పదిలో ఉండగా బాపట్ల, పల్నాడు జిల్లాలు కొద్దిలో వెనుకబడ్డాయి. ఈ నేపథ్యంలో ఈఏడాది ఆయా జిల్లాల్లో కూడా మెరుగైన ఫలితాల కోసం కృషిచేస్తున్నారు.

● సిలబస్ పూర్తి.. ప్రతిరోజు రివిజన్ తరగతులు

పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే సిలబస్ పూర్తయింది. ఇక నుంచి ప్రతిరోజు స్టడీ అవర్స్ పకడ్బందీగా నిర్వహించడంతోపాటు సబ్జెక్టుల వారీగా అం దులోని పా ఠ్యాంశాలను ఉపాధ్యాయు లు రివిజన్ చేయను న్నారు. ప్రతి రోజు ఉదయం గంట, సాయంత్రం గంటపాటు విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించనున్నారు. విద్యార్థులు పాఠశాల పరీక్షల్లో తెచ్చుకున్న మార్కులను విశ్లేషించి స్టడీ అవర్స్ నిర్వహిస్తారు విద్యార్థులను గ్రూపులుగా విభజించి రివిజన్ క్లాసులు నిర్వహిస్తారు. అంతేకాకుండా వారాంతాల్లో సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల మార్కులను బేరీజు వేయనున్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నవారికి ఇంకా మెరుగైన శిక్షణ అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం పాత ప్రశ్న పత్రాలను సేకరించి పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.



● త్వరలో స్టడీ మెటీరియల్ పంపిణీ

జిల్లా పరిషత్ నుంచి త్వరలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నారు. ఈ మెటీరియల్ కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపకరిస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. త్వరలో 10వ తరగతి విద్యార్థులకు ఉదయం సాయంత్రం అల్పాహారం అందించేం దుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల స్టడీ అవర్స్‌ను నిత్యం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. విద్యాధికా రులు ఇందుకోసం ప్రత్యేక షెడ్యూలును నిర్దేశించుకొని పాఠశాలలను సం దర్శించి స్టడీ అవర్స్‌ను పర్యవేక్షించను న్నారు. ఇలా వందరోజుల ప్రణాళిక రూపొందించి పది పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయనున్నారు.



కొల్లిపర మార్కెట్‌లో వేలం పాటకు వచ్చిన కర్పూర గెలలు

ప్రియమైన అరటి

● గెల రూ. 600 నుంచి రూ 750 పలుకుతున్న వైనం

● పోటీపడి కొంటున్న వ్యాపారస్థులు

కొల్లిపర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అక్టోబరులో కురిసిన పెనుగాలులతో కూడిన వర్షాలు అరటి ధరను అమాంతం పెంచేశాయి. ఎన్నడూ లేని విధంగా అరటి గెలల ధరలు పలకుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద అరటి మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన కొల్లిపర మార్కెట్‌కు సీజన్‌లో ప్రతి రోజూ సుమారు 5 వేల నుంచి 6 వేల వరకు అరటి గెలల క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది అక్టోబరు నెలలో పెనుగాలులతో కూడిన వర్షం పడటంతో అరటి తోటలు పాడై ఉత్పత్తి తగ్గింది. ప్రస్తుతం మార్కెట్‌కు రోజుకు 200 నుంచి 350కి మించి గెలలూ రావడం లేదు. దాంతో ధరలు చుక్కలనంటుతున్నాయి.

● పోటీపడి కొంటున్న వ్యాపారస్థులు

అరటి ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్‌కు గెలలు అతి తక్కువగా వస్తున్నాయి. దాంతో వ్యాపారస్థులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. గతంలో మొదటి రకం కర్పూర అరటి గెల ధరరూ.150 నుంచి రూ.200 వరకు పలకగా, రెండో రకం రూ 90.నుంచి రూ.150 వరకూ పలికేది. చక్కెరకేళి రూ.100 నుంచి 150 పలికేది. అటువంటిది ప్రస్తుతం మొదటి రకం కర్పూర అరటి గెల ధర రూ.600 నుంచి నుంచి రూ.750 వరకు, రెండో రకం రూ.450 నుంచి రూ.550 ధరలు పలుకుతున్నాయి. చక్కెరకేళి మొదటి రకం రూ.400 నుంచి రూ.450 వరకు, రెండో రకం రూ.250 నుంచి రూ.350 వరకు పలుకుతున్నాయి.

● పంట ఉన్నప్పుడు లేని ధర

ఈ సంవత్సరం రైతుల దగ్గర పంట ఉన్న సమయంలో అరటి గెలలకు ధరలు లేకపోవడంతో పూర్తిగా నష్టపోయారు. తమ పంటలు పాడై ఉన్న సమయంలో అరటి గెలల ధరలు ఒక్కసారిగా పెరగాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో అరటి గెలల ధరలు ఒక్కసారిగా పెరగడంతో వ్యాపారులు ఇదే అదునుగా డజను అరటి కాయలను రూ.50 నుంచి రూ.60 వరకు, చక్కెరకేళి రూ.100 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. దాంతో వినియోగదారులు అరటి పండ్లను కొనాలంటేనే భయపడుతున్నారు.

అజ్ఞాతంలో భోక్తలు

(7వ పేజీ తరువాయి)

భావించిన వారు పది రోజుల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. ఈ కేసులో 11వ నిందితుడైన నాటి డైరెక్టర్ కూనిశెట్టి శివ నవీన్ ఇప్పటికే కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. రాముతో పాటు మిగిలిన నిందితులు కూడా ముందస్తు బెయిల్ ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం.

అక్రమాలు ఇలా..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాతంశెట్టి సీతారామాంజనేయులు 2019 డిసెంబరు 5 నుంచి 2021 ఫిబ్రవరి 13 వరకు, 2021 జూలై 24 నుంచి 2024 జూన్ 7 వరకు రెండు విడతలుగా జీడీసీసీబీ ఛైర్మన్‌గా కొనసాగారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా బోగస్ రుణాల మంజూరు సాగింది. రాము ఛైర్మన్ కాకముందు మిర్చి టిక్కీకి 1500 తాకట్టు రుణంగా పరిమితి రూ.10 లక్షలు ఉండేది. అయితే ఆయన ఛైర్మన్ అయిన తర్వాత టిక్కీకి తాకట్టు రుణాన్ని 1500 నుంచి 2000కు, ఆ తర్వాత 4 వేలకు పెంచేశారు. అంతేకాక రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. నిబంధనలకు విరుద్ధంగా విశ్రాంత ఉద్యోగి యర్రంశెట్టి ఈశ్వరప్రసాద్‌ను చిల్లీస్ స్టాక్ క్వాలిటీ కంట్రోలర్ అండ్ వాల్యూవర్‌గా నియమించుకున్నారు. బోగస్ రైతుల పేరుతో, స్టాక్ లేకపోయినా కోల్డ్ స్టోరేజ్ యజమానులకు ఈశ్వర్‌ప్రసాద్ 2023లో 1347 మందికి తాకట్టు అప్రైజర్ సర్టిఫికెట్లు జారీ చేసి రూ.కోట్లలో రుణాలు నొక్కేశారు. నాటి నల్లపాడు బ్రాంచ్ మేనేజర్ దేవరకొండ అరుణ్ కుమారి 2 దఫాలు అక్కడే మేనేజర్‌గా పనిచేయడమే కాకుండా రెండేళ్లలోనే రెండుసార్లు ఉద్యోగోన్నతి పొందడం వెనుక ఇక్కడ జరిగిన కుంభకోణానికి సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. ఈమె మేనేజర్‌గా ఉన్న సమయంలో బినామీ వ్యక్తుల పేర్లతో కోల్డ్ స్టోరేజ్ యజమానులు బ్యాంకుకు రాకుండానే వారి సిబ్బందిని పంపి ఎస్‌బీ ఖాతాలు తెరిచారు. రెండు లక్షలకు పైబడిన రుణాలను తప్పనిసరిగా బ్రాంచ్ నుంచి ఆన్‌లైన్ ద్వారా సంబంధిత ఖాతాలకు బదిలీ చేయాలి, కానీ నిబంధనల విరుద్ధంగా బ్యాంకులోనే విత్ డ్రా చేశారు. మిర్చిపై తాకట్టు రుణం తీసుకున్న గడువు ముగిసినా స్టాక్ వేలానికి చర్యలు తీసుకోలేదు. నాటి ఛైర్మన్ రాముతో పాటు నల్లపాడు బ్రాంచ్ మేనేజర్, నాటి సీఈవో, బ్యాంకు డైరెక్టర్లు, అప్రైజర్ అందరూ కుమ్మక్కై 22 కోట్ల 25 లక్షల 5 వేల 439 రూపాయల బోగస్ రుణాలు తీసుకుని బ్యాంకును మోసం చేశారని అధికారుల విచారణలో తేల్చారు.

● లింగాయపాలెంలోని విశ్వసాయి ఫుడ్స్‌పేరుతో 12 కోల్డ్ స్టోరేజీలలో మిర్చిస్టాక్ ఉన్నట్లు బినామీ పేర్లతో రుణాలు తీసుకున్నారు.

● అంకిరెడ్డిపాలెంలోని రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌లో మిర్చిస్టాక్ లేకపోయినా రూ.13కోట్ల 15లక్షల 7వేల 453 బోగస్ రుణాలు పొందారు.

● నకిలీ డ్వాక్రా గ్రూపులు సృష్టించి వ్యక్తిగత, దీర్ఘకాలిక రుణాలు సుమారు 9 కోట్ల వరకు తీసుకున్నారు.

● వెంగళాయపాలేనికి చెందిన హోసన్నా మహిళ గ్రూప్ బోగస్ అని డీఆర్డీఏ నిర్ధారించినా రూ.14 లక్షలు రుణాలు ఇవ్వాల్సిందిగా నాటి మేనేజర్ అరుణ్‌కుమారి సిఫార్సు చేశారు.

● సంగడిగుంటకు చెందిన వీరబ్రహ్మేంద్ర మహిళా పొదుపు సంఘానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని ఆమె సిఫారసు చేశారు. అయితే అప్పటికే ఆ గ్రూప్ పేరుతో మరో బ్యాంకులో రూ.8.19 లక్షల రుణం బకాయి ఉంది.

● ఎటువంటి భూములు లేకపోయినా తప్పుడు పత్రాలు సృష్టించి 2021లో కొందరు రూ.9 కోట్లు రుణాలు తీసుకున్నారు. దీనిపై అప్పట్లో నల్లపాడు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు కాగా ఆ కేసు విచారణను ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావుకు అప్పగించారు. ఆయన కేసు విచారించి బ్యాంక్ మేనేజర్, మాజీ తహసీల్దార్ సహా ఇప్పటి వరకు 11 మందిని అరెస్టు చేశారు.

ఇప్పటికే రాముపై భూకబ్జా ఫిర్యాదు

లాల్‌పురంలో తాను 2011లో డీ నెంబర్ 324/ఎ లో 13 శెంట్ల భూమి కొనుగోలు చేసిన స్థలాన్ని రాము కబ్జా చేశాడని, అదేమని ప్రశ్నిస్తే తన కాలు విరగొట్టాడని పట్టాభిపురానికి చెందిన ఉప్పు శంకరరావు రెండు రోజుల క్రితం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన స్థలాన్ని కబ్జా చేసి గోడ కడుతుండగా పెద్దమనుషులను పంపి ప్రాధేయ పడితే దూషించడమే కాక దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నాడన్నారు. దీనిపై విచారించాల్సిందిగా ఎస్పీ నల్లపాడు పోలీసులను ఆదేశించారు.

ఆమె బతికున్నా...!

● అన్నదాత సుఖీభవ అధికారుల అలసత్వం

మేడికొండూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతు బతికున్నా, రికార్డులలో ఆమెను చంపేశారు. అధికారుల తప్పిదం ఆ మహిళకు శాపంగా మారింది. అన్నదాత సుఖీభవ అధికారుల అలసత్వం కారణంగా ఆమెకు దక్కాల్సిన పీఎం కిసాన్ పరిహారం చేజారింది. మేడికొండూరు మండలం భీమినేని వారిపాలెం గ్రామానికి చెందిన మహిళా రైతు మద్దినేని రాధారాణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన 'అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్' పరిహారం జమ కాలేదు. దీంతో విషయం తెలుసుకుందామని ఆమె బుధవారం గ్రామంలోని అన్నదాత సుఖీభవ కేంద్రానికి వెళ్లింది. అక్కడి సిబ్బందిని తన స్టేటస్ చెక్ చేయమని కోరింది. కంప్యూటర్‌లో వివరాలు పరిశీలించిన సిబ్బంది ఒక్కసారిగా నీళ్లు నమిలారు. సిబ్బంది చూపించిన వివరాల ప్రకారం రాధారాణి మరణించినట్లు ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదై ఉండడంతో రాధారాణి ఆవేదన వ్యక్తం చేసింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అర్హులైన పేదలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు అందకుండా పోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అధికారులు, ఇలా ఇష్టారాజ్యంగా రికార్డులు ఎలా మారుస్తారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, రాధారాణి రికార్డులను సరిచేసి, ఆమెకు రావాల్సిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పరిహారం అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువులకు మహర్దశ

(7వ పేజీ తరువాయి)



పిడుగురాళ్లలో అభివృద్ధి చేయనున్న చెరువు

సర్వే చేయించి చెరువుల వాస్తవిక స్థలా న్ని నిర్ధారించారు. నరసరావుపేట మున్సిపాల్టీలో అభివృద్ధి చేసే కత్తవ చెరువులో 10 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఆయా జిల్లాల్లో గుర్తించిన ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. సంబంధింత పనుల టెండర్ 23వ తేదీ గడువుగా ప్రకటించారు. టెండర్ల అనంతరం పనులు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

మునిసిపాల్టీల వారీగా నిధుల మంజూరు ఇలా..

మునిసిపాల్టీల	చెరువులు	నిధులు రూ.కోట్లలో
నరసరావుపేట	1	5.60
చిలకలూరిపేట	5	3.68
మాచర్ల	1	6.60
పిడుగురాళ్ల	1	11.52
సత్తెనపల్లి	1	0.72
దాచేపల్లి	2	2.50
గురజాల	2	2.10
చీరాల	2	3.05
బాపట్ల	1	1.94
రేపల్లె	3	4.10
అద్దంకి	1	5.10
గుంటూరు	2	17.80
మంగళగిరి.. తాడేపల్లి	7	11.70
పొన్నూరు	1	3.04
తెనాలి	2	10.34

ముగిసిన యువజనోత్సవం

● మూడు రోజులు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థులతో డాన్సు చేస్తున్న మాస్టర్ పండు

ఏఎన్‌యూ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల యువజనోత్సవం బుధవారం ముగిసింది. మూడు రోజుల పాటు సాగిన సాంస్కృతిక పోటీలలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనిబరిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధర్ రావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఉన్న ఉత్సాహాన్ని చూసి తన కళాశాల రోజులను గుర్తు చేసుకున్నట్లు చెప్పారు. విజేతలు త్వరలో జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల యువజనోత్సవం పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ మూడు రోజుల నివేదికను అందజేశారు.

● ఓవరాల్ చాంపియన్‌షిప్ జేకేసీ కైవసం

యువజనోత్సవంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ బహుమతిని జేకేసీ కళాశాల కైవసం చేసుకుంది. రన్నర్‌గా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా కళాశాల నిలిచింది. నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, జానపద కళా రూపాలు, నాటకాలు, చిత్రలేఖనం, క్విజ్ విభాగాల్లో విజేతలకు ప్రత్యేక అతిథిగా విచ్చేసిన రియాలిటీ షో డీ డ్యాన్సర్ పండు మాస్టర్, ముఖ్యఅతిథి వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధర్ రావు, విశిష్ట అతిథులు వర్సిటీ రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిసాస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తదితరులు బహుమతులు అందజేశారు.

● అలరించిన పండు మాస్టర్ డ్యాన్స్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో నిరంతరం సాధన చేస్తూ అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని డ్యాన్స్ మాస్టర్ పండు సూచించారు. విద్యార్థులు కళాశాల రోజులను సద్వినియోగం చేసుకోవాలని, మంచి సువర్ణావకాశాన్ని కోల్పోవద్దన్నారు. తాను ఐఐటీ కళాశాలలో చదువుకున్నానని, డాన్స్, నటనపై మక్కువతో కళా రంగంలోకి ప్రవేశించానని చెప్పారు. అనంతరం ఇటుక మీద ఇటుక పెట్టి, నాది నెక్లెస్ గొలుసు పాటలకు పండు మాస్టర్ చేసిన డ్యాన్స్ విద్యార్థులను అలరించింది. ముగింపు ఉత్సవాల్లో ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ రవికుమార్, పాలక మండల సభ్యుడు ఆచార్య కె.సుమంత్ కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, ఫార్మసి కళాశాలప్రిన్సిపాల్ ఆచార్య తేజోమూర్తి తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులు రూపొందించిన కళాకృతులు



ముగ్గు వేస్తున్న విద్యార్థిని

కౌన్సెలింగ్



కూలింగ్ గ్లాసెస్ అవసరమే

డాక్టర్! ఎండలోకి వెళ్లిన ప్రతిసారీ కూలింగ్ గ్లాసెస్ పెట్టుకోవడం అవసరమా? ఎలాంటి చలువ కళ్లజోడు ఎంచుకోవాలి? వీటి ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

- ఓ సోదరి, హైదరాబాద్

ఎండ, వేడి, అతినీలలోహిత కిరణాలు, రేడియేషన్... వీటన్నిటి నుంచి కళ్లకు రక్షణ కల్పించాలంటే చలువ కళ్లద్దాలు ధరించాలి. సాధారణంగా మార్కెట్లో ఎన్నో రకాల కూలింగ్ గ్లాసెస్ దొరుకుతూ ఉంటాయి. వాటిలో చవకవీ, ఖరీదైనవీ ఉంటాయి. వీటిలో ఏది కొనాలి? అనే విషయంలో అయోమయానికి గురవుతూ ఉంటాం. అయితే వీటిలో వేటితోనైనా కళ్లకు రక్షణ దొరుకుతుంది. అయితే వాటికి అతినీలలోహిత కిరణాలను అడ్డుకునే 'యువి ప్రొటెక్షన్' ఉందా? అన్నది తెలుసుకోవాలి. చవక చలువ కళ్లద్దాలతో పోలిస్తూ ఖరీదైన ప్రముఖ కంపెనీ ఉత్పత్తులు ఈ ఫిల్మ్ విషయంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తాయి. కాబట్టి కళ్లకు పూర్తి రక్షణ కావాలనుకుంటే, మన్నికైన, నాణ్యమైన కూలింగ్ గ్లాసెస్‌నే ఎంచుకోవాలి. తక్కువ ఖర్చులో చలువ కళ్లజోడు కొనే సమయంలో వాటి అద్దాల నాణ్యత పరిశీలించాలి. ఛత్వారం ఉన్న వాళ్లు ఎండ సోకితే నల్లబడే 'ఫొటోక్రోమ్' జోడు ఎంచుకోవాలి. ఈత సమయంలో పెట్టుకోవలసిన కళ్లజోళ్లు కూడా ఉంటాయి. ఈత కొలనులో ఉండే నీటిలో క్లోరిన్ కలిసి ఉంటుంది. దీంతోపాటు ఎన్నో రకాల వైరస్‌లు, బ్యాక్టీరియాలు కూడా ఉండే వీలుంటుంది. ఇవేవీ కళ్లలోకి చొరబడకుండా ఉండాలంటే తప్పనిసరిగా స్విమ్మింగ్ గ్లాసెస్ పెట్టుకోవాలి.

• డాక్టర్ శ్రీలక్ష్మి నిమ్మగడ్డ,
క్యాటరాక్ట్ అండ్ రిఫ్రాక్టివ్ సర్జన్,
విన్ విజన్ హాస్పిటల్స్,
హైదరాబాద్.

రేగు పండ్లు తింటే..!

చలికాలంలోతోపాటే రేగు పండ్లు కూడా వచ్చేశాయి. తరచూ వీటిని తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. రేగు పండ్లు అందించే ఆరోగ్య ప్రయోజనాలు ఇవే...

- రేగు పండ్లను తినడం వల్ల ఎముకలు, కండరాలు బలోపేతమవుతాయి. కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి. శరీరంలో రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రక్తంలో కొలెస్ట్రాల్, చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. గుండె జబ్బులు రావు.
- పండిన రేగు పండ్లు తింటూ ఉంటే జీర్ణాశయ సమస్యలు తీరుతాయి. పేగులు శుభ్రపడతాయి. కడుపులో మంట, మలబద్ధకం, అజీర్తి దరిచేరవు. జీవక్రియలు మెరుగుపడతాయి.
- రేగు పండ్లను తీసుకోవడం వల్ల వాతావరణ మార్పులతో ఏర్పడే అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. జలుబు, గొంతు నొప్పి, నిద్ర లేమితో బాధపడేవారికి ఇవి మంచి ఔషధంలా పనిచేస్తాయి.
- చర్మ సంరక్షణకు కూడా రేగు పండ్లు తోడ్పడతాయి. రోజుకు నాలుగైదు రేగుపండ్లు తినడం వల్ల చర్మానికి తగినంత తేమ అందుతుంది. ముడుతలు, మొటిమలు, మచ్చలు తగ్గి చర్మం ఛాయగా మెరుస్తుంది.
- రేగు పండ్లు.. శరీరంలో క్యాన్సర్ కారకాలను నిరోధిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. రోజూ రేగు పండ్లు తినడం వల్ల కాలేయం పనితీరు మెరుగుపడుతుంది. శరీరంలో పేరుకున్న వ్యర్థ పదార్థాలన్నీ విసర్జితమవుతాయి. ఊపిరితిత్తుల్లో పేరుకున్న కఫం తొలగిపోతుంది.



మనల్ని మనం ప్రేమించాలి

జయాపజయాలతో సంబంధం లేకుండా బిజీగా ఉండే నటి అనన్య. చంకీ పాండే తనయగా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన ఈ తార... తెలుగులోనూ మెరిసింది. సినిమాలో పాత్రలతోనే కాదు... నాజూకైన శరీరాకృతితోనూ కోట్లమంది అభిమానులకు సంపాదించుకుంది. తొలి చిత్రం నుంచే ఆమెపై విమర్శలు వెల్లువెత్తినా... సామాజిక మాధ్యమాల్లో చులకన చేసినా... వేటికీ కుంగిపోలేదు. తన పని తాను చేసుకొంటూ... వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతోంది.

అనన్యా పాండే... పరిచయం అక్కర్లేని నటి. 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్-2'తో తొలిసారి వెండితెరపై కనిపించింది. 'లైగర్'లో విజయ్ దేవరకొండ సరసన నటించి తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరైంది. ప్రస్తుతం 'తు మేరీ మై తేరా మై తేరా తు మేరీ' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో కార్తిక్ ఆర్యన్ హీరో. 'చాంద్ మేరా దిల్' షూటింగ్ జరుగుతోంది. 2019లో మొదలైన ఆమె ప్రయాణంలో ఇప్పటికి పద్నాలుగు చిత్రాలు చేరాయి. పలు టెలివిజన్ షోలు, మ్యూజిక్ వీడియోల్లోనూ ఆకట్టుకున్న అనన్యకు ఇన్‌స్టాగ్రామ్‌లో రెండున్నర కోట్లకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ప్రతి పోస్టుకూ లక్షల్లో లైకులు, వేలల్లో అభినందనలు. తన ప్రాజెక్ట్ అప్‌డేట్స్ కాకుండా... వ్యాయామాలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోమంటూ అభిమానులను ప్రోత్సహిస్తుంది. వర్కవుట్ వీడియోలు పోస్ట్ చేసి, ఉత్సాహం నింపుతుంది. అనన్యకు సినిమాలు ఎంత ముఖ్యమో, ఫిట్‌నెస్ కూడా అంతే. అదే తనను నిత్యయవ్వనంగా ఉంచుతుందని చెబుతుంది.



ఎంత బిజీగా ఉన్నా...

'ముందు మనల్ని మనం ప్రేమించాలి. మన శరీరం చెప్పేది వినాలి. గౌరవించాలి. ఎందుకంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించగలం. అందుకు మార్గం... రోజూ వ్యాయామం. దీనివల్ల జీవక్రియ మెరుగవుతుంది. రోగనిరోధకశక్తి పెరుగుతుంది. శరీరం కాంతిమంతంగా తయారవుతుంది. రోజంతా నన్ను ఉత్తేజంగా ఉంచేది వ్యాయామాలే. ముఖ్యంగా యోగావల్ల రక్తప్రసరణ పెరిగి, చర్మానికి మరింత ప్రాణవాయువు అందుతుంది. దానివల్ల చర్మం నాజూకుగా తయారవుతుంది. చేసే పనిలో ఏకాగ్రత కుదురుతుంది' అంటుంది అనన్య.

- అదేపనిగా వెయిట్‌లిఫ్టింగ్, కార్డియో ఎక్సర్‌సైజ్‌లు చేయడం అంత మంచిది కాదన్నది ఆమె అభిప్రాయం. 'జిమ్‌కు వెళ్లినప్పుడు ప్రధానంగా దృష్టి పెట్టాల్సింది ఫ్లెక్సిబిలిటీ, మొబిలిటీ మీద. అప్పుడే బరువులు ఎత్తినప్పుడు, రన్నింగ్‌లాంటివి చేసినప్పుడు గాయాలు కాకుండా ఉంటాయని' అంటుంది.
- అనన్య వర్కవుట్‌లో యోగా తరువాత ప్రధానమైనవి పిలేట్స్. ఇది మంచి స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజ్. బిగుసుకున్న కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది.
- ఎప్పటికప్పుడు కొత్త వర్కవుట్స్‌తో తనకు తాను సవాలు విసురుకొంటుంది అనన్య. ఇంట్లో రోజూ హఠ, విన్యాస యోగాతో పాటు మరింత కఠినమైన ఏరియల్ యోగా చేస్తుంది. జిమ్‌లో రొటీన్ ఎక్సర్‌సైజ్‌ల వల్ల కీళ్లు, వెన్నెముకలపై పడే ఒత్తిడితో పాటు మానసిక ఒత్తిడి నుంచి కూడా ఇది ఉపశమనం కలిగిస్తుందనేది ఆమె మాట.

సెలబ్ ఫిట్

ఒకటే నచ్చదు

అనన్యకు బాగా ఇష్టమైన ఫుడ్ బర్గర్లు. ప్రతి ఆదివారం ఆమెకు 'బర్గర్ డే'. 'నచ్చింది తింటాను. వారానికి ఒకసారి పొట్ట శుభ్రం చేసుకొంటాను. ఏదో ఒక డైట్ ప్లాన్ తీసుకొని... దాన్నే అనుసరిస్తూ వెళ్లడం నాకు నచ్చదు. దానిమీద దృష్టి పెట్టే కంటే... రోగనిరోధకశక్తినిచ్చే ఆహారం తీసుకోవడం పైనే శ్రద్ధ పెడతాను' అంటుంది అనన్య. ఉదయం యాపిల్, బీట్‌రూట్, క్యారెట్ జ్యూస్‌తో మొదలవుతుంది. ఆ తరువాత తీసుకొనే మెనూలో కూడా పసుపు, పండ్లు, విటమిన్-సి గల ఆహార పదార్థాలు ఉండేలా చూసుకొంటుంది. ఎంత బిజీగా ఉన్నా కడుపు నిండా తినడం, అదనపు క్యాలరీలో కరిగేదాకా వ్యాయామం చేయడం ఆమెకు అలవాటు.

- బ్రేక్‌ఫాస్ట్‌లో ఆమ్లెట్, బటర్‌తో బ్రెడ్ టోస్ట్, బ్లాక్ కాఫీ
- లంచ్‌కు ఉడకబెట్టిన కూరగాయ ముక్కలతో చికెన్ శాండ్‌విచ్
- సాయంత్రం స్నాక్స్ సమయంలో నట్స్, కప్పు బ్లాక్ కాఫీ
- రాత్రి భోజనంలో గ్రిల్డ్ ఫిష్ లేదా చికెన్, సూప్



స్వేచ్ఛా దీపం

అవి రెండో ప్రపంచ యుద్ధపు చీకటి రోజులు. నాటి సైన్యం ఆక్రమించిన పారిస్‌లోని ఓ రహస్య గదిలో ఒక యువతి వేళ్లు వైర్‌లెస్ సెట్‌పై వేగంగా కదులుతున్నాయి. బయట సైనికుల కవాతు చప్పుళ్లు మృత్యుఘోషలా వినిపిస్తున్నాయి. టక్ టక్ మంటూ ఆమె పంపే మోర్స్‌కోడ్ సందేశాలు మిత్రపక్షాలకు జీవనాధారంగా నిలుస్తున్నాయి. ఆ పంపుతున్నది మరెవరో కాదు.. **నూర్ ఇనాయత్‌ఖాన్**. టిప్పు సుల్తాన్ వంశానికి చెందిన భారత సంతతి యువరాణి ఆమె. లండన్, పారిస్‌లలో కవిత్వం, సంగీతం మధ్య పెరిగిన ఆమె జీవితాన్ని నాజీల దురాక్రమణ పూర్తిగా మార్చేసింది. స్వేచ్ఛ కోసం పోరాడాలని నిర్ణయించుకున్న ఆమె బ్రిటన్ గూఢచార సంస్థ స్పెషల్ ఆపరేషన్స్‌లో చేరారు. అత్యంత ప్రమాదకరమైన మిషన్‌పై అధికారులు ఆమెను ఆక్రమిత ఫ్రాన్స్‌కు పంపారు. అలా ఫ్రాన్స్ చేరుకున్న మొట్టమొదటి మహిళా రేడియో ఆపరేటర్‌గా చరిత్ర సృష్టించారు. ప్రాణాలను పణంగా పెట్టి కీలక సమాచారాన్ని చేరవేస్తున్న ఆమె ఓ ద్రోహి కారణంగా నాజీ రహస్య పోలీసులకు చిక్కారు. అత్యంత పాశవికంగా హింసించినా ఆమె ఒక్క రహస్యం కూడా బయటపెట్టలేదు. చివరికి 1944 సెప్టెంబర్ 13న డకావ్ కాన్సన్‌ట్రేషన్ క్యాంపులో ఆమెను కాల్చి చంపారు. తుదిశ్వాస విడుస్తూ ఆమె గొంతెత్తి అరిచిన చివరి మాట 'లిబర్టే' (స్వేచ్ఛ). ఆమె త్యాగానికి గుర్తుగా ఫ్రాన్స్ ప్రభుత్వం ఇటీవల ఆమె చిత్రంతో పోస్టేజ్ స్టాంపును విడుదల చేసి అరుదైన గౌరవాన్ని అందించింది.



బెడ్‌షీట్స్ మార్చాల్సిందే..!

బెడ్ మీద కూర్చున్నా పడుకున్నా బెడ్‌షీట్స్ నేరుగా చర్మానికి తగులుతూ ఉంటాయి. శరీరం నుంచి వెలువడే చెమట, జిడ్డు, మృతకణాలు లాంటివి బెడ్‌షీట్స్ మీద ఎక్కువగా చేరే అవకాశం ఉంటుంది. ఈ బెడ్‌షీట్స్‌ను రోజుల తరబడి మార్చకుండా అలాగే ఉంచితే ముఖంపై మొటిమలు, తుమ్ములు, కళ్లలో దురద, శ్వాసకోశ సమస్యలు, తలలో చుండ్రు లాంటివి వచ్చే ప్రమాదం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



- సాధారణంగా వారానికి ఒకసారి బెడ్‌షీట్స్‌ను మారిస్తే సరిపోతుంది. దీనివల్ల అవి చూడడానికి అహ్లాదకరంగా ఉండడంతోపాటు బెడ్ మీద పడుకున్న వెంటనే ప్రశాంతంగా నిద్ర పడుతుంది.
- కొంతమందికి ముఖం, వీపు, ఛాతి భాగాల్లో మొటిమలు, గుల్లలు ఎక్కువగా వస్తుంటాయి. అలాంటప్పుడు బెడ్‌షీట్స్‌ను రెండు రోజులకు ఒకసారి తప్పనిసరిగా మార్చాలి. లేదంటే బెడ్‌షీట్స్ మీద పేరుకున్న దుమ్ము, ధూళి చర్మ రంధ్రాల్లోకి చేరి వాటిని మూసివేస్తాయి. దీంతో మొటిమల సమస్య తీవ్రమవుతుంది. వీటితోపాటు అలెర్జీలు, దురద లాంటివి కూడా రావచ్చు. ఆస్తమా ఉన్నవారు కూడా తరచూ బెడ్‌షీట్స్‌ను మార్చాలి.
- ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నప్పుడు, పెంపుడు జంతువులు ఉన్నా రోజూ బెడ్‌షీట్స్ దిండు గలేబులను మార్చడం మంచిది.
- ఒక బకెట్‌లో సగానికి పైగా వేడి నీటిని తీసుకుని అందులో రెండు చెంచాల లిక్విడ్ డిటర్జెంట్ లేదా సర్ఫ్ వేసి బాగా కలపాలి. ఈ నీటిలో బెడ్‌షీట్స్‌ను అరగంటసేపు నానబెట్టి ఆపైన చేత్తో ఉతికి తరువాతనే వాషింగ్ మెషిన్‌లో వేయాలి. లేదంటే బెడ్‌షీట్స్ మురికి వదలదు.

ముత్యాల ముగ్గు

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్
features@andhrajyothy.com



అడవే ఆమె చిరునామా

అడవి, పక్షులు, జంతువులు, ప్రకృతి... వీటితో అనన్యా విశ్వేశ్ జీవితం బాల్యంలోనే పెనవేసుకుపోయింది. ఇప్పటికే కొన్ని పదుల సర్పాల్ని కాపాడింది. వేలమంది పిల్లలకు పర్యావరణ పాఠాలు చెబుతోంది. "తరగతి గదిలోకన్నా ఎక్కువ విషయాలను అడవిలో నేర్చుకున్నాను" అంటోంది కేరళకు చెందిన ఈ 14 ఏళ్ల అమ్మాయి.

"పాముల కోసం నీ ప్రాణాల్ని ఎందుకు రిస్క్ చేస్తావు? అని ఒకసారి నన్ను ఎవరో అడిగారు. "ఎందుకంటే... మనం చాలా భయపడే జీవుల్ని ఎవరో ఒకరు పట్టించుకోవాలి కదా!" అని బదులిచ్చాను. నా స్వస్థలం కేరళలోని పాలక్కాడ్. చుట్టూ చెట్లు, పక్షుల అరుపులు, వర్షం కురిసిన తరువాత మట్టి వాసన... వీటన్నిటి మధ్యా పెరిగాను. ఆరేళ్ల వయసులో ఊటీకి విహారయాత్రకు వెళ్లాను. పొగమంచు కప్పేసిన కొండలు, ప్రకృతి సౌందర్యం నన్ను ఎంతో ఆకట్టుకున్నాయి. వన్యప్రాణులంటే మక్కువ బాగా పెరిగింది. ఆ తరువాత ఊటీకి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న నీలగిరి జిల్లా మసినగుడి గ్రామానికి మా కుటుంబం మారింది. ఆరేళ్లపాటు అక్కడ ఉన్నాం. ఆ గ్రామం ముదుమలై నేషనల్ పార్క్‌కు సమీపంలో ఉంటుంది. దాంతో తరచు అడవిలోకి వెళ్ళడం, పక్షులను పరిశీలించడం, వాటి గురించి తెలుసుకోవడం నాకు హాబీగా మారిపోయింది. అలా... 288 పక్షి జాతులను ఫొటోలు తీశాను. వాటన్నిటి వివరాలతో... పదకొండేళ్ళకే 'బర్డ్స్ ఆఫ్ మసినగుడి' అనే పుస్తకాన్ని విడుదల చేశాను. ఆ సందర్భంగా నా పేరు 'ఇండియన్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు చేసుకుంది.

పాము కనిపిస్తే ఫోన్ చేస్తారు...

ఏనుగులంటే నాకు చాలా ఇష్టం. ముదుమలై అడవుల్లో వాటికి దగ్గరగా గడిపే అవకాశం చాలాసార్లు కలిగింది. అలాగే నన్ను బాగా ఆకర్షించినవి... పాములు, బల్లులు లాంటి 'సరీసృపాలు'. నా తోటి పిల్లలు జంతువుల బొమ్మలున్న స్టిక్కర్లు సేకరిస్తూ ఉంటే... నేను సరీసృపాల వివరాలను సేకరించడం మొదలుపెట్టాను. ఈలోగా కొవిడ్ వచ్చింది. బడులు మూతపడడంతో చాలా సమయం దొరికింది. నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో... హెర్పటాలజీలో జూనియర్ మాస్టర్స్ కోర్సు చేసి, సర్టిఫికెట్ అందుకున్నాను. చాలామంది పాములంటే భయపడతారు. కానీ ఆ కోర్సు తరువాత... నాకు ప్రమాదం లేకుండా వాటిని పట్టుకోవడం నేర్చుకున్నాను. మా స్వస్థలమైన పాలక్కాడ్‌కు తిరిగి వచ్చిన తరువాత... వన్యప్రాణుల సంక్షేమం కోసం పాటుపడే స్వచ్ఛంద సంస్థలతో, కేరళ అటవీశాఖతో కలిసి పని చెయ్యడం ప్రారంభించాను. నా నైపుణ్యాన్ని గుర్తించిన అధికారులు జనావాసాల్లో ప్రవేశించే పాములను పట్టుకోవడానికి పిలుస్తున్నారు. అంతేకాదు... నా గురించి తెలుసుకున్న స్థానికులు కూడా ఎక్కడైనా పాము కనిపిస్తే నాకు ఫోన్ చేస్తారు. ఇప్పటివరకూ 75కు పైగా పాములను పట్టుకొని... వాటిని సురక్షితంగా అడవుల్లో వదిలిపెట్టాను.







ఆరు భాషలు వచ్చు...

ప్రస్తుతం నేను బెంగళూరుకు చెందిన ఒక స్కూల్‌లో ఆన్‌లైన్ విధానంలో చదువుతున్నాను. మా నాన్న విశ్వనాథన్ సుబ్రహ్మణియం వ్యాపారవేత్త. మా అమ్మ స్కూల్ టీచర్. నా అభిరుచులకు వారు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. వారి సహకారంతోనే తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో అటవీ శాఖ నిర్వహించే ఫారెస్ట్ నేచర్ క్యాంప్‌లకు హాజరు కాగలుగుతున్నాను. నేను ఆరు భాషలు మాట్లాడగలను. విద్యా సంస్థల్లో, ఇతర చోట్ల వర్క్‌షాపులు తదితర కార్యక్రమాల ద్వారా వన్యప్రాణులను, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకత గురించి ఇప్పటివరకూ దాదాపు పదివేలమంది విద్యార్థులకు అవగాహన కల్పించాను. ప్రముఖ సంస్థల నుంచి 'యంగ్ అచీవర్' తదితర అవార్డులు అందుకున్నాను. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో చేరాలన్నది నా ఆశయం. దాని కోసం కృషి చేస్తూనే వీలైనంత ఎక్కువగా ఈ కార్యక్రమాలను కొనసాగించాలనుకుంటున్నాను."

ఉందాం... సంతోషంగా

సంతోషం బజార్లో కొనుక్కునే వస్తువు కాదు. అరువు తీసుకుని తిరిగిచ్చే ఉపకరణం అంతకన్నా కాదు. ఈ భావనను మనమే సృష్టించుకోవాలి. అందుకోసం మార్గాలు వెతుక్కోవాలి. అడ్డుపడే అవరోధాలను అధిగమించాలి...

సార్వత్రికంగా అందరినీ సంతోషపెట్టే మార్గం అంటూ ఏదీ ఉండదు. అది ఎవరికి వారు తేల్చుకోవలసిందే! ఉదాహరణకు కొందరికి క్రికెట్ అమితానందం కలిగించవచ్చు. కొందరికి అది పరమ చికాకు కలిగించే అంశం కావచ్చు. ఎందుకలా అంటే ఎవరి కారణాలు వారికి ఉంటాయి. ఇతరుల ఆనందించే అంశాలన్నీ మనకు ఆనందాన్నివ్వకపోవచ్చు. మనకు ఆనందాన్నిచ్చేది ఇతరులకు నిరర్థకంగా కనిపించవచ్చు. కాబట్టి మరొకరి సంతోషంతో బేరీజు వేసుకోకుండా స్వీయసంతోషాన్ని ఆస్వాదించాలి. మనం అమితంగా ఇష్టపడేదాన్ని, మనకు సంతోషాన్ని అందించేదాన్నీ కొందరు విమరించవచ్చు కూడా! ఆ విమర్శలకు ప్రభావితమై, మార్గాన్ని మార్చుకుంటే నష్టం మనకే! కాబట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించని, స్వీయఆనందాన్ని అందించే కారకాలను ఎంచుకుని జీవితంలో ఆనందాన్ని నింపుకోవడం అలవాటు చేసుకోవాలి.

ఒక లక్ష్యమంటూ ఉండాలి

వ్యక్తిగతంగా, వృత్తిపరంగా, ప్రతి ఒక్కరికీ ఒక లక్ష్యం అంటూ ఉండాలి. లేకపోతే మనసు చంచలంగా మారుతుంది. ఏ ఒక్క మార్గంలోనూ చివరి వరకూ చేరుకోకుండా, తరచూ దారి మారుస్తూ ఉంటుంది. దీనివల్ల అన్నీ అర్థాంతరంగా ఆగిపోతాయి. ఈ తత్వం అంతిమంతా మనోవేదననే మిగులుస్తుంది. అందువల్ల ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని, ఆ దిశగానే ప్రయాణిస్తూ ఉంటే మనసు చలించే అవకాశం ఉండదు. ఊహించిన స్థాయిలో కాకపోయినా కొంత మేరకు ఫలితాన్నిచ్చినా ఎంతో సంతృప్తి కలుగుతుంది. కొంత సాధించినా, మిగతాది కూడా సాధించగలనన్న ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. తాత్కాలిక అంతరాయాలు ఎదురైనా కొంత విరామం తర్వాత తిరిగి కొనసాగే ఆత్మస్థైర్యం అలవడుతుంది

డైరీ రాయడం ఎంతో మేలు

ప్రతి రోజూ భిన్నమైనదే! ఊహించని సంఘటనలు, ఊహకందని అనుభవాలు ప్రతిరోజూ ఎదురవుతూ ఉంటాయి. భిన్నమైన కార్యకలాపాల్లో ఒక్కోసారి ఎటు వెళుతున్నామో అర్థం కాదు. దాంతో ఒక్కోసారి మనసు ఒక ఉధృతమైన ప్రవాహంలో కొట్టుకుపోతున్న నావలా మారుతుంది. ఈ దశలో తప్పులు జరిగే అవకాశాలు కూడా ఎక్కువే! అయితే, డైరీ రాయడం ద్వారా ఏరోజుకారోజు ఒక సమీక్ష జరుగుతుంది. పరిస్థితులను విశ్లేషించుకోగలిగే వెసులుబాటు చిక్కుతుంది. పునరాలోచించుకునే తీరుబడి కూడా దొరుకుతుంది. కాబట్టి ఎప్పటికప్పుడు జరుగుతున్న తప్పిదం నుంచి బయటపడే అవకాశాలు పెరుగుతాయి. డైరీ రాయడం ద్వారా తృటిలో తప్పిన అలాంటి పూర్వ ప్రమాదాలను తలుచుకున్నప్పుడు కొండంత తృప్తి కలుగుతుంది.

ఒత్తిడిని స్వీకరించాలి

ఏ పనినైనా ఒక పర్‌ఫెక్షన్‌తో చేయాలనుకున్నప్పుడు ఒత్తిడి ఉంటుంది. ఆ ఒత్తిడే లేకపోతే అంతిమ ఫలితం అపురూపంగా ఉండకపోవచ్చు.అయితే మనం ఇష్టంగా చేసే పని ఎంత బరువైనదైనా అది మానసిక ఒత్తిడిని కలిగించదు. అయిష్టంగా చేసేవే ఒత్తిడికి, అసహనానికీ గురిచేస్తాయి ఒక దశలో వాటి నుంచి దూరంగా పారిపోయేలా కూడా చేస్తాయి. కాబట్టి చేస్తున్న పని పట్ల ఆసక్తి, మక్కువ పెంచుకోవడం అవసరం. చేసే పనిలో నైపుణ్యం పెరిగే కొద్దీ ఒత్తిడి చాలా వరకు తగ్గుతుంది. అందువల్ల వృత్తి పరమైన నైపుణ్యాన్ని నిత్యం పెంచుకోవడం ద్వారా అన్ని ఒత్తిడులనూ అధిగమించవచ్చు.

కుటుంబ బంధాలు ఎంతో ముఖ్యం

రోజువారీ ఉద్యోగ, వ్యాపారాల ఒత్తిడిలో చాలా మంది కుటుంబ విషయాల పట్ల నిర్లక్ష్యంగా ఉండిపోతారు. దీని వల్ల కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు బలహీనపడతాయి. బయట ఎన్ని శిఖరాలు అధిరోహించినా కుటుంబ సభ్యులతో ఆత్మీయ బంధం లేకపోతే, అది గుండె బరువును కచ్చితంగా పెంచుతుంది. అందువల్ల వృత్తిపరంగా ఎంత ఒత్తిడిలో ఉన్నా, కటుంబ సభ్యులకు ప్రాధాన్యం ఇవ్వాలి. వాళ్లతో కలిసి గడిపే సమయం నాణ్యంగా ఉండేలా చూసుకోవాలి. తీరుబడి చేసుకుని సరదాలు, షికార్లకు కలిసి వెళ్తూ ఉండాలి.



జోష్‌లో భారత్

రెండో టీ20 నేడు

హార్దిక్ ఫామ్‌తో హుషారు ● ఒత్తిడిలో గిల్ ● సమంపై సఫారీల గురి



ముల్లన్‌పూర్ (న్యూ చండీగఢ్): టీ20 సిరీస్‌ను అదిరే విజయంతో ఆరంభించిన భారత్.. అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం దక్షిణాఫ్రికాతో జరిగే రెండో టీ20లోనూ గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. కటక్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో టీమిండియా అదరగొట్టినా.. ఓపెనర్ శుభమన్ గిల్ వైఫల్యం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గాయంతో వన్డే సిరీస్‌కు దూరమైన అతడు తగిన విశ్రాంతి తర్వాత బరిలోకి దిగినా.. స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. ముఖ్యంగా అభిషేక్ శర్మకు అతడు ఏమాత్రం సరితూగడం లేదు. గిల్ రాకతో సంజూ శాంసన్‌కు తుది జట్టులో చోటు కష్టమవుతుండడం కూడా అతడిపై ఒత్తిడికి కారణమవుతోంది. తొలి మ్యాచ్‌లో విఫలమైన జితేష్ శర్మకు బదులుగా సంజూ శాంసన్‌ను తీసుకోవాలని సోషల్‌మీడియాలో చర్చ మొదలైంది. కీపర్ బెర్త్ కోసం వీరిద్దరి మధ్య తీవ్రమైన పోటీ ఏర్పడింది. ఇక, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌పై కూడా ఆందోళన నెలకొంది. పొట్టి వరల్డ్‌కప్ నేపథ్యంలో సూర్య తన మునుపటి విధ్వంసకర బ్యాటింగ్ కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. అయితే, గాయం నుంచి కోలుకొన్న హార్దిక్ పాండ్యా ఆడిన తొలి మ్యాచ్‌లోనే అజేయ అర్ధ శతకంతో అదరగొట్టాడు. అతడి నుంచి జట్టు ఇదే తరహా ఇన్నింగ్స్‌ను జట్టు ఆశిస్తోంది. అయితే, బ్యాటింగ్ డెప్త్ కావాలనుకొంటే అర్ష్‌దీప్ స్థానంలో హర్షిత్ రాణాను తీసుకొనే చాన్సులున్నాయి. ఒకవేళ పిచ్ పొడిగా ఉంటే మాత్రం జట్టులో ఎటువంటి మార్పులూ ఉండే అవకాశం లేదు. మరోవైపు దక్షిణాఫ్రికా బలంగా పుంజుకోవాలనుకొంటోంది. బ్రెవిస్ మినహా మిగతా బ్యాటర్లు విఫలం కావడం జట్టును కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో బలమైన బ్యాటింగ్ లైనప్ కోసం సిపామ్లా స్థానంలో ఆల్‌రౌండర్ కోర్బిన్ బాష్‌కు చాన్స్ దక్కొచ్చు.

ఈ మ్యాచ్ సందర్భంగా పంజాబ్ క్రికెటర్లు యువరాజ్ సింగ్, హర్మన్‌ప్రీత్ కౌర్ పేరిట ఏర్పాటు చేసిన స్టాండ్‌ల ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది.

రాత్రి 7గం. నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



ట్రిస్టన్ స్టబ్స్

జట్లు (అంచనా)

భారత్: అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్య కుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, జితేష్ శర్మ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్/రాణా, వరుణ్ చక్రవర్తి, బుమ్రా.

దక్షిణాఫ్రికా: డికాక్, మార్‌క్రమ్ (కెప్టెన్), ట్రిస్టన్ స్టబ్స్, బ్రెవిస్, డేవిడ్ మిల్లర్, డోనోవాన్ ఫెరీరా, యాన్సెన్, సిపామ్లా/బాష్, కేశవ్, ఎన్‌గిడి, నోకియా.

పిచ్/వాతావరణం

ఈ స్టేడియంలో ఇదే తొలి పురుషుల అంతర్జాతీయ టీ20 మ్యాచ్. గత సెప్టెంబరులో రెండు మహిళల వన్డేలు జరిగాయి. పేసర్లకు పిచ్ నుంచి సహకారం అందే చాన్సులున్నాయి. ఐపీఎల్ మ్యాచ్‌ల్లో వికెట్ బ్యాటింగ్‌కు అంతగా అనుకూలంగా కనిపించలేదు. తొలుత బ్యాటింగ్ తీసుకొని 200 పైగా స్కోరు చేస్తే గెలుపు ఖాయమే. మంచు ప్రభావం అంతగా ఉండకపోవచ్చు.



భారత కుర్రాళ్లకు కాంస్యం

- అర్జెంటీనాపై విజయం
- జూనియర్ హాకీ విజేత జర్మనీ

చెన్నై: సొంతగడ్డపై జరిగిన జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో ఫైనల్ చేరడంలో విఫలమైన భారత యువ జట్టు కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. బుధవారం జరిగిన మూడో స్థానం పోరులో భారత్ 4-2తో అర్జెంటీనాను చిత్తుచేసి కంచు మోత మోగించింది. అంకిత్ పాల్ (49వ నిమిషంలో), మన్మీత్ సింగ్ (52వ), శారదానంద తివారి (57వ), అన్మోల్ ఎక్కా (58వ) తలో గోల్ సాధించారు. అర్జెంటీనా తరపున రోడ్రిగెజ్ (3వ), ఫెర్నాండెజ్ (44వ) చెరో గోల్ కొట్టారు. కాగా.. 2016లో ఈ టోర్నీ విజేతగా నిలిచిన యువ భారత్.. గత రెండు సార్లు పోడియం ఫినిష్ కూడా చేయలేకపోయింది. ఇక జర్మనీ జట్టు ప్రపంచ విజేతగా నిలిచింది. ఫైనల్లో జర్మనీ పెనాల్టీ షూటౌట్‌లో 3-2తో స్పెయిన్‌ను ఓడించి 8వసారి ట్రోఫీ గెల్చుకుంది.

వెస్టిండీస్ 205 ఆలౌట్

- కివీస్‌తో రెండో టెస్టు
- గాయంతో కుప్పకూలిన టిక్నర్

వెల్లింగ్టన్: ఆతిథ్య న్యూజిలాండ్ పేసర్లు బెయిర్ టిక్నర్ (4/32), మైకేల్ రే (3/65) విజృంభించడంతో బుధవారం మొదలైన రెండో టెస్టులో వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 205 పరుగులకే కుప్పకూలింది. షాయ్ హోప్ (48), క్యాంప్‌బెల్ (44), బ్రాండన్ కింగ్ (33) రాణించారు. అనంతరం కివీస్.. తొలి రోజు ఆట ముగిసేసరికి 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 24 పరుగులు చేసింది.



టిక్నర్ (4/32)

అయ్యో..టిక్నర్



పునరాగమనంలో తన తొలి టెస్టులో అద్భుత గణాంకాలతో ఆకట్టుకున్న పేసర్ టిక్నర్‌కు ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఫీల్డింగ్ చేస్తుండగా బంతి తగిలి తీవ్రగాయంతో టిక్నర్ మైదానాన్ని వీడడం కివీస్ శిబిరంలో ఆందోళన రేకెత్తించింది. విండీస్ ఇన్నింగ్స్ 66వ ఓవర్లో మైకేల్ రే బౌలింగ్‌లో బ్యాటర్ టెవిన్ ఇమ్లాచ్ ఫైన్ లెగ్ దిశగా బంతిని గాల్లోకి లేపాడు. ఫీల్డర్ టిక్నర్ బంతిని ఆపే క్రమంలో పల్టీ కొట్టాడు. ఈ క్రమంలో తన ఎడమ భుజంపై మొత్తం భారం పడడంతో టిక్నర్ నొప్పితో విలవిల్లాడుతూ మైదానంలోనే కుప్పకూలాడు. దీంతో ఫిజియో వచ్చి టిక్నర్‌ను మైదానం బయటకు తీసుకురాగా, అటునుంచి అటే అతడిని ఆసుపత్రికి తరలించారు. టిక్నర్ ఎడమ భుజం పూర్తిగా విరిగిందని చెబుతున్నారు.

కష్టాల మీద కష్టాలు...: 2023 మార్చి తర్వాత ఇప్పుడే మళ్లీ టెస్టు ఆడుతున్న 32 ఏళ్ల టిక్నర్‌కు కెరీర్‌లో ఒకదాని వెంట ఒకటి కష్టాలు వచ్చి పడుతూనే ఉన్నాయి. 2023లో తన తొలి టెస్టు ఆడేకంటే ముందు టిక్నర్ తండ్రి ఇల్లు తుఫాన్‌లో కొట్టుకుపోయింది. 2024లో కౌంటీల్లో డెర్బీషైర్ జట్టుకు ఆడుతున్నప్పుడు గర్భవతిగా ఉన్న టిక్నర్ భార్యకు క్యాన్సర్ నిర్ధారణ అయింది. ఇప్పుడేమో ఇలా తీవ్రమైన గాయంతో అతను కొన్నాళ్లపాటు క్రికెట్ ఆడలేని పరిస్థితి ఏర్పడింది. ఇలా.. టిక్నర్ కెరీర్‌లో అన్నీ విషాదఘట్టాలే.

కోచ్‌పై క్రికెటర్ల దాడి



తీవ్ర గాయాలు ● పుదుచ్చేరిలో ఘటన

పుదుచ్చేరి: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నీకి తమను ఎంపిక చేయలేదన్న కోపంతో పుదుచ్చేరి అండర్-19 జట్టు ప్రధాన కోచ్ వెంకటరామన్‌పై ముగ్గురు స్థానిక క్రికెటర్లు అమానుషంగా దాడి చేశారు. ఈ దాడిలో కోచ్ నుదుటిపై 20 కుట్లు పడ్డాయి. భుజం విరిగింది. వెంకటరామన్ చేసిన ఫిర్యాదుపై సీనియర్ క్రికెటర్ కార్తికేయన్, అరవింద రాజ్, సంతోష్ కుమరన్‌పై ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసి..వారి కోసం గాలింపు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

పారా షూటింగ్‌లో ఏపీకి స్వర్ణం



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాయల సత్య జనార్దన శ్రీధర్ జాతీయ పారా షూటింగ్‌లో స్వర్ణం సాధించాడు. ఇక్కడి షూటింగ్ రేంజ్‌లో జరిగిన 50 మీటర్ల ఈవెంట్‌లో సత్య జనార్ధన్ 609.4 పాయింట్లతో పసిడి అందుకున్నాడు. కాగా తెలంగాణకు చెందిన బానోత్ పావని 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్లలో 3 రజతాలు సాధించింది.

రోహిత్ 1.. విరాట్ 2

వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్: టీమిం డియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో మరింత ముందు కెళ్లాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలతో సత్తాచాటిన 37 ఏళ్ల విరాట్.. బుధవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో రెండుస్థానాలు ఎగబాకాడు. ఈ క్రమంలో నాలుగు నుంచి రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. 773 పాయింట్లతో కోహ్లీ.. నెంబర్‌వన్ బ్యాటర్ రోహిత్ శర్మ (781)కు చేరువగా ఉన్నాడు. గిల్ ఐదో స్థానంలో ఉండగా, కేఎల్ రాహుల్ రెండుస్థానాలు మెరుగై 12వ ర్యాంక్‌లో నిలిచాడు. బౌలర్ల జాబితాలో కుల్దీప్ యాదవ్ మూడుస్థానాలు ఎగబాకి 3వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

మెస్సీనా..మజాకా!

స్టార్‌తో ఫొటో దిగాలంటే రూ.12 లక్షలు





2 రోజుల్లో.. హైదరాబాద్‌కు

ఫుట్‌బాల్ సూపర్ స్టార్ లియోనెల్ మెస్సీ భారత్ రానుండడం.. ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం.. అందులోనూ అతను హైదరాబాద్‌లో అడుగుపెట్టనుండడం.. ఇక్కడ సీఎం రేవంత్ రెడ్డితో పాటు సెలెబ్రిటీలంతా సాకర్ దిగ్గజంతో కలిసి మైదానంలో కాలు కదపనుండడం.. తారలతో కలిసి మ్యాచ్‌లు, సంగీత కచేరీలు, సత్కార వేడుక, ఫుట్‌బాల్ క్లినిక్‌లు.. ఇలా మెస్సీ పర్యటన షెడ్యూల్ ఆద్యంతం అత్యంత ఆకర్షణీయంగా మారనుంది. ఆ సాకర్ మాంత్రికుడి మెరుపులను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులంతా ఇప్పుడు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. శనివారం ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగే మెస్సీ ఎగ్జిబిషన్ మ్యాచ్‌కోసం ఇప్పటికే టిక్కెట్లన్నీ దాదాపు అమ్ముడయ్యాయన్నది నిర్వాహకుల మాట. మెస్సీ ఆటను దగ్గరుండి చూడడమే గాకుండా అతడిని స్వయంగా కలిసి ఫొటోలు దిగే అవకాశం కూడా అభిమానులకు ఉంది. అయితే, అందుకు భారీగా వెచ్చించాల్సి ఉంటుంది.

మీట్ అండ్ గ్రీట్..

మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం కింద అభిమానులతో మెస్సీ ముచ్చటించే కార్యక్రమాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకుగాను ఒక్కో అభిమానికి రూ. 9.95 లక్షలుగా ధర నిర్ణయించారు. దీనికి జీఎస్టీ అదనం. అంటే.. మెస్సీతో ఫొటో దిగాలంటే దాదాపు రూ. 12 లక్షల దాకా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫొటోతో పాటు మెస్సీ సంతకం చేసిన అర్జెంటీనా జట్టు జెర్సీని కూడా అందజేస్తారు.

నా హీరో...

హార్దిక్‌పై గర్ల్‌ఫ్రెండ్ ప్రశంసలు

ముంబై: ఆసియా కప్ సందర్భంగా గాయపడి సుదీర్ఘ కాలం ఆటకు దూరంగా ఉండి జట్టులోకి పునరాగమనం చేసిన హార్దిక్ పాండ్యా దక్షిణాఫ్రికాతో తొలి టీ20లో అదరగొట్టాడు. టీమిండియా 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన మ్యాచ్‌లో హార్దిక్ బ్యాటుతో, బంతితో కీలక భూమిక పోషించాడు. ఈ నేపథ్యంలో హార్దిక్ గర్ల్‌ఫ్రెండ్, మోడల్ మహిక శర్మ అతడి ప్రదర్శనపై ప్రశంసల జల్లు కురిపించింది. 'అతడు కింగ్. నా హీరో. ఎవరు తిరిగొచ్చారో ఊహించండి' అని ఇన్‌స్టాలో ఆమె పోస్ట్ చేసింది.





కియా సెల్టోస్ సరికొత్తగా..

నేటి నుంచి బుకింగ్స్ ప్రారంభం

హైదరాబాద్: కియా ఇండియా ప్రముఖ ఎస్‌యూవీ మోడల్ సెల్టోస్‌ను సరికొత్త రూపంలో బుధవారం హైదరాబాద్ వేదికగా ఆవిష్కరించింది. ఈ కొత్త కారు బుకింగ్స్ దేశవ్యాప్తంగా గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు సంస్థ వెల్లడించింది. రూ.25,000 చెల్లించి ఈ కారును బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. దీని ధరను 2026 జనవరి 2న ప్రకటించనున్నట్లు తెలిపింది.

వెండి కిలో రూ.1.92 లక్షలు

ఈ ఏడాదిలో ఇప్పటివరకు 114% అప్

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్‌లో ర్యాలీ కొనసాగుతోంది. బుధవారం ఒక్క రోజే ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర రూ.11,500 పెరిగి రూ.1.92 లక్షలకు చేరింది. ఇది సరికొత్త రికార్డు. గత రెండు నెలల్లో కిలో వెండి ధర ఒకే రోజు ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు దేశీయ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,02,300 (114.04%) పెరిగి మదుపరులకు బంపర్ లాభాలు పంచింది. గత ఏడాది డిసెంబరు 31న ఢిల్లీలో కిలో వెండి ధర రూ.89,700 వద్ద ట్రేడైంది.

అరోరియల్టీ చేతికి తాజ్ బంజారా

డీల్ విలువ రూ.315 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక అరబిందో గ్రూప్ రియల్టీ కంపెనీ అరో రియల్టీ, హైదరాబాద్‌లో మరో విలువైన స్థిరాస్తిని కొనుగోలు చేసింది. హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని తాజ్ బంజారా స్టార్ హోటల్‌ను రూ.315 కోట్లకు దక్కించు కుంది. మొత్తం 16,645 చదరపు గజాల్లో 1.2 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాలో ఈ స్టార్ హోటల్ ఉంది. జీహెచ్‌ఎంసీకి పన్నులు చెల్లించక పోవడంతో కొద్ది కాలంగా ఈ స్టార్ హోటల్ మూతపడి ఉంది. అరో రియల్టీ తాజ్ బంజారా హోటల్‌ను రినొవేట్ చేసి స్టార్ హోటల్‌గా కొనసాగిస్తుందా లేక రియల్టీ వెంచర్‌గా మారుస్తుందా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.

పెరగనున్న మొబైల్ ఛార్జీలు!

న్యూఢిల్లీ: కొత్త సంవత్సరం మొబైల్ టెలికం సేవల ఛార్జీలు మరింత ప్రియం కానున్నాయి. వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ ఇప్పటికే ప్రీపెయిడ్ ప్లాన్ల ధరలు పెంచేశాయి. వొడాఫోన్ ఐడియా ఏడాది ప్రీపెయిడ్ ప్లాన్ ధరను రూ.1,999 నుంచి 12%, 84 రోజులు చెల్లుబాటయ్యే ప్లాన్ ధరను ఏడు శాతం పెంచింది. ఎయిర్‌టెల్ కూడా రూ.189 ప్రీ పెయిడ్ ప్లాన్ ధరను రూ.10 పెంచింది. ప్రభుత్వ రంగంలోని బీఎస్‌ఎన్‌ఎల్ మాత్రం ధరలు పెంచకుండా, ప్లాన్ చెల్లుబాటయ్యే రోజులను తగ్గించింది. రిలయన్స్ జియో వచ్చే ఏడాది ప్రారంభం నుంచి అదనపు వడ్డింపులు చేస్తుందని భావిస్తున్నారు.

కోస్టల్ క్లౌడ్‌ను కొనుగోలు చేసిన టీసీఎస్

ముంబై: అమెరికాకు చెందిన కోస్టల్ క్లౌడ్‌ను 70 కోట్ల డాలర్లకు (సుమారు రూ.6,300 కోట్లు) కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు టీసీఎస్ బుధవారం ప్రకటించింది. పూర్తిగా నగదు రూపంలో జరగనున్న ఈ డీల్ ద్వారా టీసీఎస్ ప్రపంచంలోని టాప్-5 సేల్స్‌ఫోర్స్ అడ్వైజరీ అండ్ కన్సల్టింగ్ కంపెనీగా అవతరించనుంది.

2030 నాటికి అమెజాన్ ఇండియా

రూ.3.15 లక్షల కోట్ల పెట్టుబడులు

10 లక్షల ఉద్యోగాల కల్పనకు దోహదం



న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్‌లో అమెరికన్ టెక్నాలజీ దిగ్గజ కంపెనీలు పోటాపోటీగా పెట్టుబడులు గుమ్మరిస్తున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్ ఇప్పటికే భారీ పెట్టుబడులను ప్రకటించగా.. తాజాగా అమెజాన్ కూడా వీటి సరసన చేరింది. భారత మార్కెట్లో క్విక్ కామర్స్, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ) వ్యాపారాల విస్తరణ కోసం వచ్చే ఐదేళ్లలో మరో 3,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.15 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు అమెజాన్ బుధవారం ప్రకటించింది.

వచ్చే ఐదేళ్లలో 8,000 కోట్ల డాలర్లకు ఎగుమతులు: ఈ పెట్టుబడులు వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాల కల్పనకు దోహదపడగలవని ఢిల్లీలో నిర్వహించిన సంభవ్ సమ్మిట్‌లో పేర్కొంది. భారత్ నుంచి కంపెనీ ఎగుమతులను ప్రస్తుత 2,000 కోట్ల డాలర్ల స్థాయి నుంచి 8,000 కోట్ల డాలర్లకు పెంచేందుకు, 15 లక్షల మంది చిన్న వ్యాపారులు, కోట్లాది దుకాణాలకు ఏఐ ప్రయోజనాలు అందించేందుకు, 40 లక్షల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ శిక్షణ అందించేందుకు ఈ పెట్టుబడులు ఉపయోగపడనున్నాయంటోంది.

దిగ్గజ త్రయం ఇన్వెస్ట్‌మెంట్లు 6,750 కోట్ల డాలర్లు

అమెజాన్‌తోపాటు మైక్రోసాఫ్ట్, గూగుల్ ప్రకటించిన మొత్తం పెట్టుబడులు 6,750 కోట్ల డాలర్లకు చేరాయి. మైక్రోసాఫ్ట్ మంగళవారం 1,750 కోట్ల డాలర్లు (రూ.1.58 లక్షల కోట్లు), విశాఖపట్నంలో ఒక గిగావాట్ సామర్థ్యంతో ప్రపంచ స్థాయి ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు కోసం 1,500 కోట్ల డాలర్లు (రూ.87,520 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు గూగుల్ ఈ అక్టోబరు 14న ప్రకటించింది. అమెరికా వెలుపల గూగుల్‌కు ఇదే అతిపెద్ద పెట్టుబడి.

ఇప్పటికే 4,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు : భారత మార్కెట్లో అమెజాన్ 2010 నుంచి ఇప్పటి వరకు 4,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టింది. 2023లో 2,600 కోట్ల డాలర్ల పెట్టుబడులను ప్రకటించింది. కీస్టోన్ రిపోర్టు ప్రకారం.. భారత్‌లో అమెజానే అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారు అని కంపెనీ వర్ధమాన మార్కెట్ల అధిపతి అమిత్ అగర్వాల్ అన్నారు.

ఏఐ రేసులో వినియోగ దేశాలే విజేతలు



మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల

న్యూఢిల్లీ: ప్రపంచ కృత్రిమ మేధ (ఏఐ) రేసులో సాంకేతికతను సృష్టించే దేశాల కంటే దాని వినియోగంలో ముందుండే దేశాలే విజేతలవుతాయని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. "ఆధునిక టెక్నాలజీని ఆవిష్కరించిన దేశాలు, కంపెనీలు, సమాజాలకు బదులు దాన్ని వేగంగా స్వీకరించి తరువాత తరం ఆవిష్కరణలు చేపట్టిన దేశాలే విజయం సాధించాయని గత సాంకేతికత విప్లవాలను అధ్యయనం చేసిన వారు గుర్తించారు" అని నీతి ఆయోగ్‌కు చెందిన దేవయానీ ఘోష్‌తో జరిగిన ఫైర్‌సైడ్ చాట్‌లో పేర్కొన్నారు. భారత్ కీలకమైన దశలో ఉందని.. ఏఐ టెక్నాలజీ వేగవంత వినియోగం ప్రజలతో పాటు సంస్థలకు గణనీయ ఫలితాలు అందించగలదన్నారు. వచ్చే ఐదేళ్లలో భారత్ 5.75 కోట్ల డెవలపర్లతో ప్రపంచంలో అతిపెద్ద డెవలపర్ కమ్యూనిటీగా అవతరించనుందని నాదెళ్ల అన్నారు. వచ్చే ఏడాది ప్రథమార్థం చివరికల్లా హైదరాబాద్‌లోనూ క్లౌడ్ రీజియన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా కేంద్ర కార్మిక శాఖ బుధవారం మైక్రోసాఫ్ట్‌లో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

ఊబకాయానికి సిప్లా ఔషధం

న్యూఢిల్లీ: దేశంలో పలువురి వేధిస్తున్న ఊబకాయం, టైప్ 2 మధుమేహ మెల్లిటస్ వ్యాధులకు ఔషధాన్ని విడుదల చేసినట్టు సిప్లా ప్రకటించింది. యుర్‌పీక్ (టిర్జెపెటైడ్) పేరిట విడుదల చేసిన ఈ ఔషధాన్ని వారానికి ఒకసారి ఇంజెక్షన్ రూపంలో తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ఎలీ లిల్లీకి చెందిన ఈ ఔషధానికి డీజీసీఐ అనుమతి లభించడంతో దీన్ని ప్రచారం చేసి, పంపిణీ చేసే హక్కులు తాము పొందినట్టు తెలియచేసింది.

రూ.8 లక్షల కోట్లు ఆవిరి

మార్కెట్లో ఆగని కరెక్షన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో కరెక్షన్ కొనసాగుతోంది. బుధవారం నాడు కూడా కీలక సూచీలు నేల చూపులు చూశాయి. అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ 275.01 పాయింట్ల నష్టంతో 84,391.27 వద్ద ముగియగా నిఫ్టీ 81.65 పాయింట్ల నష్టంతో 25,758 వద్ద ముగిసింది. గత నెల 11 తర్వాత సెన్సెక్స్, నిఫ్టీ ఇంత కనిష్ఠ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. ఈ మూడు రోజుల కరెక్షన్‌లో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ దాదాపు రూ.8 లక్షల కోట్లు తుడిచి పెట్టుకుపోయింది. ఎడతెగని ఎఫ్‌పీఐ అమ్మకాలు, డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కొనసాగుతున్న అనిశ్చితి ప్రస్తుత కరెక్షన్‌కు కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవడం సైతం దేశీయ మార్కెట్‌లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. వడ్డీరేట్లపై బుధవారం రాత్రి వెలువడే అమెరికన్ ఫెడ్ నిర్ణయం, భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంపై వెలువడే అధికారిక ప్రకటన వచ్చే కొద్ది రోజుల్లో మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ సంస్థ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

వచ్చే ఏడాది నిఫ్టీ టార్గెట్ 29,120 పాయింట్లు: కోటక్

ప్రస్తుతం ఆటుపోట్లు ఎదుర్కొంటున్నా వచ్చే ఏడాది మార్కెట్ మదుపరులకు మంచి లాభాలే పంచుతుందని ప్రముఖ బ్రోకరేజి సంస్థ కోటక్ సెక్యూరిటీస్ తెలిపింది. నిఫ్టీ కూడా వచ్చే ఏడాది చివరికల్లా 29,120 పాయింట్లకు చేరే అవకాశం ఉందని ఆ సంస్థ ఎండీ, సీఈఓ శ్రీపాల్ షా చెప్పారు. కంపెనీల ఆదాయాలు 17% వరకు పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదం చేయనుందన్నారు. భారత స్టాక్ మార్కెట్‌లో గాలి బుడగలు ఏర్పడుతున్నాయన్న వార్తలను షా తోసిపుచ్చారు. ఎఫ్‌పీఐలు కూడా వచ్చే ఏడాది కొనుగోళ్లకు దిగే అవకాశం ఉందన్నారు.

బిజినెస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,310 ▲	1,19,450 ▲	2,07,000 ▲
విజయవాడ	1,32,000 ▲	1,23,000 ▲	1,89,000 ▲
విశాఖపట్నం	1,31,860 ▼	1,19,250 ▼	2,07,000 ▲
రాజమండ్రి	1,30,310 ▲	1,15,450 ▼	1,82,000 ▼
ప్రొద్దుటూరు	1,27,800 ▲	1,17,580 ▲	1,83,000 ▲
ముంబై	1,27,790 ▼	1,17,050 ▼	1,85,490 ▲


ఈ ఏడాది వృద్ధి 7.2% : ఏడీబీ

న్యూఢిల్లీ: ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) కూడా భారత జీడీపీ వృద్ధిరేటు అంచనాలను భారీగా పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధిరేటు 6.5% ఉండొచ్చునంటూ గతంలో చేసిన అంచనాలను ఇప్పుడు 7.2 శాతానికి పెంచింది. జోరు మీద ఉన్న దేశీయ వినియోగం, ఇటీవలి జీఎస్‌టీ రేట్ల తగ్గింపు జీడీపీ వృద్ధిరేటును పెంచబోతున్నట్టు పేర్కొంది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరానికి వృద్ధిరేటు అంచనాలను మాత్రం 6.5% వద్దే కొనసాగించింది. భారత వృద్ధిరేటు ఊపందుకోవడం తో ఈ సంవత్సరం ఆసియా దేశాల సగటు వృద్ధిరేటు అంచనాలను సైతం ఏడీబీ 4.8% నుంచి 5.1 శాతానికి పెంచింది.

ఏడాది లోగా ఎస్‌బీఐ ఎంఎఫ్ ఐపీఓ

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఐపీఓ ఏడాది లోగా ఉంటుందని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. ఇందుకోసం మర్చంట్ బ్యాంకర్లు, ఇతర సర్వీస్ ప్రొవైడర్ల ఎంపిక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎస్‌బీఐ ఎఫ్‌ఎంఎల్) పేరుతో ఎస్‌బీఐ, మ్యూచువల్ ఫండ్స్ బిజినెస్‌లో ఉంది. ఈ జయింట్ వెంచర్ కంపెనీ ఈక్విటీలో ఎస్‌బీఐకి 61.98%, ఫ్రాన్స్ కంపెనీ అముండికి సంస్థకు 36.40% వాటాలున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	650
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	120
వరంగల్	119	గుంటూరు	125
కరీంనగర్	119	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	127
కర్నూలు	119	నెల్లూరు	132
విశాఖపట్నం	121	అనంతపురం	132
గోదావరి	120		

గాయని సాధ్యకు సీఎం ప్రశంస



అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వేదికలపై చిన్నతనంలోనే శ్రావ్యంగా పాటలు పాడుతూ పేరు తెచ్చుకున్న గాయని సాధ్యను సీఎం చంద్రబాబు ప్రశంసించారు. గుంటూరు జిల్లా కొండపాటూరుకు చెందిన సాధ్య తల్లిదండ్రులు స్వైరా, సిరికృష్ణతో కలసి బుధవారం సీఎంను కలిశారు. యార్క్, హార్వర్డ్ యూనివర్సిటీ, శాన్‌ఫ్రాన్సిస్కో ఓపెరా హౌస్ వంటి పలు అంతర్జాతీయ వేదికలపై పాడిన సాధ్య 7 సార్లు ప్రథమ స్థానంలో నిలిచిందని ఆమె తల్లిదండ్రులు సీఎంకి వివరించారు. సాధ్య మరిన్ని విజయాలను సాధించాలని సీఎం ఆకాంక్షించారు.

చంద్రబాబు దార్శనికతతో ఏపీలో నాణ్యమైన విద్య

▸▸ రాజ్యసభలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



న్యూఢిల్లీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో ఏపీలో నాణ్యమైన విద్యావిధానాలు అమలవుతున్నాయని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కొనియాడారు. ఏపీలో నాణ్యమైన విద్యావ్యవస్థను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నెలకొల్పుతున్నారన్నారు. బుధవారం రాజ్యసభలో టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 'సీఎస్ఆర్ నిధులను వినియోగించడంలో ఏపీ అమలు చేస్తున్న విధానాలు ప్రశంసనీయం. ఏపీ మోడల్ దేశానికి ఆదర్శం. కావాలంటే ఏ రాష్ట్రమైనా ఇలాంటి విధానాన్ని తమ అవసరాలకు అనుగుణంగా అమలు చేసుకోవచ్చు. ఏపీలో సీఎస్ఆర్ నిధులతో పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నారు' అని మంత్రి తెలిపారు.

ఆంధ్రలో 46 వేల కోట్లతో జాతీయ రహదారులు

▸▸ 2027 నాటికి మొత్తం 92 ప్రాజెక్టులూ పూర్తి: గడ్కరీ



న్యూఢిల్లీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీలో రూ.46,946 కోట్లతో 92 జాతీయ రహదారుల ప్రాజెక్టు పనులను చేపట్టినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రాజ్యసభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకుసమాధానమిస్తూ... 2,090 కిలోమీటర్ల మేర మొత్తం 92 ప్రాజెక్టులను చేపట్టాం. ఇప్పటివరకు 1,157 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయింది. రూ.46,946 కోట్లకు గానూ రూ.21,382 కోట్లు ఖర్చు చేశాం. ప్రస్తుతం చేపట్టిన 92 ప్రాజెక్టులను 2027 నాటికి పూర్తి చేస్తాం' అని గడ్కరీ తెలిపారు.

ప్రైవేటీకరణ పేరుతో ప్రజల్లో భయాందోళనలు

▸▸ వైద్య కళాశాలలపై తప్పుడు ప్రచారం: టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం, అమ్మడం, యాజమాన్యం బదిలీ చేయడం వంటి చర్యలు ఎక్కడా లేవు. ప్రైవేటీకరణ అనే పదాన్ని ఉపయోగించి ప్రజల్లో భయాందోళనలు రేపడం పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే' అని టీడీపీ ఎంపీలు సానా సతీశ్, బీద మస్తాన్‌రావు వివరించారు. ఏపీలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై తప్పుదోవ పట్టించేలా జరుగుతున్న ప్రచారంపై స్పష్టత ఇవ్వడానికి వారు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను బుధవారం కలసి వివరాలను అందజేశారు. "ఏపీలో గత ప్రభుత్వం ప్రకటించిన 16 మెడికల్ కాలేజీలలో అనేక చోట్ల భూమి స్వాధీనం, డీపీఆర్‌లు, టెండర్లు, నిధుల విడుదల పూర్తి కాలేదని, ఈ పరిస్థితుల్లో పీపీపీ మోడల్‌ను సీఎం చంద్రబాబు వినియోగిస్తున్నారు. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని, అది కేవలం ఫ్యాకల్టీ నియామకం, మౌలిక వసతులు, ఆసుపత్రి పనులను వేగంగా పూర్తి చేయడానికి తీసుకునే సాంకేతిక, వ్యవస్థాపక సహాయం మాత్రమే. సాయం తీసుకోవడం, అధికారం ఇవ్వడం... రెండూ వేర్వేరు విషయాలు." అని వారు స్పష్టం చేశారు.

ఆ ప్రైవేటీకరణను అడ్డుకోండి: వైసీపీ

ఏపీలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వైసీపీ ఎంపీల బృందం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం న్యూఢిల్లీలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాశ్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, మిథున్ రెడ్డి, గురుమూర్తి, తనూజా రాణి, రఘునాథ్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డిలతో కూడిన వైసీపీ బృందం కేంద్ర మంత్రిని కలసి వినతిపత్రం అందజేసింది.

కూటమి పాలనలో పెట్టుబడుల వరద: కాల్వ



అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెట్టుబడిదారులకు నమ్మకం పెరిగిందని, పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవతో 18 నెలల్లోనే రూ.25 లక్షల కోట్లు పెట్టుబడులు, 26 లక్షల ఉద్యోగావకాశాలు రానున్నాయని తెలిపారు. జగన్ అసమర్థ పాలనలో 24కి పెరిగిన నిరుద్యోగిత శాతం నేడు 8.2 శాతానికి తగ్గిందని అన్నారు.

నేడు క్యాబినెట్ సమావేశం

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండలి సమావేశం గురువారం జరగనుంది. అమరావతి నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.7,380.70 కోట్ల రుణం తీసుకునేందుకు సీఆర్డీయేకు అనుమతి ఇవ్వనున్నారు. సీడ్ యాక్సిస్ రహదారిని 16వ జాతీయ రహదారికి అనుసంధానించే పనులకు రూ.532 కోట్ల మేర ఆమోదం తెలపనున్నారు. రూ.169 కోట్లతో నిర్మించనున్న లోక్‌భవన్ నిర్మాణ టెండర్లకు, రూ.163 కోట్లతో జ్యుడీషియల్ అకాడమీకి పరిపాలనా అనుమతులకు ఆమోదం తెలపనున్నారు. ఇటీవల ఎస్ఐపీబీలో ఆమోదం తెలిపిన రూ.20 వేల కోట్ల పెట్టుబడులకు, 56 వేల ఉద్యోగాల కల్పనకు క్యాబినెట్ ఆమోదం తెలపనుంది.

అందుబాటులో సరిపడా యూరియా


అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రబీ సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ తెలిపారు. రబీలో అన్ని పంటలకు అవసరమైన 9.38లక్షల టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళిక వేశామని బుధవారం వెల్లడించారు. అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు 3.93 లక్షల టన్నులు అవసరమైతే, ఇప్పటికే 4.78 లక్షల టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా లేదనే తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు.

పారా వెటర్నరీ చట్టాన్ని రద్దు చేయాలి

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చట్ట ప్రకారం వెటర్నరీ, వెటర్నేరియన్ అనే పదాలను రిజిస్టర్డ్ వెటర్నరీ గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉపయోగించాలని, నాన్-గ్రాడ్యుయేట్ సంఘాలు, సంస్థల పేర్లలో నుంచి ఈ పదాలను తక్షణమే తొలగించాలని ఏపీ వెటర్నరీ కౌన్సిల్ ఆదేశించింది. బుధవారం గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ సమావేశంలో వెటర్నరీ విద్య, వెటర్నరీ ప్రాక్టీస్‌పై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కౌన్సిల్ అధ్యక్షుడు పీవీ లక్ష్మయ్య వెల్లడించారు.

ఫోన్ మాట్లాడొద్దన్నాడని చంపేసింది!

▸▸ భర్తను గొడ్డలితో కొట్టిన భార్య



రాజారావు

చింతపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ అతిగా మాట్లాడొద్దని మందలించిన భర్తపై భార్య గొడ్డలితో దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన భర్త కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ మేడూరు గ్రామంలో కిల్లో రాజారావు (46), దేవి దంపతులు నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. దేవి రెండేళ్లుగా ఫోన్‌లో ఓ వ్యక్తితో మాట్లాడుతోంది. దీనిపై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం దేవి ఫోన్‌లో మాట్లాడుతుండడంతో రాజారావు ఆగ్రహానికి గురయ్యాడు. అదేపనిగా ఎందుకు మాట్లాడుతున్నావు?, ఆపేయమంటూ గద్దించాడు. ఆగ్రహానికి గురైన దేవి మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో నిద్రిస్తున్న భర్త తలపై గొడ్డలి వెనుక భాగంతో గట్టిగా కొట్టింది. దీంతో రాజారావు స్పృహ కోల్పోయాడు. పక్కన నిద్రిస్తున్న కుమారుడు లేచి చూసి చుట్టుపక్కల వారి సాయంతో 108 వాహనంలో రాజారావును చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మంగళవారం ఉదయం కేజీహెచ్‌కు తరలించగా.. రాజారావు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.

పరకామణిలో చోరీపై చట్టపరంగా చర్యలు



సీఐడీ, ఏసీబీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ వ్యవహారంలో చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని సీఐడీ, ఏసీబీ డీజీపీలను హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం చేస్తున్న దర్యాప్తులను కొనసాగించాలని.. కేసును సమర్థంగా విచారించేందుకు.. సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని నిర్దేశించింది. దర్యాప్తు వివరాలను అవసరమైన మేరకు ఐటీ, ఈడీతో పంచుకోవాలని స్పష్టంచేసింది. అప్పటి టీటీడీ ఏవీఎస్‌వో వై.సతీశ్‌కుమార్ పోస్టుమార్టం సర్టిఫికెట్ ప్రతిని మూడ్రోజుల్లో సీల్డ్ కవర్‌లో రిజిస్ట్రార్(జ్యుడీషియల్)కు అందజేయాలని సీఐడీని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. పరకామణిలో జరిగిన చోరీకి సంబంధించిన నమోదైన కేసును టీటీడీ బోర్డు తీర్మానం, ఈవో అనుమతి లేకుండానే 2023, సెప్టెంబరు 9న లోక్ అదాలత్ వద్ద ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్.. నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకున్న వ్యవహారంపై దర్యాప్తు చేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించడం.. చోరీకి పాల్పడిన రవికుమార్, ఆయన కుటుంబ సభ్యుల స్థిర-చరాస్తులు, బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పాటు.. వాటిని ఆదాయానికి తగినట్లే ఆర్జించారా అనే కోణంలో లోతైన దర్యాప్తు చేయాలని ఏసీబీని నిర్దేశించడం.. దర్యాప్తు చేసిన సీఐడీ, ఏసీబీ డీజీలు వేర్వేరుగా నివేదికలను సీల్డ్ కవర్‌లో కోర్టు ముందుంచడం.. సీఐడీ దాఖలు చేసిన అదనపు నివేదికను సైతం పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని న్యాయమూర్తి మంగళవారం ప్రకటించారు. బుధవారం వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా.. ఆ నివేదికలను పరిశీలించారు. అంతకుముందు ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపించారు. పరకామణి చోరీ కేసు మొత్తం దర్యాప్తును సీఐడీకి అప్పగిస్తే సబబుగా ఉంటుందన్నారు. ఒకే కేసును రెండు వేర్వేరు సంస్థలు దర్యాప్తు చేయడం వల్ల సమన్వయ లోపం తలెత్తే అవకాశం ఉందన్నారు. కేసు దర్యాప్తు మొత్తాన్ని సీఐడీకి అప్పగించేలా ఆదేశాలివ్వాలని కోరగా.. కోర్టు తోసిపుచ్చింది.

అంతా కలిసే చేశారు!

▸▸ తక్కువ ఖర్చుతో ఎక్కువ సంపాదించాలనే ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ

▸▸ జనార్దన్‌రావు పథకానికి జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి సరేనన్నారు

▸▸ జయచంద్రారెడ్డి చెప్పారనే ఫోన్లు ధ్వంసం

▸▸ ఎక్సైజ్ పోలీసులకు పీఏ రాజేశ్ వాంగ్మూలం

రాయచోటి/ములకలచెరువు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): "తక్కువ ఖర్చుతో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతోనే అద్దేపల్లి జనార్దన్‌రావు, జయచంద్రారెడ్డి, ఆయన బామ్మర్ది గిరిధర్‌రెడ్డి, కట్టా సురేంద్రనాయుడు.. అంతా కలిసే ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ, అమ్మకాలు చేశారు. ఈ విషయాలు తెలిసినా మౌనంగా ఉన్నా. నకిలీ మద్యం తయారీ కేంద్రంపై ఎక్సైజ్ పోలీసుల దాడి అనంతరం పరారీలో ఉన్న నేను జయచంద్రారెడ్డి సూచనల మేరకు రెండు ఫోన్లను ధ్వంసం చేశా" అని పార్టీ నుంచి సస్పెండైన తంబళ్లపల్లె టీడీపీ మాజీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్ ఎక్సైజ్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసుకు సంబంధించి జయచంద్రారెడ్డి పీఏ తిమ్మిరెడ్డిగారి రాజేశ్(ఏ5)ను అరెస్టు చేసిన పోలీసులు మంగళవారం రాత్రి తంబళ్లపల్లె కోర్టులో హాజరు పరిచగా 14 రోజులు రిమాండ్ విధించడంతో మదనపల్లె సబ్ జైలుకు తరలించారు. రాజేశ్ రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు ఉన్నాయి. పీటీఎం మండలం మల్లెల గ్రామానికి చెందిన రాజేశ్ బీఎస్సీ అగ్రికల్చర్ వరకు చదివాడు. గుడివాడలోని ఓ ప్రైవేటు కంపెనీలో కొంతకాలం పనిచేశాడు. తరువాత ఉద్యోగాన్ని వదిలేసి స్వగ్రామానికి వచ్చి ఏడాది పాటు ఖాళీగా ఉన్నాడు. 2019-22 వరకు బి.కొత్తకోటలో ఓ వ్యాపారం ప్రారంభించి నష్టం రావడంతో మూసేశాడు. 2023 నుంచి జయచంద్రారెడ్డికి పీఏగా పనిచేస్తున్నాడు. 2024లో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా జయచంద్రారెడ్డికి టికెట్ రావడంతో ప్రచార కార్యక్రమాలు, సమావేశాలకు సంబంధించిన పనులు చూసేవాడు. జయచంద్రారెడ్డి ఎన్నికల ప్రచారంలో అద్దేపల్లి తరచూ పాల్గొనేవాడు. 2024 అక్టోబరులో రాజేశ్ పేరు మీద జయచంద్రారెడ్డి, ఆయన బామ్మర్ది గిరిధర్‌రెడ్డి మద్యం దుకాణానికి దరఖాస్తు చేయగా వచ్చింది. ఈ దుకాణానికి సంబంధించిన అన్ని వ్యవహారాలను జయచంద్రారెడ్డి వాళ్లే చూసుకునేవారు. ఈ దుకాణంతో పాటు పీటీఎం మండలంలో సురేంద్రనాయుడు దక్కించుకున్న షాపులో కూడా నష్టాలు వస్తుండటంతో రెండింటినీ చూసుకుంటానని అద్దేపల్లె జనార్దన్‌రావు(ఏ1) ముందుకొచ్చాడు. దీనికి గిరిధర్‌రెడ్డి అంగీకరించి అప్పగించాడు. బెంగళూరుకు చెందిన బాలాజీ ద్వారా స్పిరిట్, ముడిపదార్థాలు కొనుగోలు చేసి నకిలీ మద్యం తయారు చేసి అమ్మితే అధిక లాభాలు వస్తాయని జనార్దన్‌రావు చెప్పడంతో జయచంద్రారెడ్డి(ఏ17), గిరిధర్‌రెడ్డి(ఏ18), సురేంద్రనాయుడు(ఏ14) అంగీకరించారు. ఈ ఏడాది జూన్-జూలై నుంచి జనార్దన్‌రావు, గిరిధర్‌రెడ్డి, సురేంద్రనాయుడు ములకలచెరువులో చేపట్టిన నకిలీ మద్యం తయారీకి జయచంద్రారెడ్డి మద్దతు ఇచ్చాడు. మద్యం తయారీకి అవసరమైన స్పిరిట్ సరఫరా చేసిన బాలాజీ కుమారుడు సుదర్శన్‌కు రాజేశ్ ఖాతా నుంచి రూ.లక్ష పంపారు. జనార్దన్‌రావు సూచనల మేరకు బాలరాజు(ఏ4), అష్ఫ్(ఏ21) మద్యం దుకాణాలకు నకిలీ మద్యం సరఫరా చేశారు. పీటీఎం మండలానికి చెందిన చైతన్య బాబు(ఏ22) సురేంద్రనాయుడు మద్యం దుకాణంలో పనిచేస్తూ బెల్ట్‌షాపులకు నకిలీ మద్యం సరఫరా చేశాడు. రూ.5 లక్షలు కట్టి రాజేశ్ పేరుతో ఓ వాహనం కొనుగోలు చేశారు. ఆ వాహనం ద్వారా నకిలీ మద్యం సరఫరా చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట మండలాలకు సరఫరా జరిగింది. నకిలీ మద్యం కేసు నమోదైన వెంటనే జయచంద్రారెడ్డి సూచనల మేరకు రాజేశ్ సెల్‌ఫోన్ల డేటాను తొలగించాడు. కాగా, రాజేశ్‌ను నుంచి ఓ కీప్యాడ్ సెల్‌ఫోన్‌ను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్(ఫైల్)

మీ మతంలో జరిగితే ఇలానే స్పందించేవారా?

▸▸ పరకామణి కేసులో జగన్ వ్యాఖ్యలపై పవన్ ఫైర్

▸▸ హిందువులు మెజారిటీ అనే భావన మిథ్యే: పవన్



అమరావతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి 'పరకామణి' చోరీ కేసు చాలా చిన్నదంటూ.. చిటికె వేసినంత తేలిగ్గా వైసీపీ అధినేత జగన్ మాట్లాడటం సరికాదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఇది ఆయన బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. "ఇలాంటి సంఘటనలు ఇస్లాంలో గానీ, జగన్ ఆచరించే క్రిస్టియన్ మతంలో గానీ జరిగితే ఇలాగే స్పందించే వారా?" అని ప్రశ్నించారు. బుధవారం మంగళగిరిలో జాతీయ మీడియాతో ఆయన మాట్లాడారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్.. ఇలా మాట్లాడటం సబబు కాదని పవన్ అన్నారు. ఆచారాలు, సంప్రదాయాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు టీటీడీని ఆదేశించారని తెలిపారు. కాగా, దేశంలో హిందువుల ఐక్యత, మెజారిటీ.. అనే భావన మిథ్యేనని పవన్ అన్నారు. మెజారిటీ పేరిట హిందువులు వివక్షను ఎదుర్కొంటున్నారన్నారు. దేశంలో ముస్లింలు, క్రైస్తవులకు వర్తించే నిబంధనలే హిందువులకూ వర్తింపజేయాలని, లేదంటే ఘర్షణలకు అవకాశాలుంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ హిందువులనే లక్ష్యంగా చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హిందువుల ఆచారాలను మాత్రమే ప్రశ్నిస్తారని, తమిళనాడు ఎంపీల వ్యాఖ్యలు అదే కోవకి చెందుతాయన్నారు. ముస్లింలు, క్రైస్తవుల ప్రయోజనాలు కాపాడేందుకు వర్తించే నిబంధనలే హిందువులకు వర్తిస్తాయన్నారు. తమిళనాడులో కొన్ని పార్టీలు సూడో సెక్యులరిజం పాటిస్తున్నాయని దుయ్యబట్టారు. డీఎంకే ప్రభుత్వం దేవాలయాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ తన ఒక్కడి వల్ల అయ్యే పనికాదని, ప్రతి హిందువు సనాతన ధర్మ పరిరక్షణకు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ముసాయిదా రాజ్యాంగంలో భగవద్గీత ప్రస్తావన ఉందని, దీనికి సంబంధించిన 'ప్రతి' తన కార్యాలయంలో ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు.

హిందూమత ద్వేషి జగన్: జ్యోతుల



అమరావతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దొంగ చేతికి అధికారం ఇస్తే ఏం చేస్తాడనేదానికి పరకామణి కేసు నిదర్శనమని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'పరకామణి కేసును చిన్న దొంగతనంగా పేర్కొన్న జగన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం. ఇది హిందువుల మనోభావాలను అవమానించడమే. జగన్ చేసిన వ్యాఖ్యలు హిందూ మతంపై ఆయనకు ఉన్న ద్వేషాన్ని స్పష్టం చేస్తున్నాయి. తాను నమ్మే మతం లో ఇలాంటి సంఘటన జరిగితే జగన్ ఇదే తరహాలో వ్యాఖ్యలు చేస్తారా? ఈ కేసులో జగన్‌తోపాటు వైవీ, కరుణాకర్‌రెడ్డిల పాత్ర స్పష్టమవుతోంది. కేసులు తారుమారు చేసేందుకు సాక్షులను హతమార్చడం వైసీపీ వారికి అలవాటే. ఈ కేసులో ఫిర్యాదుదారుడైన సతీశ్ కుమార్ హత్యకావడం అనుమానాలను రేకెత్తిస్తోంది' అని నెహ్రూ అన్నారు.

డ్రోన్ సిటీలో పెట్టుబడులు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

గూగుల్ ఉన్నతస్థాయి బృందానికి ఈ సందర్భంగా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. విశాఖలో ఏఐ డేటాసెంటర్ ప్రాజెక్టు పనులను ప్రారంభించడంపై చర్చించారు. ఏపీలో రాబోయే డ్రోన్ సిటీ ప్రాజెక్టులో డ్రోన్ అసెంబ్లింగ్, కాలిబ్రేషన్, టెస్టింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేయాలని, విస్ట్రాన్ న్యూ వెబ్ కార్పొరేషన్ ద్వారా డేటా సెంటర్-సర్వర్ తయారీ ఎకో సిస్టమ్‌ను ప్రోత్సహించాలని సుందర్ పిచాయ్‌కి విజ్ఞప్తి చేశారు. పిచాయ్ మాట్లాడుతూ.. భారత్‌లో క్లౌడ్ రీజియన్ల విస్తరణతో పాటు 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ యాక్సిలరేటర్ కార్యక్రమం ద్వారా స్టార్టప్‌లకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఏపీ ప్రతిపాదనలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. శాంటాక్లారాలోని ఇంటెల్ సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇంటెల్ ఐటీ విభాగం సీటీవో శేష కృష్ణపురతో లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో ఇంటెల్ ఉత్పత్తుల కోసం అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్(ఏటీఎంపీ) యూనిట్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఏపీ నెక్స్ట్ జెన్ టెక్నాలజీ నాయకత్వం సాధించే సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. 'ఇంటెల్-అమరావతి ఏఐ రిసెర్చి సెంటర్‌'ను శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ లేదా ఐఐటీ తిరుపతి భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

ఏఐ శిక్షణకు మద్దతు ఇవ్వండి

గేమింగ్, చిప్ డిజైనింగ్, జీపీయూ మాన్యుఫ్యాక్చరింగ్‌లో అంతర్జాతీయస్థాయిలో అగ్రగామి సంస్థ అయిన ఎన్‌విడియా వైస్ ప్రెసిడెంట్ (ఎంటర్‌ప్రైజ్ అండ్ క్లౌడ్ సేల్స్) రాజ్ మిర్‌పూరితో జరిగిన భేటీలో లోకేశ్ మాట్లాడుతూ.. ఏపీలో ఏఐ నైపుణ్యాభివృద్ధి, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల బలోపేతానికి సహకారం అందించాలని కోరారు. ఏపీలో ఏఐ నైపుణ్యాలు, రియల్ టైమ్ గవర్నెన్స్ ఏఐ చాట్‌బాట్ వ్యవస్థను ప్రారంభించామని, ప్రభుత్వ అధికారులకు ఏఐ శిక్షణ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. విద్యార్థులు, పరిశోధకులకు క్వాంటమ్ సిమ్యులేటర్లు అందించేందుకు ఏపీ విశ్వవిద్యాలయాలు, ఆర్‌అండ్‌డీ సంస్థలతో పైలట్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలన్నారు. భారతదేశంలో డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం ఎన్‌విడియా 850 మిలియన్ డాలర్లకుపైగా నిధులను ప్రకటించిందని, వాటిని ఏపీలోని డీప్‌టెక్ స్టార్టప్‌ల్లో పెట్టుబడులు, మెంటారింగ్ కోసం అనుసంధానించాలని లోకేశ్ కోరారు. గతంలో ఏపీ ప్రభుత్వంతో ఎన్‌విడియా చేసుకున్న అవగాహన ఒప్పందాన్ని త్వరగా అమలు చేయాలని కోరారు.

- అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌తో జరిగిన భేటీలో.. విశాఖలో అడోబ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ) ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు. శంతను డైరెక్టర్‌గా ఉన్న ఫైజర్ సంస్థ ఏపీలో ఉన్న ఔషధ పరిశ్రమ జోన్లలో వ్యాక్సిన్లు, బయోలాజిక్స్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. మరో సంస్థ కేకేఆర్.. ఆరోగ్య సంరక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టేలా సహకారం అందించాలన్నారు.
- జూమ్ వీడియో కమ్యూనికేషన్స్ ప్రొడక్ట్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ప్రెసిడెంట్ వెల్చామి శంకరలింగం, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణ బావాతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్చువల్ క్లాస్‌రూంల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.
- నల్లమలలో స్టెర్లింగ్ రిసార్ట్స్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని ఫెయిర్ ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ లిమిటెడ్ సీఈవో ప్రేమ్ వాత్సాను కెనడాలో కలిసిన లోకేశ్ కోరారు.
- ఏపీలో పారిశ్రామిక పెట్టుబడులకు సహకరించాలని బిజినెస్ కౌన్సిల్ ఆఫ్ కెనడా ప్రెసిడెంట్ గోల్డీ హైదర్‌ను లోకేశ్ కోరారు. టొరంటోలో హైదర్‌తో లోకేశ్ భేటీ అయ్యారు.
- ఏపీలో గ్రీన్ ఎనర్జీ, లాజిస్టిక్స్,మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించాలని కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు(సీపీపీఐబీ) గ్లోబల్ పబ్లిక్ ఎఫైర్స్ బృంద సభ్యుడు టిమ్ డౌనింగ్‌ను లోకేశ్ కోరారు.



అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌తో మంత్రి లోకేశ్

విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, ప్రభుత్వం చేపట్టే ఆరోగ్య, వ్యవసాయం, వాతావరణ పరిశోధనలకు హెచ్‌పీసీ క్లస్టర్లు ఏర్పాటుతో మద్దతు ఇవ్వండి. ఏపీ ప్రభుత్వం యువత నైపుణ్యాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన కృషి చేస్తోంది. ఇంటెల్‌కు భవిష్యత్తు నైపుణ్య వర్క్ ఫోర్సు అవసరాన్ని తీర్చిదిద్దేందుకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టండి. రాష్ట్రంలోని ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ పాఠ్య ప్రణాళికలో ఇంటెల్ శిక్షణ కార్యక్రమాలు చేర్చే అంశాన్ని పరిశీలించండి. ఏపీలోని విశ్వవిద్యాలయాల్లో ఇంటెల్ స్కిల్ ల్యాబ్స్ స్థాపించండి.

- ఇంటెల్ సీటీవోతో లోకేశ్



కాలిఫోర్నియాలో లోకేశ్ వెంట మన్నవ మోహనకృష్ణ

భారీ పెట్టుబడులకు పునాది పడుతోంది

▸▸ మన్నవ మోహనకృష్ణ

(డాలస్ నుంచి కిలారు గోకుల్ కృష్ణ)

మంత్రి లోకేశ్ అమెరికా పర్యటనతో ఏపీలో భారీ పెట్టుబడులకు పునాది పడుతోందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. లోకేశ్ పర్యటనలో ఆయన పాల్గొన్నారు. మోహనకృష్ణ మాట్లాడుతూ, ఏపీని ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడానికి లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. యువతకి 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ప్రపంచ స్థాయి పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తున్నారన్నారు.

మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన: మంత్రి లోకేశ్

విశాఖపట్నంలో మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. బుధవారం శాన్‌ఫ్రాన్సిస్కో సిలికాన్ వ్యాలీలో జరిగిన బే-ఏరియా కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. 'ఏఐ యుగంలో నైపుణ్యాలు, విశ్వాసం, రంగాల మార్పును సమన్వయం చేయడం' అనే అంశంపై మాట్లాడారు. "భారత ఏఐ విప్లవంలో ఏపీని అగ్రపథాన నిలుపుతాం. సీఎం చంద్రబాబు ఈ దిశగా చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. ఈ దిశగా జరుగుతున్న కృషిలో గూగుల్ పెట్టుబడి ప్రారంభం మాత్రమే. ప్రతి కుటుంబంలో ఏఐ నిపుణుడు ఉండాలన్నది చంద్రబాబు లక్ష్యం. ఏపీలో కాన్వర్జేషనల్ ఏఐ ద్వారా స్కిల్ సెన్సెస్ చేపడుతున్నాం. ఏసీ టెక్నీషియన్ నుంచి ఏఐ ఇంజనీరు వరకు నైపుణ్య అంచనా చేపడతాం. దేశంలోనే యువ రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. ప్రస్తుతం ఏపీ 180 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. భవిష్యత్తులో ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం." అని మంత్రి లోకేశ్ వివరించారు.



కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయం భవనం

విశాఖకు ఐటీ జోష్

రేపు కాగ్నిజెంట్ కార్యకలాపాలు ప్రారంభం

▸▸ కాగ్నిజెంట్ శాశ్వత కార్యాలయం, టెక్ తమ్మిన, సత్వ, ఇమ్మాజినోటివ్, ఫ్లూయెంట్ గ్రిడ్ ఐటీ కంపెనీలకు భూమి పూజ

▸▸ హాజరుకానున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

విశాఖపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి ఐటీ జోష్ వస్తోంది. దిగ్గజ సంస్థల్లో టీసీఎస్ కంటే ముందే కాగ్నిజెంట్ తన కార్యకలాపాలను ప్రారంభిస్తోంది. భూమి కేటాయించి కొద్దినెలలే అయినా శాశ్వత భవనాల నిర్మాణానికి భూమి పూజ, తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనికి సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ హాజరవుతున్నారు. ముందుగా మంత్రి లోకేశ్ విశాఖపట్నం చేరుకుని శుక్రవారం ఉదయం 9.30 గంటలకు రుషికొండ ఐటీ పార్క్‌లోని హిల్-2పై మహతి ఫిన్‌టెక్ భవనంలో కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయం ప్రారంభిస్తారు. తరువాత హిల్-3కి చేరుకొని శ్రీటెక్ తమ్మిన సంస్థకు భూమిపూజ చేస్తారు. అక్కడే నాన్‌రెల్ టెక్నాలజీస్, ఏసీఎన్ ఇన్ఫోటెక్ భూమిపూజ శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి 2.9 కి.మీ. దూరానున్న హిల్-4కు చేరుకొని సత్వాస్ వాంటేజ్ వైజాగ్ క్యాంపస్‌కు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి మరో 5.4 కి.మీ. దూరంలోని కాపులుప్పాడ వెళతారు. అక్కడ ఇమ్మాజినోటివ్, ఫ్లూయెంట్ గ్రిడ్ ఐటీ కంపెనీలకు కూడా శంకుస్థాపనలు చేస్తారు. మదర్‌సన్ టెక్నాలజీస్, క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ సంస్థల శిలాఫలకాలు ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమం అనంతరం అర కిలోమీటరు దూరానున్న కాగ్నిజెంట్ స్థలానికి ఉదయం 11 గంటలకు చేరుకుంటారు. అదే సమయానికి అక్కడకు సీఎం చంద్రబాబు వస్తారు. ఇరువురూ కలిసి కాగ్నిజెంట్ శాశ్వత కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అదే ప్రాంగణంలో 8 ఐటీ సంస్థలకు చెందిన ప్రతినిధులతో ఇరువురూ సమావేశమవుతారు.

ఇవీ సంస్థలు, వాటి కార్యకలాపాలు

- కాగ్నిజెంట్‌కు కాపులుప్పాడలో 22.19 ఎకరాలు కేటాయించారు. అందులో రూ.1,600 కోట్ల పెట్టుబడితో ఏఐ టెక్నాలజీ సెంటర్‌ను సంస్థ అభివృద్ధి చేస్తుంది. మొత్తం 8 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది. ఈ ప్రాంగణం 2029 నాటికి అందుబాటులోకి వస్తుంది.
- రుషికొండ హిల్-2పై శ్రీటెక్ తమ్మిన ఏఐ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తుంది. ఈ సంస్థ 2 వేల మందికి ఉపాధి కల్పిస్తుంది.
- ఐటీ పార్క్ హిల్-4పై సత్వ డెవలపర్స్ ఐటీ స్పేస్, డేటా సెంటర్.. వాంటేజ్ వైజాగ్ క్యాంపస్ ఏర్పాటు చేస్తుంది. సంస్థకు ఎకరా రూ.1.5 కోట్లు చొప్పున 30 ఎకరాలు ఇచ్చారు. రూ.1,500 కోట్ల పెట్టుబడితో 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. ఇది బెంగళూరుకు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీ.
- కాపులుప్పాడలో ఇమ్మాజినోటివ్, ఫ్లూయెంట్‌గ్రిడ్, మదర్‌సన్ టెక్నాలజీస్, క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ సంస్థలు ఏర్పాటవుతాయి. విశాఖకు చెందిన ఫ్లూయెంట్‌గ్రిడ్‌కు కాపులుప్పాడలో 3.3 ఎకరాలు కేటాయించారు.
- మదర్‌సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్‌కు కాపులుప్పాడ ఐటీ పార్క్‌లో 3.55 ఎకరాలు కేటాయించారు. అందులో ఐటీ ఆర్‌అండ్‌డి సెంటర్, జీసీసీ ఏర్పాటు చేస్తారు. 700 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.
- ఇమ్మాజినోటివ్ సంస్థకు 4.05 ఎకరాలు కేటాయించారు. అందులో రూ.140 కోట్లతో ఆ సంస్థ జీసీసీ ఏర్పాటు చేస్తుంది.



అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి, ఉన్నతాధికారులు

5 జీ ఫోన్లతో అంగన్‌వాడీ సేవలు విస్తృతం

- ఆశాలకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ పథకాలకు అర్హత..!
- వారి జీతాల పెంపుపై దృష్టి: మంత్రి సంధ్యారాణి

విజయవాడ సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంగన్‌వాడీ సేవలను మరింత పారదర్శకంగా విస్తృతం చేసేందుకు 5జీ మొబైల్స్‌ను అందుబాటులోకి తెచ్చామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వేగంగా సేవలు అందించేందుకు ఈ మొబైల్స్ దోహదపడతాయని ఆమె చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కో ఆర్డినేటర్‌లకు 5జీ మొబైల్స్ అందించే కార్యక్రమాన్ని విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆమె బుధవారం లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. "రాష్ట్రంలోని 55,204 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1.25 లక్షల మంది ఉద్యోగులు సేవలు అందిస్తున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన 4జీ ఫోన్‌లు సరిగ్గా పని చేయకపోవడంతో కూటమి ప్రభుత్వం రూ.75 కోట్లతో 5జీ మొబైల్స్‌ను సమకూర్చింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన 'పిల్లలను అందంగా ముస్తాబు చేద్దాం' అనే కార్యక్రమం మంచి ఫలితాలను సాధించింది. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడానికి చర్యలు తీసుకుంటాం. అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆశా వర్కర్‌లకు ప్రభుత్వ పథకాల అర్హత కల్పించేందుకు కృషి చేస్తున్నాం. దీనిపై త్వరలో సానుకూల ప్రకటన రావచ్చు. యాప్‌లు తగ్గించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో కార్యకర్తలకు కొత్త యూనిఫాంలు అందిస్తాం. జీతాల పెంపుపై దృష్టి పెట్టాం. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించేందుకు రూ.లక్ష చొప్పున మంజూరు చేస్తాం' అని మంత్రి తెలిపారు. అనంతరం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి, సంచాలకులు ఎం.వేణుగోపాల రెడ్డి, జేడీ కె.ప్రవీణ, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగంతో కలిసి మంత్రి సంధ్యారాణి 'బాల్య వివాహ రహిత ఏపీ' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- అన్నదాతలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం: రామకృష్ణ



కర్నూలు జిల్లా ఆస్పరిలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ఆస్పరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కర్నూలు జిల్లా ఆస్పరి మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అధ్యక్షతన బుధవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ... 'నష్టపోయిన ఉల్లి పంటలకు హెక్టారుకు రూ.50 వేలు ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఇవ్వలేదు. కర్నూలు జిల్లాలో అధికంగా పండించే పత్తి, టమోటా, ఉల్లి, మిర్చి పంటలకు, అలాగే ఇతర జిల్లాల్లో ఎక్కువగా పండించే మామిడి, సపోట, అరటి, దానిమ్మ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. వేదవతి, గుండ్రేవుల, హంద్రీ-నీవా ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి' అని రామకృష్ణ కోరారు.

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల వేతనాలు పెంచాలి: ఈశ్వరయ్య

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల వేతనాలను పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన బుధవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. గుజరాత్ తరహాలో అంగన్‌వాడీలకు నెలకు రూ.24,800, హెల్పర్లకు రూ.20,300 చొప్పున చెల్లించాలని కోరారు. తమ న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం వారంతా 12న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతున్నారని ఈశ్వరయ్య తెలిపారు.

ఏపీ, కర్ణాటక సరిహద్దుకు జస్టిస్ సుధాన్షు

- వివాదాస్పద మైనింగ్ ప్రాంతం పరిశీలన
- సరిహద్దులు, అక్రమ తవ్వకాలపై ఆరా




అనంతపురం జిల్లాలోని వైఎం కంపెనీ ఇనుప గనుల ప్రాంతం వద్ద అధికారులతో మాట్లాడుతున్న జస్టిస్ సుధాన్షు ధూలియా

డీ.హీరేహాళ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ, కర్ణాటక సరిహద్దులోని వివాదాస్పద ఇనుప గనుల ప్రాంతాన్ని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాన్షు ధూలియా పరిశీలించారు. అంతర్రాష్ట్ర సరిహద్దు వివాదం, గనుల అక్రమ తవ్వకాలు, అటవీ ప్రాంతంలో గనుల తవ్వకాలను నిర్ధారించేందుకు సుప్రీంకోర్టు ఈ ఏడాది సెప్టెంబరులో జస్టిస్ సుధాన్షు కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో బుధవారం అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలానికి జస్టిస్ సుధాన్షు విచ్చేశారు. మండలంలోని ఆరు మైనింగ్ ప్రాంతాలను పరిశీలించారు. కమిటీ ఈ నెల 19వ తేదీన సుప్రీంకోర్టుకు నివేదికను సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 20 రోజులకుపైగా రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ, మైన్స్ అండ్ జియాలజీ తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో చేస్తున్న సర్వే ఎంతవరకు వచ్చింది? ఇప్పటిదాకా గుర్తించిన అంశాలు ఏమిటని జస్టిస్ సుధాన్షు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆయన ఏపీ, కర్ణాటక అధికారులతో బళ్లారిలో సమావేశం నిర్వహించారు. గతంలో జరిగిన మైనింగ్, వివాదాల గురించి చర్చించారు. అనంతరం రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులతో కలిసి ఆరు మైనిం గ్ ప్రాంతాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన సరిహద్దుల మేరకే మైనింగ్ తవ్వకాలు జరిగాయా, హద్దులు మీరారా అని పరిశీలించారు. ఆయన వెంట డైరెక్టర్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కూర్మనాథ్, ఆర్‌జేడీ నిత్యానంద్, సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధి శ్రీనివాస్ చౌదరి, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ రవితేజ తదితరులున్నారు.

100 మందికి ఉచితంగా సివిల్స్ కోచింగ్

- ఆదరణ-3పై త్వరలో నిర్ణయం: మంత్రి సవిత వెల్లడి




సివిల్స్ ఉచిత కోచింగ్‌కు ఎంపికైన వారి జాబితాను విడుదల చేస్తున్న మంత్రి సవిత

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం కింద బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత సివిల్స్ కోచింగ్‌కు 100 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖమంత్రి సవిత తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో అభ్యర్థికి కోచింగ్, భోజన, వసతి సదుపాయాలకు రూ.85 వేల వరకు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారి సర్టిఫికెట్లను ఈ నెల 12న విజయవాడ గొల్లపూడిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో పరిశీలిస్తామని, 14 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధుల్ని ఖర్చు చేయలేరా?

- మురిగిపోయే పరిస్థితి రానీయొద్దు
- డెడ్‌లైన్ పూర్తవ్వగానే శాఖలకు ఫోన్ చేస్తాం..
- అప్పటికీ వాడకపోతే మీ జీతాల నుంచి కట్‌చేస్తా
- కార్యదర్శులను హెచ్చరించిన చంద్రబాబు



శాఖా కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు, సీఎస్, డీజీపీ

అమరావతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'స్పర్శ్', ఎస్‌ఎన్‌ఏ (సింగిల్ నోడల్ ఏజెన్సీ) ఖాతాల్లోని రూ.1,220 కోట్ల నిధులను ఈ నెల చివరి నాటికి ఖర్చు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలపై (సీఎస్ఎస్) బుధవారం నిర్వహించిన సమీక్షలో భాగంగా ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. వివిధ శాఖలు స్పర్శ్‌లో ఉన్న రూ.955 కోట్లను, ఎస్‌ఎన్‌ఏలో ఉన్న రూ.265 కోట్లను వెంటనే ఖర్చు చేయాల్సి ఉందని, లేదంటే కేంద్రం ఈ నిధులు వెనక్కి ఇవ్వమని అడుగుతుందంటూ ఏపీ రెసిడెన్సియల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్....సీఎం చంద్రబాబుకు నివేదించారు. దీనిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. "శాఖల్లో నిధులు ఖర్చు చేయకపోవడం ఏమిటి? ఇది సరికాదు.ఈ నెలాఖరులోగా మొత్తం రూ.1,220 కోట్ల నిధులు ఖర్చు చేసేయాల్సిందే" అంటూ వారికి స్పష్టం చేశారు. దీనిపై తక్షణం సమీక్ష జరపాల్సిందిగా అదే సమావేశంలో సీఎస్ విజయానంద్‌ను ఆదేశించారు. "ఖర్చు చేయని శాఖకు ఆ రోజు (డిసెంబరు చివరి రోజు) ఫోన్ చేస్తాం. మీరు (కార్యదర్శులను ఉద్దేశించి) ఖర్చు చేయకపోతే మీ జీతం నుంచి చెల్లించాల్సి వస్తుంది. పథకాల వారీగా సంబంధిత మంత్రి, కార్యదర్శి, హెచ్‌వోడీలకు ఈ నిధుల విషయమై ఆర్థిక శాఖ సమాచారం అందించాలి." అని సీఎం నిర్దేశించారు.

రియల్ టైమ్‌లో జనగణన

ఎప్పుడో పదేళ్లకోసారి జనాభా లెక్కలు అనేది పాత పద్ధతి అని, టెక్నాలజీ పెరిగిన నేపథ్యంలో ఎప్పటికప్పుడు జనాభా లెక్కలు అప్‌డేట్ కావాలని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. జనగణన రియల్‌టైమ్‌లో ఉండాలని స్పష్టంచేశారు. వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో జనగణన పూర్తిచేసి రికార్డులు అప్‌డేట్ చేయాలని, ఆ తర్వాత జాతీయ స్థాయిలో జరిగే జనగణన లెక్కలతో సరిపోల్చుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే...

అందుకే గూగుల్ వచ్చింది..

"మనం టెక్నాలజీ వినియోగంలో అప్‌డేట్‌గా ఉన్నాం. గ్రీన్ ఎనర్జీతో ఇంధన వినియోగంలో వ్యయం తగ్గించాం. ఈ కారణాలతోనే విశాఖకు 15 బిలియన్ డాలర్ల విలువైన గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. ఏపీ ఒక్కటే త్రైమాసికం జీఎస్‌డీపీ అంచనా వేస్తోంది. ఇకపై నెలవారీగా జీఎస్‌డీపీ లెక్కలు తీయాలి. అంతిమంగా ప్రజలకు సుపరిపాలన అందివ్వాలి."

ప్రజలు ఎందుకు రావాలి?

"ఇకపై ఫైళ్లు అన్నీ అనుసంధానం చేస్తాం. ప్రజలు ఆఫీసుల చుట్టూ ఎందుకు తిరగాలి? ఉదాహరణకు ఒక రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత మళ్లీ ఆ డాక్యుమెంట్ల కోసం ప్రజలు ఆఫీసుకు రాకూడదు. పోస్ట్ ద్వారా మనమే వాటిని ఇంటికి పంపాలి. గ్రామ, వార్డు సచివాలయాల పేరు కూడా మారుస్తాం. మంచి పేరు పెడతాం. ఆ వ్యవస్థను ఇప్పటికే గాడిన పెట్టాం."

రుణ భారం పెరిగింది

"రుణం భారంగా మారింది. మొత్తం రుణాలు రీషెడ్యూలు చేస్తున్నాం. వైసీపీ వల్ల ఏపీ బ్రాండ్ దెబ్బతింది. అభివృద్ధి ఆగింది. ఆదాయం తగ్గింది. దీంతో అప్పులు ఇచ్చేవారు వడ్డీ రేట్లు పెంచారు. క్రెడిట్ ర్యాంకింగ్ బాగుంటే తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు వస్తాయి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చాం. కానీ ఆర్థిక శాఖ ఎప్పుడూ డబ్బుల్లేవంటుంది. దాన్ని అధిగమించి ముందుకెళ్లాలి."

విశ్వసనీయతకు మా నాన్న ఒక ఉదాహరణ

"గత ప్రభుత్వం వల్ల ఏపీ బ్రాండ్ దెబ్బతింది. ఒక వ్యక్తి ప్రవర్తన వల్ల పరపతి పెరుగుతుంది. నా చిన్నప్పుడు మా ఊర్లో వారంతా వారి డబ్బు తీసుకొచ్చి మా నాన్న వద్ద దాచి పెట్టుకునేవారు. వారికి అవసరమైనప్పుడు తిరిగి తీసుకెళ్లేవారు. విశ్వసనీయతకు ఇదొక ఉదాహరణ. విశాఖపట్నం భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.13.26లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 45 రోజుల్లో ఆ పనులు ప్రారంభిస్తాం."

అందరి పనితీరు నా వద్ద ఉంది

"అధికారులు నన్ను పొరపాటుగా అనుకోవద్దు. నాతో సహా అందరి పనితీరు సమాచారం నా దగ్గర ఉంది. సరైనవారు సరైన స్థానాల్లో ఉండాలి. ఉంటే సరిపోదు. సరైన ఫలితాలూ సాధించాలి. నేను తొలిసారి సీఎం అయ్యేనాటికి అనేక సమస్యలుండేవి. ముఖ్యంగా అనంతపురంలో నీరు ఉండేది కాదు. ఆంధ్రా ప్రాంతం నుంచి గడ్డి, తాగునీరు పశువులకు పంపేవాళ్లం. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది."

నెగిటివ్‌కు అలవాటు పడ్డారు

"కొందరు అధికారులు ప్రతికూల ఆలోచనలు చేయడానికి అలవాటు పడ్డారు. దేవదాయశాఖ, రెవెన్యూ శాఖలు ఇప్పటికీ పుంజుకోలేదు. టీటీడీ పనితీరు మెరుగుపడుతున్నా దేవదాయశాఖ పనితీరు సరిగా లేదు. జనవరి 15వ తేదీ డెడ్‌లైన్. అన్ని శాఖలు వారి సేవలు ఆన్‌లైన్ చేయాలి."

అనర్హులకు రాకూడదు... అర్హులకు ఆగకూడదు

"సంక్షేమం అర్హులకే అందాలి. గతంలో కొన్ని చోట్ల దివ్యాంగులు కాకపోయినా వారికి పీహెచ్ కోటా పెన్షన్లు ఇచ్చారు. అనర్హులకు సంక్షేమ పథకాలు వెళ్లకూడదు. అలాగే అర్హులకు ఆగకూడదు."

ప్రజలకు నచ్చినవి

ప్రజలకు నచ్చిన వాటిలో సుపరిపాలన టాప్‌లో ఉంది. మంచి రోడ్లు, మెరుగైన అభివృద్ధి, ధరల నియంత్రణ, మెరుగైన ఆర్థిక వృద్ధి, అవినీతి నియంత్రణ, తాగునీటి సరఫరా, వైద్యం, పెట్టుబడులు, రాజధాని, ఆలయాల్లో పనితీరు, విద్య, పోలవరం, ఉపాధి కల్పన... ప్రజలకు నచ్చాయి.

నచ్చనివి...

బియ్యం ధరల పెరుగుదల, రైతుల అసంతృప్తి, అభివృద్ధి లేమి, రోడ్లు, నిరుద్యోగం, తాగునీటి సమస్యలు, పరిపాలనలో లోపాలు, అవినీతి పెరగడం, బలహీనమైన ఆర్థిక వృద్ధి ప్రజలకు నచ్చలేదు.

మన్యం కలెక్టర్ ఆలోచన బాగుంది

"కొన్నిసార్లు చిన్న పనులు మంచి ఫలితాలనిస్తాయి. పార్వతీపురం మన్యం కలెక్టర్ 'ముస్తాబు' అనే కార్యక్రమం గిరిజన పాఠశాలల్లో అమలుచేస్తున్నారు. ప్రతి పాఠశాలకు అద్దం, దువ్వెన ఇచ్చారు. ప్రతి తరగతికి ఇద్దరు లీడర్లు ఉంటారు. వారు విద్యార్థులను తల దువ్వుకున్నారా? ముఖం కడుక్కున్నారా? యూనిఫాం, షూ శుభ్రంగా ఉన్నాయా? అని పరిశీలించి బాగుంటేనే తరగతి గదిలోకి అనుమతిస్తున్నారు. లేకపోతే వారే అవన్నీ సరిచేస్తున్నారు. ఇందులో రూపాయి ఖర్చు లేదు. కలెక్టర్ పెట్టిన కార్యక్రమం బాగుంది."

ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్న టాప్-10 శాఖలు ఇవే...

రెవెన్యూ, పోలీసు, పురపాలక శాఖ, పంచాయతీ రాజ్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, పౌరసరఫరాలు, గృహనిర్మాణ కార్పొరేషన్, పాఠశాల విద్య, సెర్ప్

సుస్థిరాభివృద్ధి సాధన లక్ష్యాలలో...

ఏ+ కేటగిరి (90శాతం పైన): విద్యుత్, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, పౌర సరఫరాలు, మహిళా శిశు సంక్షేమాభివృద్ధి

ఏ కేటగిరీ (75 శాతం పైన): వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, సెకండరీ ఎడ్యుకేషన్, ప్రణాళిక శాఖ, ఆర్థిక శాఖ, పర్యావరణ అటవీ శాఖ, పట్టణాభివృద్ధి శాఖ.

బి కేటగిరీ (60 శాతం పైన): ఉన్నత విద్య 74, పంచాయతీరాజ్, హోంశాఖ

సి కేటగిరీ: పరిశ్రమలు, సచివాలయాల శాఖ

పల్లెల్లో పట్టణ స్థాయి సేవలు

(మొదటి పేజీ తరువాయి)

వేతనాలు వెంటనే చెల్లించాలని ఆదేశించారు. "పల్లెలు బాగుంటే దేశం బాగుంటుంది. అందుకే గ్రామాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పంచాయతీరాజ్‌శాఖను తీసుకున్నా. అనుభవం ఉన్న అధికారి పర్యవేక్షణ అవసరమని భావించి శశిభూషణ్‌కుమార్‌ని ముఖ్యకార్యదర్శిగా తీసుకున్నాం. ఉపముఖ్యమంత్రి హోదాలో సొంత తెలివితేటలు ఎక్కడా వాడలేదు. ఉన్నతాధికారులు చెప్పిన మేరకే సంస్కరణలు తీసుకువచ్చాం." అని పవన్ అన్నారు. ఇంకా ఏమన్నారంటే..



శశిభూషణ్‌కుమార్‌ను సత్కరించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పోస్టులు అమ్ముకున్నారు..

శశిభూషణ్‌కుమార్, ఓఎస్‌డీ వెంకటకృష్ణ, కమిషనర్ కృష్ణతేజ లాంటి నిబద్ధతతో పని చేసే అధికారులు శాఖలో ఉన్నారు. గత ప్రభుత్వపాలనలో చాలా అంశాల్లో పారదర్శకత లేదన్న విషయాన్ని నా దృష్టికి తెచ్చారు. కనీసం రోడ్లు కూడా వేయలేదు. మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించలేదు. ప్రతి పోస్టుకి, బదిలీకి ఒక రేట్ కార్డు ఉండేది. అలాంటి పరిస్థితులు పోవాలని కోరుకున్నా. సమీక్షల సమయంలో చిన్న చిన్న మార్పులు తీసుకురావడం ద్వారా మంచి ఫలితాలు సాధించాం. 10 వేల మంది పైచిలుకు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. ఆర్థిక వ్యవస్థ గాడిన పడకుండా అన్నీ ఒకేసారి చేయలేం. ప్రధాని మోదీ సహకారం, సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నాం. గతంలో జిల్లా పరిషత్ సీఈవో స్థాయిలో పదోన్నతులు తక్కువగా ఉండేవి. ఇప్పుడు తొలిసారి 70 మందికి పదోన్నతులు ఇవ్వబోతున్నాం.

క్లస్టర్ వ్యవస్థ రద్దు!

పంచాయతీలకు అధికారాలను బదిలీ చేసే ప్రక్రియలో భాగంగా గతంలో ఉన్న 'క్లస్టర్' వ్యవస్థను రద్దు చేశాం. 13,350 గ్రామ పంచాయతీలను స్వతంత్ర పాలనా యూనిట్లుగా మార్చాం. జనాభా ప్రాతిపదికన 4 గ్రేడ్‌లుగా విభజించాం. తద్వారా ప్రజలకు మరింత సులభతర సేవలు అందనున్నాయి. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కలలను సాకారం చేసే దిశగా 10 వేల జనాభా దాటిన పంచాయతీలను.. 'రూర్బన్ పంచాయతీ'లుగా గుర్తించాం. డిప్యూటీ ఎంపీడీవో స్థాయి గెజిటెడ్ అధికారిని నియమించి మున్సిపాలిటీలతో సమానంగా అభివృద్ధి చేస్తున్నాం. పూర్తి స్థాయి సిబ్బందితో ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేశాం.

ఉద్యోగులకు అండగా..

"మహిళా ఉద్యోగులను వేధిస్తే కఠిన చర్య లు తీసుకోవడంతో పాటు ఉద్యోగుల భద్రత, హక్కుల పరిరక్షణను వ్యక్తిగతంగా తీసుకుని ముం దుకువెళ్తాం. విధి నిర్వహణలో చిన్నస్థాయి ఉద్యోగికి ఇబ్బంది వచ్చినా అండగా నిలుస్తాం. మహిళా ఉద్యోగులపై వేధింపులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని ఆదేశించాం. రాజకీయపరమైన దాడులను ఉపేక్షించం. ఉద్యోగుల భద్రత, వారి హక్కుల పరిరక్షణ బాధ్యతలను భుజాలపై ఎత్తుకున్నాం. ఉమ్మడి కడప జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై ఓ పార్టీ వారు దాడి చేసినప్పుడు స్వయం గా వెళ్లి అండగా నిలిచా." అని పవన్ కల్యాణ్ తెలిపారు.

కడప ఎమ్మెల్యేలు అడ్డుపడుతున్నారు!

పంచాయతీరాజ్ చట్టం-1994కు సవరణలు తెస్తామని, 4 మాసాల్లో ప్రతిపాదనలు రూపొందిస్తామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అధికారులు తెలిపారు. విజయనగరానికి చెందిన పంచాయతీ కార్యదర్శి అనంత శంకర ప్రసాద్ మాట్లాడుతూ.. పంచాయతీల్లో శానిటేషన్ పర్యవేక్షణ ఉదయం 6 నుంచి చేపట్టడం కష్టంగా ఉందని, 9 గంటల నుంచి చేపట్టేలా వెసులుబాటు కల్పించాలన్నారు. పంచాయతీరాజ్‌శాఖలో ఉన్న టీచర్లు ఇప్పుడు పూర్తిగా విద్యాశాఖ పరిధిలోకి వెళ్లారని, అయితే వారి కారుణ్య నియామకాలు ఇంకా పంచాయతీరాజ్‌శాఖ ద్వారా ఇవ్వాలన్న ప్రతిపాదనలు వస్తున్నాయని ఎన్టీఆర్ మెప్మా పీడీ మురళీకృష్ణ ప్రసాద్ అధికారుల దృష్టికి తెచ్చారు. పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకునేలా కృషి చేయాలని మరో అధికారి సూచించారు. 'స్వామిత్వ'లో కొన్ని గ్రామాల్లో సర్వేలు చేయవద్దని కడప జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు ఒత్తిడి తెస్తున్నారని డీపీవో రాజ్యలక్ష్మి చెప్పారు. 'స్వమిత్వ'ను కేంద్రం తీసుకొచ్చిందని, అలాంటి కార్యక్రమాన్ని వ్యతిరేకించే అధికారం ఎమ్మెల్యేలకు లేదని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. ఆ ఎమ్మెల్యేలతో తాను మాట్లాడతానన్నారు. కాగా, కారుణ్య నియామకాలకు సంబంధించి ఇంకా 300 మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని, వాటిని కలెక్టర్ పూల్‌లో అందించేలా ప్రభుత్వాన్ని కోరతామని కృష్ణతేజ తెలిపారు. 'స్వర్ణ పంచాయతీ' అమలు ద్వారా రూ.300 కోట్లుగా ఉన్న రాబడిని రూ.1,007 కోట్లకు పెంచామని తెలిపారు.

ప్రేమించాడని.. చంపేశారు!

- పెళ్లి చేస్తామంటూ ఇంటికి పిలిచి దారుణం
- అబ్బాయి తలపై క్రికెట్ బ్యాట్‌తో మోదిన అమ్మాయి తల్లిదండ్రులు
- బీరంగూడలో ఇంజనీరింగ్ విద్యార్థి దారుణ హత్య
- మృతుడు ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన శ్రవణ్‌సాయి



శ్రవణ్‌సాయి (ఫైల్)

అమీన్‌పూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరూ చాలా కాలంగా ప్రేమించుకుంటున్నారు.. విషయంలో పెద్దలకు తెలిసింది.. కులాలు వేరు కావడంతో అమ్మాయి తల్లిదండ్రులు వారి ప్రేమకు అడ్డు చెప్పారు. తమ కుమార్తెతో తిరగొద్దంటూ పలుమార్లు హెచ్చరించారు. అయినా, వారు పట్టించుకోలేదు. ఎలాగైన వారిని విడదీయాలని భావించిన అమ్మాయి తల్లిదండ్రులు.. పెళ్లి చేస్తామంటూ వారిని నమ్మించారు. పథకం ప్రకారం అబ్బాయిని ఒంటరిగా ఇంటికి రమ్మని పిలిచారు. అది నిజమేనని నమ్మి వచ్చిన అతన్ని.. అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు కలిసి.. కొట్టి చంపేశారు! ఈ దారుణ ఘటన సంగారెడ్డి జిల్లా బీరంగూడలో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన శ్రవణ్‌సాయి (19)కి తల్లిదండ్రులు లేరు. అమీన్‌పూర్‌లో ఉంటున్న పెద్దనాన్న కాకాని వెంకటేశ్వరరావు దగ్గర ఉంటున్నాడు. బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న శ్రవణ్.. ప్రస్తుతం కుత్బుల్లాపూర్‌లో గది అద్దెకు తీసుకుని ఉంటూ మైసమ్మగూడలోని కాలేజీకి వెళ్లి వస్తున్నాడు. బీరంగూడలోని సృజన లక్ష్మి కాలనీలో ఉండే శ్రీజ(19), శ్రవణ్‌సాయి పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య ప్రేమ చిగురించింది. ప్రస్తుతం వేర్వేరు చోట్ల చదువుతున్నా వారి మధ్య ప్రేమ కొనసాగుతూనే ఉంది. శ్రవణ్ ఓసీ వర్గానికి చెందిన యువకుడు కాగా, అతనికి సుమారు 20 ఎకరాల భూమి ఉంది. బీసీ వర్గానికి చెందిన శ్రీజ తల్లిదండ్రులకు వీరి ప్రేమ నచ్చలేదు. దీంతో పలుమార్లు శ్రవణ్‌ని హెచ్చరించారు. అయినా వారు వెనక్కి తగ్గలేదు. ఇలాగైతే వారిని విడదీయడం సాధ్యం కాదనుకున్న శ్రీజ తల్లిదండ్రులు పథకం ప్రకారం.. పెళ్లి చేస్తామంటూ వారిని కొంత కాలంగా నమ్మించడం ప్రారంభించారు. పెళ్లి విషయం మాట్లాడుకుందామని, ఒంటరిగా రావాలని శ్రవణ్‌ని పిలిచారు. మంగళవారం సాయంత్రం అతను బీరంగూడలోని శ్రీజ ఇంటికి వచ్చాడు. శ్రవణ్ లోపలికి రాగానే తలుపులు పెట్టి, అప్పటికే సిద్ధంగా ఉన్న తల్లిదండ్రులు, వారి బంధువులు మూకుమ్మడిగా దాడికి దిగారు. శ్రీజ తండ్రి ప్రసాద్, తల్లి సిరి క్రికెట్ బ్యాటుతో శ్రవణ్ తలపై మోదడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం తెల్లవారు జామున అతన్ని కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయాడని వైద్యులు తేల్చారు. పథకం ప్రకారమే శ్రవణ్‌ని హత్య చేశారని అతని పెదనాన్న ఆరోపించారు. గతంలోనే శ్రవణ్‌ను హత్య చేస్తామని ప్రసాద్ బెదిరించాడన్నారు. తెల్లవార్లూ శ్రవణ్‌ను చిత్రహింసలకు గురి చేసి హత్య చేశారని చెప్పారు. 'ఆ అమ్మాయే తరచూ కాలేజీ వద్దకు వెళ్లి నన్ను పెళ్లి చేసుకో.. మా ఇంటికి వచ్చి మాట్లాడు' అని శ్రవణ్‌ను బతిమిలాడేదని వెంటేశ్వరరావు తెలిపారు. శ్రీజ కుటుంబసభ్యులందరూ కలిసి శ్రవణ్‌ను హతమార్చారంటూ అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రేమ వ్యవహారంలో తలెత్తిన వివాదంతోనే యువకుడి హత్య జరిగిందని పోలీసులు తెలిపారు.

బ్యాంకర్లనే బురిడీ కొట్టిద్దామని..



శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువులో తాకట్టు పెట్టేందుకు ప్రయత్నించిన నకిలీ బంగారం వడ్డాణం

- స్థానిక రైతులకు కమీషన్ ఆశ చూపి..
- పట్టాదారు పాసుపుస్తకాలపై రుణానికి యత్నం
- అనుమానంతో ఆరా తీసిన బ్యాంకర్లు
- వెంటనే పోలీసులకు సమాచారం
- శ్రీసత్యసాయి జిల్లా పోలీసుల అదుపులో ఏడుగురు

నకిలీ బంగారంతో ఎస్‌బీఐకి వచ్చిన కర్ణాటక ముఠా


శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పట్టణంలోని స్టేట్ బ్యాంక్ బ్రాంచి

గోరంట్ల, ఓబుళదేవరచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతుల ముసుగులో రుణం కోసం బ్యాంకుకు వచ్చారు. నకిలీ బంగారం ఇచ్చి రుణం తీసుకోవడానికి ప్రయత్నించారు. వారి వాలకం చూసి బ్యాంకర్లకు అనుమానం వచ్చింది. ఆరా తీస్తే అసలు బండారం బయటపడింది. బ్యాంకర్లు చాకచక్యంగా వ్యవహరించి ఆ ముఠాను పోలీసులకు పట్టించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల, ఓబుళదేవరచెరువు మండల కేంద్రాల్లో కర్ణాటకకు చెందిన ముఠా నకిలీ బంగారం ఆభరణాలతో బ్యాంకర్లను బురిడీ కొట్టించే ప్రయత్నం చేసింది. స్థానిక రైతులకు కమీషన్ ఇస్తామని ప్రలోభపెట్టి, వారి పట్టాదారు పాసుపుస్తకాలపై ఈ ముఠా బంగారం రుణాలను తీసుకుంటున్నట్లు పోలీసులు, బ్యాంకర్లు గుర్తించారు. కర్ణాటకకు చెందిన నలుగురు ముఠా సభ్యులు, వాహన డ్రైవర్, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఇద్దరు రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిద్దరుగా విడిపోయి..

బెంగళూరు యలహంక ప్రాంతానికి చెందిన శంకర్, నంజుండప్ప, నగేష్, రఘు ముఠాగా ఏర్పడ్డారు. ఇద్దరు చొప్పున విడిపోయి మంగళవారం నాడు ఒక ఇద్దరు గోరంట్లకు, మరో ఇద్దరు ఓబుళదేవరచెరువుకు వెళ్లారు. గోరంట్లకు చెందిన రైతు శంకరప్పకు కమీషన్ ఆశ చూపి అతని పేరుపై ఉన్న పట్టాదారు పాసు పుస్తకంపై 16 తులాల బంగారం ఆభరణాలను తాకట్టు పెట్టుకోవాలని కోరారు. రైతును తీసుకుని గోరంట్ల స్టేట్ బ్యాంకుకు వెళ్లారు. వారు ఇచ్చిన బంగారాన్ని పరిశీలించిన బ్యాంకు అధికారులకు.. అది నకిలీదని అనుమానం వచ్చింది. కర్ణాటక వాసులను బయటకు పంపి, శంకరప్పను నిలదీశారు. దీంతో బంగారం తనది కాదని, కమీషన్ కోసం వచ్చానని రైతు చెప్పడంతో బ్యాంకు అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే బ్యాంకు తలుపులు మూసివేసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి ముగ్గురినీ అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో ఓబుళదేవరచెరువుకు వెళ్లి మరో ఇద్దరి బండారం బయటపడింది. దొరికిన ముఠా సభ్యులను పోలీసులు వెంటనే తమ వాహనంలో ఎక్కించుకుని ఓబుళదేవరచెరువుకు తీసుకెళ్లారు. ఈలోగా బ్యాంకు అధికారులు ఓబుళదేవరచెరువు బ్రాంచికి సమాచారం ఇచ్చారు. అక్కడి బ్యాంకు అధికారులు కూడా ప్రధాన ద్వారాలను మూసివేసి, స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అటు గోరంట్ల, ఇటు స్థానిక పోలీసులు ఓబుళదేవరచెరువు బ్యాంకుకు చేరుకుని, ముఠా సభ్యులు నగేశ్, రఘు, డబురువారిపల్లికి చెందిన రైతు జయప్ప, ముఠా సభ్యుల కారు డ్రైవర్ ముక్తియార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఓబుళదేవరచెరువులో 280 గ్రాముల నకిలీ బంగారాన్ని తాకట్టుపెట్టడానికి ప్రయత్నించారు. వీరు తెచ్చిన ఆభరణాల లోపల మైనం వంటి పదార్థాన్ని ఉంచి, బరువు పెంచినట్లు గుర్తించారు. నిందితులందరినీ పెనుకొండ పోలీసు సబ్ డివిజన్ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు. గోరంట్లలో ముగ్గురిపై, ఓబుళదేవరచెరువులో మిగతావారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెలలో ఈ ముఠా ఓబుళదేవరచెరువులోని ఎస్‌బీఐలో ఇదే తరహాలో నకిలీ బంగారం తాకట్టు పెట్టి రూ.30 లక్షలు రుణం తీసుకున్నట్లు పోలీసు విచారణలో తేలింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని గోరంట్ల, ఓబుళదేవరచెరువు ఎస్ఐలు రామచంద్ర, మల్లికార్జునరెడ్డి తెలిపారు.


MARUTI SUZUKI
NEXA
UNMISSABLE. UNMATCHED.
Grab the boldest deal of the year on your Baleno.
BALENO
EFFECTIVE PRICE OF
₹ 5.54 LAKH^
THE NEW AGE
BALENO
TECH GOES BOLD
1st in Segment
360 VIEW CAMERA
1st in Segment
HEAD UP DISPLAY
6 AIRBAGS AS STANDARD
IN-BUILT SUZUKI CONNECT
3 years 100 000 km WARRANTY*
EXTENDABLE UPTO 6 YEARS
NEXA SAFETY SHIELD
SCAN TO CONNECT TO A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY @ WWW.NEXAEXPERIENCE.COM
Contact us at
1800-200-6392
1800-102-6392
^Ex Showroom Price of ₹ 5.99 lakh, Consumer Offer (-) ₹ 25 000, Exchange Bonus (-) ₹ 15 000, Corporate Offer (-) ₹ 5 000, = ₹ 5.54 lakh. The actual Effective Price mentioned may vary based on the customer's eligibility, profile, and applicable offers at the time of purchase. T&C available at your nearest dealership. Creative visualization. For details on safety features, refer to the owner's manual, NEXA dealers exclusively provide all offers, which vary by model and variant and city. Offers are subject to availability of stock. Offer valid on Baleno SIGMA VARIANT till 31st Dec 2025. Not valid on CNG variants. Maruti Suzuki may withdraw offers without notice. Features and accessories shown can vary by variant. *3 years or 1 00 000 km, whichever is earlier.



మంత్రులు, శాఖాధిపతులు, కార్యదర్శుల సమావేశంలో ఉన్నతాధికారులు



శాఖా కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు, సీఎస్, డీజీపీ, మంత్రులు అనిత, అచ్చెన్న, అనగాని, నిమ్మల తదితరులు

డెడ్‌లైన్ జనవరి 15

రాష్ట్రంలో ఇక ఆన్‌లైన్‌లోనే పరిపాలన: సీఎం

- జిల్లా స్థాయిలోనూ ఈ-ఆఫీస్ ఫైల్సే
- మాన్యువల్‌గా పెడితే చర్యలు తప్పవు
- ఫైళ్ల క్లియరెన్స్ సగటున 15 రోజుల్లో పూర్తి కావాలి
- కేటాయించిన బడ్జెట్‌తోనే సరిపెట్టుకోవాలి
- అదనపు నిధులు ఇవ్వడానికి ఆర్థిక పరిస్థితి మెరుగుపడలేదు: చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పరిపాలన మొత్తం జనవరి 15లోగా ఆన్‌లైన్ కావలసిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు డెడ్‌లైన్ విధించారు. రాబోయే మూడు నెలల్లో ప్రజల్లో సంతృప్తి స్థాయి 80 శాతానికి చేరుకోవాలని టార్గెట్ పెట్టారు. 'రాజ్యాంగాన్నే అనేక సార్లు సవరించుకున్నాం. పరిపాలనలో బిజినెస్ రూల్స్ ఎందుకు సవరించకూడదు? కొందరు అధికారులు ఫైళ్లు త్వరగా పరిష్కరించడం లేదు. పైగా ఉన్న ఫైళ్లనే కిందకూ పైకీ తిప్పుతూ కొత్త ఫైళ్లు సృష్టిస్తున్నారు. అందుకే బిజినెస్ రూల్స్‌లో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం కమిటీని నియమించి సవరణలు చేద్దాం' అని చెప్పారు. ఫైళ్ల క్లియ

> - నా వద్ద కంటే సెన్సిటివ్ ఫైళ్లు మంత్రులకు ఉంటాయా? మీకు ఏదీ మినహాయింపు కాదు. సంబంధిత మంత్రి, సెక్రటరీలు చర్చించుకుని ఫైళ్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేయాలి.
> - అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలోకి వెళ్లారో లేదో ప్రభుత్వం నిఘా పెట్టే పరిస్థితి రాకూడదు. అంతవరకూ తెచ్చుకోవద్దు.
> - ప్రజలు సంతృప్తిగా లేకపోతే బంగారం ఇచ్చినా లాభం ఉండదు. మనం దయాధర్మంగా ఇస్తున్నది కాదు. ఇక్కడున్న టీమ్ అనుకుంటే 3 నెలల్లో భారీ మార్పులు తీసుకురావచ్చు.
>
> - సీఎం చంద్రబాబు

రెన్సు, ప్రభుత్వ శాఖల పనితీరుపై పాజిటివ్ రేటు, డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్‌పై బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఆయన కీలక సమీక్షలు జరిపారు. ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మంత్రులు, సెక్రటరీలు, కలెక్టర్లు, హెచ్‌వోడీల ఫైళ్ల క్లియరెన్స్ డేటా మొత్తాన్ని ఆయన ముందుంచారు. దానిని పరిశీలించిన చంద్రబాబు.. వారందరికీ క్లాసు తీసుకున్నారు. రోజుల తరబడి ఫైళ్లు పెండింగ్ పెట్టడం ఏమిటని నిలదీశారు. రాష్ట్ర స్థాయిలోనేగాక జిల్లా స్థాయిలోనూ ఎక్కడా మాన్యువల్ ఫైళ్లు ఉండకూడదని, జిల్లాల్లో ఈ-ఆఫీస్ ఫైల్స్ మాత్రమే ఉపయోగించాలని స్పష్టంచేశారు. జనవరి 15లోగా ఆన్‌లైన్ చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిలెన్స్ కేసులు ఉపసంహరించాలని వచ్చిన విన్నపాలకు సంబంధించిన ఈ-ఆఫీస్ ఫైళ్ల క్లియరెన్స్‌లో సమస్యలు వస్తున్నాయని భాస్కర్ తెలిపారు. మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి(రవాణా), కొల్లు రవీంద్ర(ఎక్సైజ్, గనులు), నాదెండ్ల మనోహర్ (పౌరసరఫరాలు)కు సంబంధించిన ఈ-ఆఫీస్ లాగిన్‌లో విజిలెన్స్ కేసుల ఫైళ్లు ఎక్కువగా ఉంటున్నాయని.. అలాగే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వద్ద డబ్బులకు సంబంధించిన ఫైళ్లు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. విజిలెన్స్ కేసుల ఫైళ్లు, సాధారణ ఫైళ్లను వేర్వేరు చేయాలని ఆదేశించారు. 'రేపు నేను మంత్రులందరినీ పిలిచి, దీనిపై సమీక్ష చేసి.. పూర్తిస్థాయిలో గైడ్‌లైన్స్ ఇస్తాం. మంత్రి, సెక్రటరీ, కలెక్టర్ ప్రతి ఒక్కరూ పాటించాల్సిందే. 15 రోజులకు మించి ఎవరి వద్దా ఫైళ్లు ఉండడానికి వీల్లేదు. పయ్యావుల వద్ద 11 రోజులుంటున్నాయి' అని తెలిపారు. ప్రజలు ఆఫీసుల చుట్టూ ఎందుకు తిరగాలని ప్రశ్నించారు. సీఎం ఇంకా చెప్పారంటే..

నిధులపై సెన్సిటివ్‌గా ఆలోచించాలి..

ప్రతి శాఖ అధికారులూ తమ శాఖకు కేటాయించిన బడ్జెట్‌లోనే ఖర్చు పూర్తి చేసుకోవాలి. క్షేత్ర స్థాయిలో సిబ్బంది జాప్యం చేస్తుంటే కార్యదర్శులదే బాధ్యత. క్రియాశీలంగా ఉన్న సెక్రటరీలు ఒకట్రెండు రోజుల్లోనే క్లియర్ చేస్తున్నారు. సెక్రటరీల్లో యువరాజ్ ఒక్కడే ఆలస్యంగా చేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో ఫైళ్ల క్లియరెన్స్‌కు 12 రోజులు తీసుకుంటున్నారు. సాంఘిక సంక్షేమం, ఐ అండ్ ఐ శాఖలు కూడా 11 రోజుల చొప్పున తీసుకుంటున్నాయి. చేనేత, టెక్స్‌టైల్స్ కమిషనర్ రేఖారాణికి వచ్చే ఫైళ్లే తక్కువ. అయినా 11 రోజులు ఎందుకు తీసుకుంటున్నారు? క్లియరెన్సులో చివరిలో ఉండే ప్రతి ఒక్కరూ ఇకపై ప్రతి సమావేశంలో వివరణ ఇవ్వాల్సి వస్తుంది. లీడర్ ఆన్‌లైన్‌లో వర్క్ చేస్తే అందరూ అదే ఫాలో అవుతారు. కాబట్టి ప్రతి ఒక్కరూ స్మార్ట్ వర్క్ చేయాలి.

జిల్లాల్లో పర్యటించాలి

వచ్చే 3 నెలల్లో సంతృప్త స్థాయి 80 శాతానికి చేరుకోవాలని టార్గెట్ ఫిక్స్ చేశాం. కొన్ని శాఖలు 90 శాతానికి చేరుకోవాలి. మంత్రులు, సెక్రటరీలు క్షేత్రస్థాయి పర్యటనలు పెంచాలి. ప్రజల్లో సంతృప్త స్థాయి పెంచడానికి మీరు చేయాల్సిన పని ఇదే. ఇక్కడే కూర్చుని మాట్లాడితే పాజిటివ్ రేటు పెరగదు. మంత్రులందరూ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాల్సిందే. 3 నెలల్లో ప్రతి ఒక్కరూ పనితీరు మెరుగుపరచుకోవాలి.

సర్వే వివరాలు..

16 శాఖలకు సంబంధించి 21 అంశాలపై సర్వే చేస్తున్నామని సమాచార-పౌరసంబంధాల కమిషనర్ విశ్వనాథన్ సీఎంకు తెలిపారు. 'ప్రజల్లో సంతృప్త స్థాయి 71.57% ఉంది. త్రైమాసికాలవారీగా చూస్తే ఇప్పుడు 75 శాతం ఉంది. 80 శాతం పాజిటివ్ రేటు లక్ష్యంగా పనిచేస్తున్నాం. అన్న క్యాంటీన్లకు సంబంధించి చిత్తూరు జిల్లా 84.6 శాతంతో ముందుంది. 77 శాతంతో కర్నూలు చివరి స్థానంలో ఉంది. పంచాయతీరాజ్‌లోని సాలిడ్ వేస్ట్ మెనేజ్‌మెంట్‌లో గుంటూరులో సంతృప్తి 72.7% ఉండగా.. అన్నమయ్య జిల్లాలో 49.5 శాతమే. రేషన్ తీసుకునేవారి సంఖ్య 70.7 నుంచి 82 శాతానికి పెరిగింది. నాణ్యతపై 80.5 శాతం సంతృప్తి పెరిగింది' అని చెప్పారు.

- దీపం-2లో గ్యాస్ డెలివరీ బాయ్ ప్రవర్తన 81 శాతానికి పెరిగింది. డబ్బులు డిమాండ్ చేయడం లేదని 60.3 శాతం మంది చెప్పారు. ఈ విషయంలో కృష్ణాలో సంతృప్తి ఎక్కువగా ఉంది. కర్నూలులో తక్కువుంది.
- బహిరంగ ప్రదేశాల్లో మహిళలకు ఇబ్బంది ఉందా అంటే లేదన్న వారు 71 శాతం నుంచి 80 శాతానికి పెరిగారు. పోలీసు స్పందనపై సంతృప్తి 68 శాతానికి పెరిగింది.
- రాష్ట్రంలో గంజాయి తగ్గిందా అని అడుగగా.. లేదన్న వారు 79 శాతానికి పెరిగారు. డ్రగ్స్ విషయంలో పోలీసు స్పందన 62 శాతానికి పెరిగింది. ఆలయాల్లో దర్శనం సంతృప్త స్థాయి 71 శాతానికి పెరిగింది. గత నెలలో 76 శాతం ఉంది.
- రెవెన్యూ విభాగంలో.. ఎఫ్ లైన్ కట్టిన వెంటనే నోటీసు వస్తోందా లేదా అని ప్రశ్నించగా 71 శాతం మంది వస్తోందని చెప్పారు. డబ్బులు అడగడం కూడా 75.7 శాతానికి తగ్గిపోయింది. కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని 55 శాతం మంది చెప్పారు. సర్వే సర్టిఫికెట్ ఇస్తున్నారని 55 శాతం మందే చెప్పారు. మ్యుటేషన్లపై క్షేత్రస్థాయికి వచ్చి విచారణ చేస్తున్నారని 65 శాతం మంది చెప్పారు.

వృద్ధిలో ఏపీ రయ్‌రయ్!

- రెండో త్రైమాసికంలో 11.28 శాతం నమోదు

అమరావతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం(క్యూ2)లో ఆంధ్రప్రదేశ్ వృద్ధిరేటు దూసుకుపోతోంది. జాతీయ వృద్ధిరేటును దాటేసి చాలా ముందంజలో ఉంది. రెండో త్రైమాసికం(క్యూ2)లో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 10.70 శాతం, పారిశ్రామిక రంగంలో 12.2 శాతం, సేవారంగంలో 11.3 శాతం వృద్ధి రేటు నమోదైంది. గత ఏడాది క్యూ2లో జీఎస్‌డీపీ 10.17 శాతం నమోదు కాగా ఈ ఏడాది 11.28 శాతానికి పెరిగింది.

సాగు పరికరాల బ్యాంక్

రైతుల కోసం ఏర్పాటు చేయాలని నిర్ణయం

- పరికరాల సమాచారానికి ఓ వెబ్‌సైట్
- వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల సాగు
- పంట ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించాలి
- పత్తి కొనుగోళ్లపై కేంద్రానికి లేఖ రాయాలి
- పంట కొనుగోళ్లపై సమీక్షలో సీఎం దిశానిర్దేశం



అమరావతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అవసరమైన ఆధునిక సాగు యంత్ర పరికరాల కోసం వ్యవసాయ పరికరాల బ్యాంక్ (అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్)ను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సాగు వ్యయం తగ్గేలా ఆధునిక యంత్ర పరికరాలను రైతులకు అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ధాన్యం, పత్తి, మిర్చి సహా వాణిజ్య పంటల కొనుగోళ్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించి, వ్యవసాయ పరికరాల సమాచారం అందుబాటులో ఉంచాలని సూచించారు. 2025-26లో 50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. 2,606 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నామని, 7.39 కోట్ల గోనె సంచులు రైతులకు అందుబాటులో ఉంచామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే రైతులకు డబ్బు చెల్లిస్తున్నామని వివరించారు. స్పందించిన సీఎం.. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు చూసుకోవాలని, ప్రజాప్రతినిధులంతా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులకు అండగా నిలబడాలని సూచించారు. పంట ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పించడంపైనా దృష్టి పెట్టాలన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా రాగులు, జొన్నలు, సజ్జల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చిరుధాన్యాల పంటలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

సీసీఐ తీరుపై సీఎం అసహనం

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లలో సీసీఐ వ్యవహరిస్తున్న తీరుపై సీఎం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి కొనుగోలుకు స్లాట్లు కేటాయింపు, ఇతర సాంకేతిక సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. 'పత్తి కొనుగోళ్లపై కేంద్రానికి లేఖ రాయాలి. మిర్చి లాంటి పంటలకు మార్కెట్ కల్పించే విషయంలో వివిధ విశ్లేషణ సంస్థలతో సమన్వయం చేసుకోవాలి. 45,420 హెక్టార్లలో సాగైన సుబాబుల్ కర్రకి మార్కెట్‌కు అనుగుణంగా రైతులకు ధర దక్కేలా చూడాలి. పంట ఉత్పత్తులకు ధరలు పడిపోకుండా, కనీస మద్దతు ధర దక్కేలా వాణిజ్య పంటల హార్వెస్టింగ్ ప్రక్రియలో రేషనలైజేషన్ విధానాన్ని పాటించాలి' అని అధికారులను ఆదేశించారు. సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.